# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

/manamnews
www.manamnews.com

హైదరాబాద్
మంగళవారం
26-09-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 237
పేజీలు : 12

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


భాద్రపద మాసం, మంగళవారం, తిథి : ద్వాదశి ఉ.05.01 వరకు, నక్షత్రం: శరవణ, ఉ:09.41 వరకు, వర్జ్యం: మ.01.16-02.42 వరకు, దుర్ముహూర్తం: ఉ.08.32-09.20 వరకు, రాహుకాలం: మ.03.06-04.36 వరకు



## 5 రోజులే గడువు

పెద్ద నోట్ల మార్పిడికి పెట్టిన డెడ్‌లైన్‌ను ఆర్బీఐ పొడగించే అవకాశం

ఒకరోజు దేశంలోని పలు ప్రాంతాల్లోని బ్యాంకులకు సెలవు

25 నుంచి 27 వరకూ బ్యాంకులు యథావిధిగా...

11



# మూసీ, ఈసీలపై ఫోర్‌లేన్ బ్రిడ్జీలు

## రూ.545 కోట్లతో 14 బ్రిడ్జిలకు శంకుస్థాపన

అక్టోబర్ చివరి నాటికి మూసీనీటి శుద్ధీకరణ పనులు పూర్తి

గత ప్రభుత్వాల వల్లే మురికి కూపంగా మూసీనది

సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పూర్తి చేసి ఈ బ్రిడ్జిలు కడుతున్నాం

గోదావరి జలాలతో గండిపేట చెరువును నింపుతాం

త్వరలోనే డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ

మరో 40 వేల ఇండ్లు అందజేత: మంత్రి కేటీఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్):** మూసీ, ఈసీపై రూ.545 కోట్లతో 14 బ్రిడ్జిలు నిర్మిస్తున్నామని, అక్టోబర్ చివరి నాటికి మూసీనీటి శుద్ధీకరణ పనులు పూర్తవుతాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఫతుల్లగూడ-ఫీర్జాదీగూడ బ్రిడ్జికి రాష్ట్ర మంత్రి కేటీఆర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జిహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం మంత్రి కేటీఆర్ ఉప్పల్ శిల్పారామం వద్ద 5 మూసీ వంతెనలకు శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలోనే రూ.152 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం జరుగుతున్న మూసారాంబాగ్-అంబర్‌పేట మూసీ వంతెనలకు శంకుస్థాపన చేసిన మంత్రి కేటీఆర్ అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మూసీ పరిరక్షణలో భాగంగా ఇవాళ కీలకమైన రోజు అని, హైదరాబాద్ మహా నగరానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చిన నదిగా ..మిగతా 2లో



## 72అడుగుల ఎత్తైన దీన్‌దయాళ్ విగ్రహావిష్కరణ

విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించిన మోడీ

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ జీవితం అందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం : ప్రధాని మోడీ

వివరాలు.. 11లో

## కాంగ్రెస్ తుప్పుపట్టిన ఇనుములాంటిది

వర్షంలో నానితే పూర్తిగా నాశనమే!

అవినీతిలో కూరుకుపోయిన వంశపారంపర్య పార్టీ

వాళ్లకు కష్టాలు తెలియవు.. అందుకే ఎలాంటి అభివృద్ధి చేయలేదు:ప్రధాని

కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగిస్తే మళ్లీ రాష్ట్రాన్ని రోగిష్టిగా మారుస్తుంది

దీన్ దయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాలకు ఆదర్శం

బీజేపీ కార్యకర్తల మహాకుంభ్ కార్యక్రమంలో ప్రధాని మోడీ



## తమిళ నాట తంబి దూరై

తమిళనాట ట్విస్ట్..

ఎన్డీఏకు అన్నాడీఎంకే గుడ్‌బై..

బీజేపీతో అన్నాడీఎంకే తెగతెంపులు

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో.. అన్నాడీఎంకే కీలక నిర్ణయం

బీజేపీ పార్టీతో ఉన్న పొత్తు ఒప్పందాన్ని రద్దు చేసుకున్నది

11



## రైలులో రాహుల్ హల్‌చల్

బిలాస్‌పూర్ నుంచి రాయ్‌పూర్ ట్రైన్‌లో ప్రయాణించిన రాహుల్ గాంధీ

11

మొన్న రైల్వే కూలీ.. నేడు రైల్వే ప్యాసింజర్.. సర్‌ప్రైజ్ చేసిన రాహుల్

దేశవ్యాప్తంగా ప్రజల్లోకి దూసుకెళ్తూ వినూత్నంగా ముందుకు...



## ఎన్డీయేలో తిరిగి చేరే ప్రసక్తే లేదు

ఎన్డీయే విడాది క్రితమే బంధం తెగిపోయింది

ఇండియా కూటమిని బలోపేతం చేయడమే లక్ష్యం

ఎన్డీయేలో తిరిగి చేరతారనే మీడియాలో వచ్చే ఊహాగానాలను తోసిపుచ్చారు

జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్

11

## కాంగ్రెస్‌లో వైఎస్సార్టీపీ విలీనం



పార్టీ విలీనంపై 30లోపు నిర్ణయం

నేనేం చేసినా తెలంగాణ ప్రజల కోసమే.. నా తాపత్రయం..

అన్ని విషయాలు త్వరలోనే చెబుతా


వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

వివరాలు.. 2లో

## కాంగ్రెస్‌కు 78 సీట్లు ఖాయం

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీల అమలు



# సర్కార్‌కు షాక్..

గవర్నర్ తమిళిసై సంచలన నిర్ణయం

కేసీఆర్‌కు మరోసారి షాకిచ్చిన గవర్నర్

గవర్నర్ కోటాలో అభ్యర్థిత్వాలను తిరస్కరించిన తమిళిసై

దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణకు బిగ్ షాక్

రాజకీయం మరోసారి ఆసక్తికరంగా మారింది

**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్):** తెలంగాణలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేసీఆర్ ప్రభుత్వం మధ్య వ్యవహారం నువ్వా-నేనా అన్నట్టు కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా గవర్నర్ తమిళిసై మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్సీల కోటాలో ప్రభుత్వం పంపిన సిఫార్సులను గవర్నర్ తిరస్కరించారు. దీంతో, తెలంగాణలో రాజకీయం మరోసారి ఆసక్తికరంగా మారింది. వివరాల ప్రకారం.. తెలంగాణ గవర్నర్ తమిళిసై.. కేసీఆర్ సర్కార్‌కు మళ్లీ షాకిచ్చారు. రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను తిరస్కరించారు. దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ అభ్యర్థిత్వాలను గవర్నర్ తిరస్కరించారు. ఈ మేరకు ప్రభుత్వం పంపిన సిఫార్సులను తమిళిసై తిరస్కరించారు. ఇక, అంతకుముందు కూడా గవర్నర్ తమిళిసై ఎమ్మెల్సీ కోటా కింద పాడి కౌశిక్ రెడ్డి ..మిగతా 2లో



## గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు.. అప్పీల్‌కు వెళ్లిన టీఎస్‌పీఎస్సీ

అత్యవసర విచారణకు లంచ్ మోషన్ అనుమతి కోరిన కమిషన్

నేడు విచారణకు జరిపేందుకు అంగీకరించిన డివిజన్ బెంచ్

2



## విషాద ఘటన..

బాలుడిని కాపాడబోయి.. చెరువులో పడి

ముగ్గురు మహిళలు మృతి.. బాలుడు గల్లంతు

2

# ఇది పూర్తిగా అప్రజాస్వామికం



గవర్నర్ తమిళిసైకి నైతిక విలువలు లేవు..

గవర్నర్‌పై మంత్రి ప్రశాంత్ రెడ్డి ఫైర్


నిబంధనలను తుంగలో తొక్కి తమిళిసైని గవర్నర్ చేశారు

గవర్నర్‌గా ఆమెకు కొనసాగే అర్హత లేదు

బీజేపీ చీఫ్‌గా ఉన్న తమిళిసై.. గవర్నర్‌గా రాలేదా?

తెలంగాణ సమాజాన్ని అవమానపరిచినట్టే..

**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్):** తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మరో సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కేసీఆర్ ప్రభుత్వం ఎమ్మెల్సీ కోటాలో పంపిన(దాసోజు శ్రవణ్, సత్యనారాయణ) సిఫార్సులను గవర్నర్ తిరస్కరించారు. ఈ క్రమంలో రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్న వ్యక్తులకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించలేనని, అర్హుల ..మిగతా 2లో



## సొంత గూటికి కుంభం

రేవంత్ సమక్షంలో చేరిక.. రెండు నెలలకే యూటర్న్

బీఆర్ఎస్‌లో గుర్తింపు లేదన్న భావన

వివరాలు.. 2లో

## గ్రూప్-1 నిర్వహించే సత్తాలేని సర్కారు ఇది

టిఎస్‌పిఎస్సీ నిర్వాకంతో 30 లక్షల మంది బతుకులు బజార్ల పడ్డాయి

యువత భవిష్యత్ నాశనమవుతుంటే కేసీఆర్ నోరెత్తటం లేదు

లక్షలు ఖర్చు చేసి సిద్ధమైన వారికీ ఉద్యోగాలపై ఆశ లేకుండా పోయింది : బండి సంజయ్



వివరాలు.. 2లో

### మంచిమాట

నీ గమ్యం చేరే దారిలో
ఈర్ష్య పడే కళ్ళుంటాయి.
ఎత్తిచూపే వేళ్ళుంటాయి.
వ్యంగంగా మాట్లాడే నోళ్ళు
ఉంటాయి. బెదిరావో నీ గమ్యం
చేరలేవు. సాగిపో నిరంతరంగా..
పరిస్థితులు ఎప్పుడూ స్థిరం కాదు.
కష్టం ఎప్పుడు వృధా పోదు.

శుభోదయం

# సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎయిర్ అంబులెన్సులు

హెలికాప్టర్ ద్వారా వారిని దవాఖానకు తరలిస్తాం

ఇదే వేదికగా 310 మంది ఫార్మసిస్టులకు మంత్రి హరీశ్‌రావు పోస్టింగ్ ఆర్డర్స్

నిమ్స్ ఆస్పత్రిలో ఆరు నెలల్లోనే 100 కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ ఆపరేషన్లు

9 ఏళ్లలో వైద్య శాఖలో 22,600 పోస్టులు భర్తీ

మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్): త్వరలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎయిర్ అంబులెన్సులు ప్రవేశపెట్టబోతున్నాం అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏ మూలన అత్యవసర పరిస్థితి ఏర్పడిన హెలికాప్టర్ ద్వారా వారిని దవాఖానకు తరలిస్తాం. కోటీశ్వరులకే పరిమితమైన ఈ సేవలను పేదలకు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌ది మాత్రమే అని మంత్రి స్పష్టం చేశారు. రవీంద్ర భారతి వేదికగా తెలంగాణ వైద్యారోగ్య శాఖ పదేళ్ల ప్రగతి నివేదికను మంత్రి హరీశ్ రావు సోమవారం విడుదల చేశారు. ఇదే వేదికగా 310 మంది ఫార్మసిస్టులకు మంత్రి హరీశ్‌రావు పోస్టింగ్ ఆర్డర్స్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. నేడు ఫార్మసిస్టులుగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతూ వైద్య ఆరోగ్యశాఖ కుటుంబంలో చేరుతున్న 310 మంది ఫార్మసిస్టులకు స్వాగతం తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలో 105, టీవీవీపీ పరిధిలోని 135, డీఎంఈ 70 పోస్టులకు గాను మొత్తం 310 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో సేవలు బాగుండాలంటే అందరికీ తగినన్ని ఔషధాలు ఉండాలి. ఔషధాలను సమకూర్చడం, రోగులకు అందించడంలో ఫార్మసిస్టులది కీలకపాత్ర. ప్రభుత్వ ఉద్యోగం అనేది గొప్ప అవకాశం. ప్రైవేటు ఉద్యోగాలతో ఉపాధి దొరికితే.. ప్రభుత్వ ఉద్యోగులకు.. ప్రజలకు సేవ చేసే అవకాశం కలుగుతుంది. రోగులకు చిరునవ్వుతో మందులు అందిస్తే వారు ఎంతో సంతోషిస్తారు అని హరీశ్‌రావు తెలిపారు. 9 ఏళ్లలో వైద్య శాఖలో 22,600 పోస్టులు భర్తీ చేసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. మరో 7291 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో 5204 స్టాఫ్ నర్స్ పరీక్ష పూర్తీ అయ్యింది, వారంపది రోజుల్లో ఫలితాలు ఇస్తాం. 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు, 1931 ఓఖఊం ఫీమేల్ (అప్లికేషన్ స్టేజ్) పోస్టులు ఉన్నాయి. ఇవి కూడా పూర్తయితే పదేళ్లలోనే 30 వేల ఉద్యోగాలు వైద్య శాఖలో ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని మంత్రి స్పష్టం చేశారు. వైద్యారోగ్య శాఖ పదేళ్ల ప్రగతి నివేదిక విడుదల చేయడం సంతోషంగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మార్గనిర్దేశంలో, మా ప్రభుత్వం, మా వైద్యారోగ్య శాఖ పని తీరుకు నిదర్శనం ఈ నివేదిక. పదేళ్ల ప్రయాణాల్లో ఆరోగ్య రంగంలో తెలంగాణ దేశానికి రోల్ మోడల్ అయ్యింది. అరవై ఏళ్లలో సాధ్యం కాని అద్భుతాలను దశాబ్ద కాలంలోనే ఆవిష్కరించింది. దీనికి కర్త, కర్మ, క్రియ అన్నీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని స్పష్టం చేశారు. 2014లో నీతి ఆయోగ్ ఆరోగ్య సూచీలో 11వ స్థానంలో ఉంటే, ఇప్పుడు 3వ ర్యాంకుకు చేరుకున్నాం. మొదటి స్థానానికి చేరడానికి అడుగులు వేస్తున్నాం. వైద్య సిబ్బంది సమిష్టి కృషివల్లే ఇది సాధ్యమైంది అని హరీశ్‌రావు తెలిపారు.



ప్రజలకు మంచి సేవలు అందించడంలో, ప్రజల ప్రాణాలు కాపాడటంలో నిత్యం నిమగ్నమై కృషి చేస్తున్న మా వైద్యారోగ్య శాఖలోని ప్రతి ఒక్కరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఒకప్పుడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖాన అంటే, నేడు సీఎం కేసీఆర్ పాలనలో పోదాం బిడ్డో సర్కారు దవాఖానకే అనేలా మార్పు జరిగిందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మంత్రమేస్తేనో, మాయ చేస్తేనో జరిగిన అద్భుతం కాదిది. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 12,364 కోట్ల బడ్జెట్ పెట్టుకున్నాం. ఒక్కొక్కరి వైద్యం పట్ల చేస్తున్న తలసరి ఖర్చు రూ. 3,532. దేశంలో మూడో స్థానం. తెలంగాణ వైద్యారోగ్య రంగం ఎటువంటి హెల్త్ ఎమర్జెన్సీని అయినా తట్టుకోవడానికి సర్వ సన్నద్ధంగా రూపొందింది. మొత్తం 50 వేల పడకలతో కరోనా కాదు దాని తాత వచ్చినా ఎదుర్కొనేలా సిద్ధమైందని మంత్రి స్పష్టం చేశారు. 119 నియోజక వర్గాల్లో ఒక్కో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని మంత్రి తెలిపారు. అవయవ మార్పిడుల్లో దేశంలోనే తెలంగాణ భవిష్కరణలో ఉందని కేంద్రం ఇటీవలే చెప్పింది. ముఖ్యంగా నిమ్స్ ఆస్పత్రిలో ఆరు నెలల్లోనే 100 కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ ఆపరేషన్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సిబ్బంది అందరికీ అభినందనలు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 8వ ఫ్లోర్‌లో ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం అని మంత్రి పేర్కొన్నారు. ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌లో ప్రతినెల సగటున 8 మందికి బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్ ఉచితంగా చేస్తున్నారు. రాబోయే రోజుల్లో దేశ విదేశాల నుంచి వచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో అవయవ మార్పిడులు చేసుకునేలా మారబోతున్నాయి. ఔషధాల అందుబాటు, పంపిణీ ప్రక్రియలో తెలంగాణ గతంలో మూడో స్థానంలో ఉండేది. త్వరలో రెండో స్థానంలోకి చేరబోతుంది. కొత్తగా ఫార్మసిస్టులు చేరికతో మొదటి స్థానానికి చేరుకుంటుందని ఆశిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు. నిమ్స్‌లో ఈరోజు నుంచి వారం రోజులపాటు బ్రిటన్‌కు చెందిన వైద్యుల బృందం ఉచితంగా చిన్న పిల్లలకు గుండె ఆపరేషన్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా బ్రిటన్ బృందానికి నేతృత్వం వహిస్తున్న డాక్టర్ అరున్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను అని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులు దీవెనలు ఉన్నంతకాలం వైద్య ఆరోగ్య శాఖను మరింత ముందుకు తీసుకుపోతాం. పీహెచ్‌సీ స్థాయి నుంచి అన్ని స్థాయి దవాఖానాల్లో ప్రగతి నివేదికను ప్రదర్శించాలని అధికారులకు సూచించాం. మా రిపోర్టును చూసే ప్రజలంతా ఆశీర్వదించండి. మరింత ఉత్సాహంతో సేవలు అందిస్తాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌కు 78 సీట్లు ఖాయం

ఖమ్మం, సెప్టెంబర్ 25 (మనం న్యూస్): వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పదితో పాటు రాష్ట్రంలో 74 నుంచి 78 సీట్లు గెలిచి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన బీఆర్ఎస్ ఒక వైపు, ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న కాంగ్రెస ఒక వైపు ఎన్నికల బరిలో ఉన్నాయని ఆయన అన్నారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్లో చేరాక తొలిసారిగా సోమవారం ఖమ్మం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగగా.. తుమ్మలకు భట్టితో పాటు మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు.

## సర్కార్‌కు షాక్..

(మొదటిపేజీ తరువాయి)

విషయంలో కూడా ప్రభుత్వ సిఫార్సులను కొద్దిరోజులు హోల్డ్‌లో పెట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ.. దాసోజు శ్రవణ్, సత్యనారాయణ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. కళలు, సాహిత్యం, సైన్స్ రంగంలో వీరిద్దరూ పెద్దగా కృషి చేయలేదు. గవర్నర్ కోటాలో నామినేట్ చేసే అర్హతలు వీళ్లకు లేవు. ఆర్టికల్ 171(5) ప్రకారం అభ్యర్థుల ఎంపిక జరగలేదు అని అన్నారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఇటీవలే బీజేపీలో చేరారు. అనంతరం, కొన్ని పరిణామాల నేపథ్యంలో అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరిపోయారు.

## గవర్నర్ చేయాల్సింది ఇలాగే!

కేసీఆర్ తన కుటుంబానికి సేవచేసే వారిని ఎమ్మెల్సీలు చేయాలని చూస్తున్నారు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్): నామినేటెడ్ ఎమ్మెల్సీల నియామకం విషయంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిచెప్పారు. గవర్నర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని.. ఆమెకు రాష్ట్ర ప్రజల తరపున అభినందనలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. గవర్నర్ కోటా, రాష్ట్రపతి కోటా పదవులు అంటే మేధావులు, విద్యావంతులు, కవులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాల్సినవని స్పష్టం చేశారు. కేసీఆర్‌కుటుంబానికి సేవ చేసే వ్యక్తులను గవర్నర్‌కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం హైదరాబాద్లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డిమీడియాతో మాట్లాడారు. గతంలో కూడా క్రిమినల్‌కేసులున్న వ్యక్తులను ఎమ్మెల్సీలుగా నియమించాలని సీఎం కేసీఆర్ ప్రతిపాదనలు పంపితే గవర్నర్తిరస్కరించారని గుర్తుచేశారు.

బీఆర్ఎస్ ఎవరికి టికెట్లు ఇస్తుందంటే.. కేసీఆర్ కాళ్ల దగ్గరపడి ఉండేవాళ్లకు, వాళ్ల మోచేతి నీళ్లు తాగేవాళ్లకు, ఆత్మగౌరవం లేని వాళ్లకు ఇస్తుంది. గవర్నర్‌కోటా నామినేటెడ్పోస్టులు కూడా అలాంటి వారికే ఇవ్వాలంటారా? అనేక పార్టీలు ఫిరాయించిన వారు, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సేవచేసే వారిని గవర్నర్తిరస్కరించా రు. అలాగే చేయాలి కూడా. ఈ విషయంలో గవర్నర్నిర్ణయం స్వాగతించదగినదని కిషన్‌రెడ్డిపేర్కొన్నారు.

**రాజకీయాలకు అతీతంగా ఉండాలి**

ప్రధాని మోదీ పార్టీలు, రాజకీయాలకు అతీతంగా బీజేపీకి ఏమాత్రం సంబంధం లేని సినీ కథా రచయిత విజయేంద్ర ప్రసాద్‌ను, పీటీ ఉష వంటి అంతర్జాతీయ క్రీడాకారిణిని ఎంపీలుగా ప్రతిపాదించగా రాష్ట్రపతి ఓకే చేశారని కిషన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో గవర్నర్ సరిగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలను ఓ విలేకరి ప్రస్తావించగా.. కేసీఆర్‌కు అనుకూలంగా ఉంటేనే గవర్నర్ సరిగా వ్యవహరించినట్టా? కేసీఆర్ తప్పిదాలను ఎత్తి చూపుతూ ధైర్యంగా నిర్ణయం తీసుకుంటే సరికాదా? గవర్నర్ స్వతంత్రంగా వ్యవహరిసారు. ఆ పదవికి ఏ పార్టీతో సంబంధం ఉండదని కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు.

## బీఆర్ఎస్‌కు బిగ్ షాక్..

కాంగ్రెస్‌లోకి సిట్టింగ్ ఎమ్మెల్యే!

టికెట్ ఇవ్వకపోవడంపై గుస్సా..



ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్): తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పలు పార్టీల్లో సీనియర్ నేతలు కూడా ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. పరిస్థితి బట్టి అధికార పార్టీ సహా ప్రతిపక్ష పార్టీల్లోకి జంప్ అవుతున్నారు. తాజాగా మరో కీలక నేత బీఆర్ఎస్‌ను వీడుతున్నట్టు వెల్లడించారు. ఆయన హస్తం గూటిలో చేరుతున్నట్టు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. వివరాల ప్రకారం.. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు బీఆర్ఎస్ పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో పార్టీ నేతలతో బాపూరావు సమాలోచనలు, చర్చలు జరిపారు. తాను ఎమ్మెల్యేగా తప్పు చేయలేదని, పార్టీకి నష్టం చేయలేదని ఆయన అన్నారు. కొంతమంది చెప్పుడు మాటలు విని తనకు టికెట్ ఇవ్వలేదని ఆరోపించారు. మరో నాలుగు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తానని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా తాను ఏ పార్టీలో చేరుతున్న విషయం మాత్రం చెప్పలేదు. అయితే, బాపూరావు కాంగ్రెస్‌లో చేరబోతున్నట్టు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

**కేటీఆర్ నో అపాయింట్‌మెంట్..**

మరోవైపు.. మూడు రోజుల క్రితం మంత్రి కేటీఆర్ అపాయింట్ మెంట్ కావాలని కోరారు రాథోడ్ బాపూరావు. దీనికి కేటీఆర్ స్పందించకపోవడంతో.. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. ఇక, బోథ్ నుంచి అనిల్ జాదవ్‌కు టికెట్ కేటాయించారు సీఎం కేసీఆర్. దీంతో రాథోడ్ బాపురావు అసంతృప్తితో ఉన్నారు. పార్టీ మారాలంటూ ఆయన మద్దతుదారులు ఒత్తిడి తేవడంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కాగా, మొదట పార్టీని వీడే అంశంపై రాథోడ్ బాపురావు విముఖత వ్యక్తం చేశారు. తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇదిలా ఉండగా.. అధికార బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ వచ్చే ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పలువురు సిట్టింగ్లకు టికెట్ లభించకపోవడంతో వారు పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇతర పార్టీలవైపు చూస్తున్నారు. ఇప్పటికే కొంత మంది బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్, బీజేపీలో చేరిపోయారు.

## ఇది పూర్తిగా అప్రజాస్వామికం

(మొదటిపేజీ తరువాయి)

పేర్లను ప్రతిపాదించాలని గవర్నర్ తమిళిసై సూచించారు. దీంతో, తెలంగాణలో మరోసారి రాజకీ యం రసవత్తరంగా మారింది. దీంతో, గవర్నర్‌పై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా, తెలంగాణ గవర్నర్ తమిళిసైపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సీరియస్ కామెంట్స్ చేశారు. మంత్రి ప్రశాంత్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. గవర్నర్‌గా కొనసాగే నైతిక అర్హత తమిళిసై సౌందరరాజన్‌కు లేదు. ఆమె రాజ్‌భవన్‌ను రాజ కీయ అడ్డాగా మార్చుకుని పాలిటిక్స్ చేస్తున్నారు. గవర్నర్ కోటా ఎమ్మె ల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపి పంపితే వారికి రాజకీయా నేపథ్యం ఉందని రిజెక్ట్ చేయడం అత్యంత దుర్మార్గం. అత్యంత వెనుక బడిన కులాలకు (ఎంబీసీ) చెందిన సామాజిక కార్యకర్త దాసోజు శ్రవణ్, షెడ్యూల్ తెగకు (ఎస్టీ) చెందిన సామాజిక కార్యకర్త కుర్రా సత్యనారాయణ లను రిజెక్ట్ చేయడం యావత్ తెలంగాణ సమాజాన్ని అగౌరవపర్చినట్టే. తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉంటూ తెలంగాణ గవర్నర్‌గా తమిళిసై నియమించబడబడలేదా అని ప్రశ్నించారు. తెలంగాణ గవర్నర్కు నైతిక విలువలు ఉంటే ఆమె వెంటనే పదవికి రాజీనామా చేయాలి. సర్కారియ కమిషన్ చెప్పినట్టు రాజకీయాలకు సంబంధంలేని వారిని గవర్నర్లుగా నియమించాలని గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీ పలుమార్లు వ్యాఖ్యలు చేశారు. సర్కారియ కమిషన్ సూచనలు తుంగలో తొక్కి ఒక రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిని గవర్నర్‌గా నియమించారు. ఇది పూర్తిగా అప్రజాస్వామికం. గవర్నర్ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాము అని కామెంట్స్ చేశారు.

## మూసీ, ఈసీపై ఫోర్‌లేన్ బ్రిడ్జీలు

(మొదటిపేజీ తరువాయి)

మూసీనది ఉండేదని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో మూసీనది మురికి కూపంగా మారిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మూసీ సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయని మంత్రి కేటీఆర్ తెలిపారు.

**శాశ్వతంగా, దీర్ఘకాలికంగా ఉండేలా ఈ బ్రిడ్జిల నిర్మాణం**

మూసీ, ఈసీపై రూ.545 కోట్లతో 14 బ్రిడ్జిలకు శంకుస్థాపన చేసుకుంటున్నామని, నిధులు పెరిగినా పరవాలేదని, హైదరాబాద్ ఒక అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించాలని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శాశ్వతంగా, దీర్ఘకాలికంగా ఉండేలా ఈ బ్రిడ్జిల నిర్మాణం చేపడుతామన్నారు. 2 వేల మిలియన్ లీటర్స్ ఫర్ డే కెపాసిటీతో ఎస్టీపీల నిర్మాణం చేస్తున్నామని ఆయన తెలిపారు. దుర్గం చెరువు వద్ద 7 ఎంఎల్డీ కెపాసిటీ ఎస్టీపీని నిర్మించామని, ఎస్టీపీలు పూర్తయితే మూసీలోకి పూర్తి స్థాయి శుద్ధి చేసిన నీటిని వదిలే పరిస్థితి నెలకొంటుందన్నారు. మంచిరేవుల-ఘట్కేసర్ వరకు మూసీ నదిని అద్భుతంగా సుందరీకరించాలన్న సిఎం కలను నెరవేరుస్తామన్నారు.

ఒక్కొక్కటిగా సివరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను పూర్తి చేసి ఈ బ్రిడ్జిలు కడుతున్నామన్నారు. మూసారాంబాగ్‌లో 2020లో వరదలు వచ్చినప్పుడు చాలా ఇబ్బందులు వచ్చాయని మంత్రి గుర్తు చేశారు. కరోనా కారణంగా కొన్ని పనులను చేయలేకపోయామని, 100శాతం మురుగు నీటిని శుద్ధి చేయాలని ఎస్టీపీలను నిర్మిస్తున్నామని కేటీఆర్ చెప్పారు. దుర్గం చెరువుపై నిర్మించిన వంతెన కంటే అందమైన వంతెనలను నిర్మిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.160 కిలోమీటర్ల ఓఆర్ఆర్ చుట్టూ తిరగకుండా మధ్యలో మూసీనది మీదుగా వెళ్లే విధంగా ఈ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుందన్నారు. రూ.5వేల కోట్లతో రెండో విడత ఎస్ఎన్డీపీ తొందరలోనే చేపడుతామని, జీఓ 118లోని చిన్న చిన్న టెక్నికల్ సమస్యలను పరిష్కరిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. గోదావరి జలాలతో గండిపేట చెరువును నింపుతామని కేటీఆర్ పేర్కొన్నారు. తొమ్మిది సంవత్సరాలలో ఎంతో అభివృద్ధిని సాధించామని చెప్పారు. ఇప్పటికే 30,000 డబుల్ బెడ్ రూం ఇండ్లను పంపిణీ చేసుకున్నామని అన్నారు. త్వరలోనే మరో 40,000ల ఇళ్లను పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగానే కేటీఆర్ దుర్గంచెరువు వద్ద ఎస్టీపీని, మ్యూజికల్ ఫౌంటెన్‌ను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం హుస్సేన్ సాగర్‌లో ఏర్పాటు చేసిన మ్యూజికల్ ఫౌంటేన్ నగరవాసులకు కనువిందు చేస్తుండగా.. మాదాపూర్ దుర్గం చెరువులో కూడా అధికారులు మరో ఫౌంటేన్‌ను ఏర్పాటు చేశారు. 40 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేసిన ఈ ఫౌంటేన్‌ను కేటీఆర్ ప్రారంభించనున్నారు. కేబుల్ వంతెనకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేశారు. ఈ ఫౌంటేన్ ప్రారంభమైతే దుర్గం చెరువు వద్ద పర్యాటకులకు కనువిందు కానుంది.



## గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు.. అప్పీల్‌కు వెళ్లిన టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్): గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై టీఎస్పీఎస్సీ అప్పీలుకు వెళ్లింది. ప్రిలిమ్స్‌ను రద్దు చేస్తూ ఈనెల 23న సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను టీఎస్‌పీఎస్సీ ఆశ్రయించింది. అత్యవసర విచారణకు లంచ్‌మోషన్ అనుమతి కోరింది. అయితే లంచ్‌మోషన్ పిటిషన్ విచారణకు నిరాకరించిన హైకోర్టు.. నేడు (మంగళవారం) విచారణ జరిపేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ అంగీకరించింది. కాగా జూన్ 11న నిర్వహించిన గ్రూప్ -1 ప్రిలిమ్స్‌ను రద్దు చేస్తూ ఈ నెల 23న హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. వాస్తవానికి 11 ఏళ్ల తర్వాత గతేడాది అక్టోబరు 16న తొలిసారి ప్రిలిమ్స్ నిర్వహించారు. తరువాత ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణం వెలుగుచూడటంతో కమిషన్ ఆ పరీక్షను రద్దు చేసింది. తిరిగి జూన్ 11న ప్రిలిమ్స్ నిర్వహించగా.. ఈ పరీక్షను కూడా రద్దు చేస్తున్నట్లు ఈనెల 23న హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చింది. దీంతో గ్రూప్-1 ప్రిలిమ్స్ రెండుసార్లు రద్దవడంతో ఇటు అభ్యర్థులతోపాటు కమిషన్‌లోనూ తీవ్ర ఆందోళన నెలకొంది. గ్రూప్1 పరీక్ష రద్దు కావడంపై అభ్యర్థులు మండిపడుతున్నారు. పదే పదే పరీక్షలు రద్దు చేస్తే ఎలా చదవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీఎస్పీఎస్సీ నిర్లక్ష్యం వల్ల తమ జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గవర్నర్ స్పందించకపోవడంపై మండిపడుతూ.. వెంటనే టీఎస్పీఎస్సీ ఛైర్మెన్ జనార్దన్ రెడ్డిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

## గ్రూప్-1 నిర్వహించే సత్తా లేని సర్కారు ఇది

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్): తెలంగాణ బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మరో సారి బీఆర్ఎస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్‌లో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. దీన్ దయాల్ జయంతి వేడుకల్లో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ గ్రూప్-1 నిర్వహించే సత్తాలేని సర్కారు ఇది. టిఎస్‌పిఎస్సీ నిర్వాకంతో 30 లక్షల మంది బతుకులు బజార్ల పడ్డాయి. యువత భవిష్యత్ నాశనమవుతుంటే కెసిఆర్ నోరెత్తటం లేదు అని ప్రశ్నించారు. లక్షలు ఖర్చు చేసి సిద్ధిమైన వారికి ఉద్యోగాలపై ఆశ లేకుండా పోయిందన్నారు. టెన్త్, ఇంటర్, గ్రూప్-1 అన్ని పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నిరుద్యోగ భృతి బకాయిలతో సహా చెల్లించాలే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు చేయడంతో అభ్యర్థులు నిరసనలకు దిగుతున్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్క మిషన్ నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను హైకోర్టు రద్దు చేయడంపై సోమవారం డివిజన్ బెంచ్లో అప్పీల్ పిటిషన్ వేయాలని కమిషన్ నిర్ణయించినట్లు సమాచారం.

## సొంత గూటికి కుంభం

యాదాద్రి/హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్): రెండు నెలల క్రితం బీఆర్ఎస్లో చేరిన యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం రాత్రి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానించారు. ఇందుకు కుంభం సానుకూలంగా స్పందించడంతో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పారు.దీంతో అనిల్‌కుమార్‌రెడ్డి తిరిగి సొంత గూటికి చేరినట్లయింది. డీసీసీ అధ్యక్షుడి హోదాలో స్వయంగా సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్లో చేరినా అక్కడ ఇమడలేకపోయారు. బీఆర్ఎస్లో చేరిన తర్వాత తనకు సరైన గుర్తింపు, ప్రజల్లోకి వెళ్లడానికి ప్రొటోకాల్ లేదన్న అభిప్రాయంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పిస్తామని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీతో పార్టీ కండువా కప్పుకున్నారు. కాగా కాంగ్రెస్‌లోకి తిరిగి వెళ్తున్నాడన్న సమాచారంతో మంత్రులు సోమవారం ఫోన్లో మాట్లాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని అంటున్నారు. కాగా, రెండు నెలల క్రితం జరిగిన తప్పిదాన్ని సరిదిద్దుకున్నానని కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్‌లో వైఎస్సార్టీపీ విలీనం

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్టీపీ విలీనంపై గత కొన్ని నెలలుగా వార్తలు వస్తూనే ఉన్నాయి. వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వరుసగా బెంగళూరు, ఢిల్లీ వేదికగా సమావేశాలు కావడం, మంతనాలు జరపడం.. అదిగో, ఇదిగో విలీనం అంటూ హడావుడి జరగడం తప్పితే ఇంతవరకూ ఈ ప్రక్రియలో కదలిక లేదు. ఓ వైపు ఎన్నికలు సమీపిస్తుండటం.. మరోవైపు పార్టీలోని నేతలు ఒక్కొక్కరుగా చేజారుతున్న తరుణంలో షర్మిల కీలక ప్రకటన చేశారు. సెప్టెంబర్-30 లోపు విలీనంపై కాంగ్రెస్ తేల్చాలని ఒకింత అల్టిమేటం జారీచేశారు. తమ డిమాండ్లపై కాంగ్రెస్ పార్టీ స్పందించకపోతే ఒంటరిగానే బరిలోకి దిగుతామని షర్మిల తేల్చిచెప్పేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తామని స్పష్టం చేశారు. అంటే.. 119 నియోజకవర్గాల్లో వైఎస్సార్టీపీ పోటి చేసేందుకు సిద్ధంగా ఉందని.. అక్టోబర్ రెండో వారం నుంచి ప్రజల మధ్య ఉండేలా కార్యాచరణ చేపడుతామని షర్మిల తెలిపారు. సోమవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో షర్మిల అధ్యక్షతన వైఎస్సార్టీపీ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 33 జిల్లాల నుంచి ముఖ్యనేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పార్టీ విలీనం, ఎన్నికల వ్యూహంపై ప్రధానంగా చర్చ జరిగింది. అక్టోబర్ రెండో వారం నుంచి ప్రజల మధ్య ఉండేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఈ సందర్భంగా కార్యకర్తలకు షర్మిల అభయమిచ్చారు. పార్టీ కార్యవర్గం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కార్యకర్తలు, నేతలకు అధినేత్రి మాటిచ్చారు. అంతేకాదు.. పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్కరికీ తగిన ప్రాధాన్యత ఉంటుందని షర్మిల చెప్పుకొచ్చారు. ఆ మధ్య.. పార్టీ విలీనంపై మాట్లాడిన షర్మిల 'నేనేం చేసినా తెలంగాణ ప్రజల కోసమే.. నా తాపత్రయం.. అన్ని విషయాలు త్వరలోనే చెబుతా' అని షర్మిల చెప్పుకొచ్చారు.

## విద్యార్థుల సౌకర్యార్థం నీటి శుద్ధి యంత్రం బహుకరణ

- ఉప సర్పంచ్ కనకరాజు



మిరుదొడ్డి, సెప్టెంబర్, 25 , మనం న్యూస్ః మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని తెలుపడంతో వెంటనే నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మల్లుపల్లి ఉప సర్పంచ్, బీజేపి నాయకులు కనకరాజు తెలిపారు. సోమవారం పాఠశాలలో నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తాగునీటి సమస్య ఉందని ఉపాధ్యాయులు తెలపడంతో వెంటనే స్పందించి విద్యార్థులకు తాగునీటి సమస్య తీర్చడం జరిగిందన్నారు. తాను చదువుకున్న పాఠశాలకు తనవంతు సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశ్యంతో నీటిశుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్‌తోపాటు కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు భూంపల్లి విద్యార్థుల ఎంపిక






మిరుదొడ్డి, సెప్టెంబర్, 25 , మనం న్యూస్ః ఈ నెల 23న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన అండర్ - 16 విభాగంలో అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పిఈటి వెంకట్‌రెడ్డి తెలిపారు. భూంపల్లి జెడ్పిహెచ్ఎస్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి వెంకటేశ్వర్లు లాంగ్‌జంప్, 10వ తరగతి విద్యార్థి రమేష్ షాట్‌పుట్‌లో మంచి ప్రతిభ కనబరచడం జరిగిందన్నారు. అక్టోబర్‌లో కరీంనగర్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## రాంసేన యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



మిరుదొడ్డి, సెప్టెంబర్, 25, మనం న్యూస్: మిరుదొడ్డి మండల కేంద్రంలోని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద రాంసేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా యూత్ ఆధ్వర్యంలో గణేషున్ని నెలకొల్పి ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు సాంస్కృతిక, భజన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్నదానానికి సహకరించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరు భక్తిభావాన్ని కలిగి ఉండాలన్నారు. యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాంసేన యూత్ సభ్యులు అరుణ్, సాయి, కర్ణాకర్, సంతోష్, భాను, మధు, శ్రీకాంత్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## రుద్రాక్ష మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- రుద్రాక్ష మేళాను ప్రారంభించిన జెడ్పి చైర్మన్ రోజాశర్మ



సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్, 25, మనం న్యూస్: సిద్దిపేటలో మొట్టమొదటి సారిగా పవిత్రమైన రుద్రాక్ష మేళాను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పి చైర్మన రోజాశర్మ అన్నారు. సిద్దిపేటలోని రత్నదీప్ సూపర్ మార్కెట్‌పైన సుశీల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రుద్రాక్ష మేళాను జెడ్పి చైర్మన్ రోజాశర్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేటలో మొట్టమొదటిసారిగా రుద్రాక్ష మేళాను ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ జాతకాలపై, పేర్లపై రుద్రాక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వాటిని ధరించడం వల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చన్నారు. ఒరిజినల్‌గా అతి పవిత్రంగా ఉండే రుద్రాక్షల మేళ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నాలుగు రోజుల పాటు ఈ మేళా ఉంటుందని, అవసరమైన వారు వచ్చి తీసుకోవాలన్నారు. అనంతరం నిర్వాహకులు జెడ్పి చైర్మన్‌ను సన్మానించి రుద్రాక్షల గురించి వివరించారు.

# అందాల మెట్‌పల్లి

- గ్రామ రూపురేఖలు మార్చిన పల్లె ప్రగతి
- ఊరంతా సిసి రోడ్లు... వందశాతం ఇంకుడు గుంతలు
- ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు
- హరితహారంతో పచ్చదనాన్ని అద్దుకున్న గ్రామం



చిన్నకోడూరు, సెప్టెంబర్ 25, మనం న్యూస్: ఉమ్మడి పాలనలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామం. నేడు అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో మెట్‌పల్లి రూపురేఖలు మారిపోయాయి. గ్రామాభివృద్ధి కొరకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను సర్పంచ్, పాలకవర్గం ప్రజా ప్రతినిధులు సక్రమంగా వాడడంతో గ్రామం అన్నింటిలో ముందుకు పోతుంది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల వసతులను కల్పించుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. మండల కేంద్రం నుండి 3 కి.మీల దూరంలో ఉన్న మెట్‌పల్లి గ్రామ ప్రవేశం నుండే రోడ్డుకు రెండు వైపులా నాటిన మొక్కలు అందరినీ ఆకర్షిస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గ్రామ ముఖద్వారంలోకి అడుగు పెట్టగానే ఆకుపచ్చవర్ణాన్ని అద్దుకున్న రోడ్లను, పలు రకాల చెట్లను చూస్తూ ప్రజలు స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతీ వనం చిట్టడివిని తలపిస్తూ పల్లెకు సరికొత్త అందాన్ని తెచ్చిపెట్టింది. దానితోపాటు పండల మొక్కలు, గ్రీన్ నర్సరీ మొక్కలు నాటడంతో ఉదయం, సాయంత్ర సమయాలలో స్థానికులు పార్కులలో కాలక్షేపం చేస్తూ ఆనందాన్ని పొందుతున్నారు. ఊరంతా సిసి రోడ్లు, వందశాతం ఇంకుడుగుంతలు నిర్మించుకొని పరిశుభ్రత పాటిస్తున్నారు. రోడ్డు పక్కన, విలేజ్ పార్కులో నాటిన మొక్కలను సంరక్షించుకునేందుకు ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తూ మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. మిషన్ భగీరథలో భాగంగా ప్రతి ఇంటికి తాగునీరు అందుతుంది. కంపోస్ట్ యార్డు, గ్రేవ్‌యార్డు ఇతర నిర్మాణాలను గ్రామస్తుల అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్ పల్లె ప్రకృతి వనాలతో ఎక్కడ చూసినా గ్రామమంతా పచ్చదనాన్ని అలుముకుంది. రూ. 5 లక్షలతో కంపోస్ట్‌యార్డు, రూ. 20 లక్షల పై చిలుకుతో సిసి రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు మొత్తంగా ఇప్పటి వరకు రూ. 82.60 లక్షలను మంత్రి హరీష్‌రావు అందించగా గ్రామం అన్నింటా అభివృద్ధి ముందుకు సాగుతుంది.





### ఆకట్టుకుంటున్న పరిసరాలు

గ్రామ పరిసరాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వీధులను శుభ్రం చేస్తూ ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను సేకరించి డంప్ యార్డుకు తరలిస్తున్నారు. ఇంకుడుగుంతల నిర్మాణం సఫలీకృతం కావడంతో మురుగునీరు కానరాకుండా గ్రామం అద్దంలా మెరుస్తుంది.

### మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు

**ఎంపిపి కూర మాణిక్యరెడ్డి**



పల్లెలన్నీ పచ్చగా, పరిశుభ్రంగా ఉండాలన్నదే మంత్రి హరీష్‌రావు తాపత్రయం. గ్రామాల అభివృద్ధికి అడిగిన వెంటనే నిధులను మంజూరు చేస్తున్న మంత్రికి కృతజ్ఞతలు. పల్లె ప్రకృతితో పల్లెలన్నీ ఆహ్లాదంగా కనిపిస్తున్న తీరు నేడు మంత్రి కల సాకారం అవుతున్న వేళ మాటల్లో చెప్పలేనిది. మంత్రి ఆశయంలో భాగస్వామ్యం అవుతున్నందుకు సంతోషంగా ఉంది.



### గ్రామ అభివృద్ధి లక్ష్యంగా....

**సింగిరెడ్డి విజయ వినయ్‌రెడ్డి (సర్పంచ్)**



గ్రామాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నాం. గ్రామంలో సిసి రోడ్లు, ఇంకుడు గుంతలు, డంప్‌యార్డు, రెడ్డి సంఘం మొదలగు అభివృద్ధి పనులను చేసుకున్నాం. గ్రామస్తులు గ్రామాన్ని శుభ్రంగా ఉంచుతున్నారు. పల్లెప్రగతి మా ఊరి రూపరేఖలను మార్చివేసింది. పల్లె అభివృద్ధిలో భాగస్వామ్యమైన గ్రామస్తులకు కృతజ్ఞతలు.

### పల్లె అభివృద్ధి అయింది

**బొస్సె ప్రభాకర్ (హరీషన్న జనవాణి అధ్యక్షుడు)**



ప్రభుత్వ నిధులు ఖర్చు చేస్తూ పల్లె ప్రగతిలో భాగంగా పల్లెను అభివృద్ధి చేశారు. సిసి రోడ్లు, విలేజ్ పార్కు తదితర అభివృద్ధి పనులను పూర్తి చేశారు. మా గ్రామం అభివృద్ధికి సహకరించిన మంత్రిహరీష్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు.



# ఓటుకు నోటు కేసులో దొంగ రేవంత్‌రెడ్డి

- పిసిసి చీఫ్ అసత్య ప్రచారాలు చేస్తే అబద్దాలు నిజాలు కావు
- వార్తల్లో వచ్చేందుకే బీజేపిపై అసత్య ప్రచారాలు
- అబద్ధాల పునాదులపై అధికారంలోకి రావాలని చూస్తున్న బిఆర్ఎస్, కాంగ్రెస్
- దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు



దుబ్బాక, సెప్టెంబర్, 25 , మనం న్యూస్ః ఓటుకు నోటు కేసులో పట్ట పగలు దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి అని స్వయానా సీఎం కేసీఆర్ అన్నారని, ప్రపంచంలోనే సంచలనం సృష్టించిన ఈ కేసు ట్రయల్ రన్ ఎందుకు జరపడం లేదని సీఎం కేసీఆర్ తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాక దుబ్బాక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సిడబ్ల్యూసి సమావేశాలు జరిగినప్పటి నుండి బీజేపీపై పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, అబద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన నిజాలు కావని, బీజేపికి బిఆర్ఎస్‌కు ఎక్కడ పోలిక, కలయిక ఉండదన్నారు. కొంతమంది ప్రతిపక్షాల నాయకులు అబద్ధాల పునాదుల మీద మాత్రమే ప్రతి రోజు ప్రాచుర్యం పొందాలని, కొన్ని దినపత్రికల్లో మొదటి పేజీల్లో వాళ్ల వార్తలు రావాలని బీజేపిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్, మోడీ ఇద్దరు ఒకటేనని, బీజేపికి చెందిన ఎంపిలు ఢిల్లీలో లిక్కర్ స్కామ్ మూలాలు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నాయని చెప్పినంత మాత్రాన ఈడీలు, సిబిఐలు, బీజేపి జేబు సంస్థలని ఎలా అంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023లో నమోదైన కేసు గురించి మాట్లాడుతుఆన్నరని, మరి 2016లో నమోదైన కేసులో దొరికిన దొంగను ఎందుకు విడిచిపెట్టారో, ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్ధాల పునాదుల మీద కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు కలిసి అధికారంలోకి రావాలని కుట్రలు చేస్తున్నాయని, పత్రికల్లో ప్రతి రోజు మొదటి పేజీల్లో రావడానికి బీజేపిపై బట్టకాల్చి మీదేసే ప్రయత్నం జరుగుతుందని, ఈ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. లిక్కర్ స్కామ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అవుతుందని రేవంత్ అంటున్నారని, ఈడి, సిబిఐలు మీ జేబు సంస్థలా, మీకు సమాచారం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. లిక్కర్ స్కామ్‌లో అప్రూవర్‌గా మారిన వ్యక్తుల్లో మీ చుట్టాలున్నారని, మీకేమైనా వారు చెప్పారా అన్న విషయం తేటతెల్లం కావాలన్నారు. గతంలో రేవంత్, కవిత కలిసి చేసిన వ్యాపారాల వాటాలు ఉంటే తెగతెంపులు చేసుకోవాలని అప్రూవర్‌గా మారిన మీ బంధువులు ఏమైనా చెప్పారా అని ప్రశ్నించారు. ఈడి, సిబిఐలు, బీజేపి జేబు సంస్థలైతే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తమిళనాడుకు చెందిన కనిమొళి, మెజార్టీ రాదు కాబట్టి ఇప్పటి నుంచే మానసికంగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసే ప్రయత్నంలో భాగమేనని ఆరోపించారు. లిక్కర్ స్కామ్, సిబిఐ, ఈడిలపై ఊహాజనితమైన ప్రశ్నలు ఎందుకు ఉత్పన్నమవుతున్నాయో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం దుబ్బాకలో నెలకొల్పిన ఆయా వినాయక మండపాల వద్ద ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు అంబటి శివప్రసాద్ గౌడ్, దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్ చారి, స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ దూలం వెంకట్ గౌడ్, రఘోత్తంపల్లి సర్పంచ్ దేవిరెడ్డి, బీజేపి నాయకులు పుట్ట వంశీ, మచ్చ శ్రీనివాస్, సుంకోజి ప్రవీణ్, రమణారెడ్డి, నేహాల్ గౌడ్, పెద్ది నవీన్, రమేష్‌రెడ్డి, బెజ్జంకి, సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ డివిజన్ సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి
- దీక్షలో పాల్గొన్న నాలుగు మండలాల జర్నలిస్టులు



చేర్యాల, సెప్టెంబర్ 25, మనం న్యూస్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి నేడు రెవెన్యూ డివిజన్ ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చేర్యాల రెవెనూయ డివిజన్ సాధనకై జేఏసి ఆధ్వర్యంలో చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి 15వ రోజుకు చేరుకోగా ఈ దీక్షల్లో నాలుగు మండలాల జర్నలిస్టులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారికి పిసిసి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు కడుదూరు మహేందర్‌రెడ్డి, ఉమ్మడి మద్దూరు మండల ప్రధాన కార్యదర్శి కొండూరు సతీష్‌కుమార్‌లు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పోరాటాలు మరోసారి గుర్తు చేస్తూ ఈ ప్రాంతం ఉనికిని కాపాడుకోవడానికి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల ప్రజలు కూడా చేర్యాల ప్రాంత అస్థిత్వాన్ని కాపాడుకోవడానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మంతెన చంద్రారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి రాజు, మద్దూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బీర్కూరి ఎల్లయ్య, ఉప్పల అశోక్ రాజ్, గణేష్ తివారి, మైసంపల్లి నాగరాజు, మలిపెద్ది బాల్‌లింగం, రాళ్లబండి గురుమూర్తి, జితేందర్‌రెడ్డి, ఓరుగంటి శ్రీకాంత్‌రెడ్డి, తాడూరి లింగం, అత్తిన మధు, గదరాజు రాజు, జగ్గం అనిల్‌కుమార్, మల్లిగారి బిక్షపతి, కుడిక్యాల బాల్‌మోహన్, కొంక మహేష్, దువ్వల మల్లేష్, తాడెం వెంకట స్వామి, కర్రోల్ల నవజీవన్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఓబిసి సెల్ మండల అధ్యక్షులుగా గూడెల్లి శ్రీకాంత్ ముదిరాజ్



బెజ్జంకి, సెప్టెంబర్, 25, మనం న్యూస్: బెజ్జంకి మండల కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ అధ్యక్షులుగా గూడెల్లి శ్రీకాంత్ ముదిరాజ్‌ను నియమిస్తూ సిద్దిపేట జిల్లా ఓబిసి అధ్యక్షులు సూర్యవర్మ నియామక పత్రాన్ని అందజేశారు. ఓబిసి రాష్ట్ర అధ్యక్షులు నూతి శ్రీకాంత్ గౌడ్ ఆదేశాల మేరకు గూడెల్లి శ్రీకాంత్ ముదిరాజ్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్‌కు, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మానకొం డూరు నియోజకవర్గ ఇంచార్జ్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు సూర్య వర్మతోపాటు ఇందుకు సహకరించిన వారందరికీ యూత్ కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజే శారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు.

## మహోన్నతుడు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ

- బీజేపి పట్టణ అధ్యక్షులు పత్రి శ్రీనివాస్ యాదవ్



సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్, 25, మనం న్యూస్: జనసంఘ్ నేత పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ మహోన్నత దేశభక్తుడని బీజేపి పట్టణ అధ్యక్షులు పత్రి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా సోమవారం పార్టీ కార్యాలయంలో బీజేపి శ్రేణులతో కలిసి దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థ నాయకులు, పేదల గురించి ఆలోచించే గొప్ప వ్యక్తి దీన్ దయాల్ అని ప్రతినిత్యం దేశం కోసం, ధర్మం కోసం, దేశాభివృద్ధి కోసం కృషి చేశాడన్నారు. అట్టడుగు వర్గాల వారికి సైతం ప్రభుత్వ పథకాలు అందాలనే లక్ష్యంతో ఆయన పని చేశారన్నారు. పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సవివరంగా వివరించాలని బీజేపి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉడుత మల్లేశం యాదవ్, విభీషణ్‌రెడ్డి, గోనె మార్కండేయులు, తొడుపునూరి వెంకటేశం, కృష్ణ యాదవ్‌రావు, భోగి శ్రీనివాస్, కిరణ్, కనకరాజు, ఎల్లం, రాజు, జనార్ధన్‌రెడ్డి, వేణు, ఇమ్రాన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు త్వరలో రుణాలను పంపిణీ చేస్తాం

- సొసైటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి
- చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి
- చెన్నారావుపేటలో సొసైటీ 66 వ వార్షిక మహాసభ



చెన్నారావుపేట, సెప్టెంబర్ 25, మనం న్యూస్ : రైతులకు త్వరలో రుణాలను పంపిణీ చేస్తామని చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో 66వ వార్షిక మహాసభను నిర్వహించారు. ఈ మహాసభలో ముందుగా సొసైటీ మాజీ వైస్ చైర్మన్, ప్రస్తుత సొసైటీ డైరెక్టర్ గూళ్ళ కవిత భర్త, న్యాయవాది గూళ్ళ అశోక్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో మతి చెందగా ఆయన మతికి రెండు నిమిషాలు మౌనం పాటించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం సొసైటీ సీఈఓ చిట్టె రవి సొసైటీ వార్షిక మహాసభ నివేదికను చదివి వినిపించారు. తదనంతరం సొసైటీ అభివద్ధిపై సభ్యులతో చర్చించారు. దీంతో సభ్యులు గత సమావేశాల్లో జరిగిన తీర్మానాలను వెంటనే ఆమోదించాలని, ప్రభుత్వం నుండి రుణమాఫీ కింద వచ్చిన రుణాలను రైతులకు వెంటనే పంపిణీ చేయాలని సొసైటీ సభ్యులు ఈగ సత్యనారాయణ, మంచాల సదయ్య, పత్తి అనంతరెడ్డి, గరికపాటి హనుమంతరావు తదితరులు కోరారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి మాట్లాడారు. సొసైటీలో 5 వేల 958 మంది సభ్యులకు ప్రభుత్వం నుండి ఒక్క కుటుంబానికి రుణమాఫీ కిం ద రూ. 34 కోట్లు రావాల్సి ఉండగా 3 వేల 373 మంది సభ్యులకు రూ. 17 కోట్లు మాత్రమే వచ్చాయని ఇంకా రూ. 17 కోట్లు సొసైటీకి రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సహకారంతో వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావును హైదరాబాద్‌కు వెళ్లి పలుమార్లు కలిసినట్లు తెలిపారు. వచ్చిన రూ.17 కోట్లను ఎస్ బి ఐ బ్యాంకు చెన్నారావుపేటలో జమ చేసినట్లు తెలిపారు. త్వరలో రైతులకు రుణాలను పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే రైతులు సొసైటీలో అప్పుగా తీసుకున్న డబ్బులను అలాగే దీర్ఘకాలిక రుణాల కింద రైతులు వరి కోత మిషన్లు, జెసిబిలు, ట్రాక్టర్లు, బొలెరోలు, ద్విచక్ర వాహనాలను తీసుకున్నారని వాటికి సంబంధించిన డబ్బులను కూడా ఎప్పటికప్పుడు చెల్లిస్తూ సొసైటీ అభివద్ధి కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. అందరి సమిష్టి సహకారంతోనే సొసైటీ అభివద్ధి చెందుతుందని సొసైటీ పాలకవర్గ సభ్యులు, రైతులు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ నోడల్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరు నాయక్, కేసిటిసి లెక్చరర్ రాజయ్య, ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ మోహన్ నాయక్, జడ్పిటిసి బానోతు పత్తి నాయక్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ అబ్దుల్ గఫార్, ఖాదర్ పేట గ్రామ సర్పంచ్ అనుముల కుమార స్వామి, పుల్లయ్యబోడు తండా గ్రామ సర్పంచ్ బోడ సమ్మ నాయక్, సొసైటీ డైరెక్టర్లు జంగిలి రాజు, మహమ్మద్ బషీర్, జున్నుతుల రమాదేవి మహేందర్‌రెడ్డి, కంచ కోమల, మజ్జిగ రాంబాబు, ఇస్లావత్ గోపి, ఎడ్ల మంజుల నారాయణరెడ్డి, మంచాల సరిత వెంకటేశ్వర్లు, బానోతు ఫూల్ శంకర్, సొసైటీ సీఈఓ చిట్టె రవి, సొసైటీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ చేయూత





టేకుమట్ల, సెప్టెంబర్ 25, మనం న్యూస్: భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన మచ్చ మొండయ్య టేకుమట్ల మాజీ వార్డు సభ్యులు ఇటీవల హఠాత్ మరణం చెందిన విషయం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ కొయ్యడ చంద్రశేఖర్ మతుడి కుటుంబానికి అండగా నిలిచి 25 కిలోల బియ్యాన్ని అందించారు. హైదరాబాదులో గణేష్ నిమజ్జన బందోబస్తులో విధులు నిర్వర్తిస్తూ మతుని కుటుంబానికి అండగా నిలవడం హర్షించదగ్గ విషయమని పలువురు కొనియాడారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎంతో మందికి అండగా నిలుస్తూ బియ్యాన్ని అందిస్తూ ఆసరాగా నిలుస్తున్నాయన సేవలను పలువురు కొనియాడుతున్నారు.

## ప్రజలకు అవయవ దానం గురించి అవగాహన కల్పించాలి

- వైద్యాధికారి సరోజ



చెన్నారావుపేట, సెప్టెంబర్ 25, మనం న్యూస్ : కేంద్ర ప్రభుత్వ అయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా అవయవ దానం పైన ప్రజలకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని వైద్యాధికారి సరోజ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవయవ దానం చేస్తామని ప్రతిజ్ఞ చేయించి, అయుష్మాన్ భావ పోర్టల్‌లో విద్యాధికారి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పేర్లు నమోదు చేసుకున్నారు. మొదట వైద్య సిబ్బంది నమోదు చేసుకొని ప్రజలకు అవగాహన కల్పించి పేర్లు నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు స్వరూపరాణి, హేమలత, ల్యాబ్ టెక్నీషియన్ నవీన్, సిబ్బంది శివాజీ, వెంకట్ రెడ్డి, మంజుల, రాణి, ఆశా కార్యకర్తలు వసుమతి, ఉమ, జమున, రజిత, శ్రీలత పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇతర పార్టీల నుండి 40 కుటుంబాలు బిఆర్ఎస్‌లో చేరిక



నర్సంపేట, సెప్టెంబర్ 25, మనం న్యూస్ : నర్సంపేట మున్సిపల్ పరిధిలో గల కమలాపురం గ్రామం నుండి కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన 40 కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరినారు. పార్టీలో చేరినవారిలో మల్లూరి రాజు (సంచార జాతులు జిల్లా అధ్యక్షులు), కొంగే మల్లేష్ (కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు)తోట వెంకన్న (టిడిపి ముఖ్య నాయకులు), ఏశబోయిన రాజేష్ (బిజెపి ముఖ్య నాయకులు), కంచె ఏశుపతి, గాధగొని శ్రీను, గూడెం రాజు, కోరే నరేష్, కోరే మహేష్, మండల కుమార్ స్వామి, ఎండి జాకీర్, దిండిగాల రాజు, నక్క రవితేజ, పోసాని రాఖేష్, చెన్నబోయిన సతీష్, మల్లోరి నాగరాజు, మల్లూరి వీరాస్వామి, కదిరి వెంకన్న, ఎండి అఫ్జల్, చిట్టీ మల్లయ్య, గాదేగొని రాజు, మామిడాల శివ, కంచర్ల శ్రీను, గాదెగోని వీరాస్వామి, మిట్టపల్లి సరిత, విజయ, మిట్టపల్లి పద్మ, మామిడాల రజిత, గూడిపు మమత, మల్లూరి కళ్యాణి, భవానీ, శశిరేఖ, మల్లూరి దీపిక, విజయ, బద్రమ్మ, మిట్టపల్లి ప్రభావతి, పాల్వంచ సుజాత, అన్న రజిత ఉన్నారు. వీరిని పట్టణ పార్టీ అధ్యక్ష్యులు నాగెల్లి వెంకట నారాయణగౌడ్, నాయకులు గుంటి కిషన్, నల్ల మనోహర్ రెడ్డి, యువ రాజ్, స్థానిక కౌన్సిలర్ జుర్రు రాజు, కమలాపురం నాయకులు పోత రాజు బాబు, దండిగ రమేష్, పైసా ప్రవీణ్ లను పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

- భూమిపూజ చేసిన మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే ఆరూరి



పర్వతగిరి, సెప్టెంబర్ 25, మనం న్యూస్ : పర్వతగిరి మండల కేంద్రంలో అల్లూరి యువజన (మాల) సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నూతన విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ ముద్దు బిడ్డా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొని కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు అంబేద్కర్ అమర్‌రహే జోహార్ అంబేద్కర్. అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి బానోత్ సింగ్ లాల్, జడ్పీ కో ఆప్షన్ మహమ్మద్ సర్వర్, స్థానిక సర్పంచ్ చింతపట్లా మాలతి సోమేశ్వర్ రావు, ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ జెడ్పిటిసి మేడిశెట్టి రాములు, కల్లెడ సొసైటీ చైర్మన్ మోటపోతుల మనోజ్, ఏఎంసి డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం, అంబేద్కర్ ఫెలోషిప్ రాష్ట్ర అవార్డు గ్రహీత చిన్న పాక శ్రీనివాస్, ఉప సర్పంచ్ రంగు జనార్ధన్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏడు దొడ్ల జితేందర్ రెడ్డి, గోనె సంపత్, అల్లూరియువజనసంఘం అధ్యక్షులు నాగుల రాజు, యువజన సంఘం ముఖ్యులు నాగుల కుమార స్వామి, చీదురు మల్లేష్, శంకర్, తిరుపతి, సభ్యులు శంకర్, మధు, రాజు, రాకేష్, ప్రదీప్, అనిల్, అనిల్, సాయిబాబు, రాహుల్, రఘు, సిద్దూ కాల నీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత అభివృద్ధి కంటే గ్రామాల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత

- జెడ్పీటీసీ బానోత్ సింగ్ లాల్
- గోపనపల్లి గ్రామ అభివద్ధి కార్యక్రమాలపై సమీక్ష



పర్వతగిరి, సెప్టెంబర్ 25, మనం న్యూస్ : మండలంలోని గోపనపల్లి గ్రామంలో వర్ధన్నపేట శాసన సభ్యులు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అరూరి రమేష్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల గ్రామ ఇంచార్జిలు పర్వతగిరి జెడ్పీటీసీ బానోత్ సింగ్ లాల్, పర్వతగిరి ఎంపీటీసీ మాడుగుల రాజు ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు గ్రామంలో జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాలపై సమీక్ష మరియు ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశం సోమవారము నిర్వహించారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల గ్రామ ఇంచార్జిలు జెడ్పీటీసీ బానోత్ సింగ్ లాల్ మాట్లడుతూ వ్యక్తిగత అభివద్ధి కంటే గ్రామాల అభివద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలే అప్పుడే గ్రామము అభివద్ధి చెందుతుందన్నారు. అనంతరం పర్వతగిరి ఎంపిటిసి మాడుగుల రాజు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా గ్రామాల అభివద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివద్ధిలో దూసుకుపోతుంది అని కొనియాడారు. అభివద్ధి, సంక్షేమ పథకాల అమలులో, రూపకల్పనలో దేశానికే రోల్ మాడల్ గా తెలంగాణరాష్ట్రం పల్లెలు అని స్పష్టం చేశారు. గహలక్ష్మి పథకం, దళిత బంధు పథకం, బిసి బంధు పథకం గ్రామంలోని తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంజా మహేష్, ఉపసర్పచ్ సూర అశోక్, గ్రామ పార్టీ అధ్యక్షులు సంపత్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, దేవాదాయ కమిటీ ఛైర్మన్ బెల్లం బాలరాజు, మాజీ సర్పంచ్ నాంపల్లి అశోక్, వార్డ్ మెంబర్లు రవీందర్, నరేష్, సదమ్మ, సీనియర్ నాయకులు బుంగ బాబు, వర్కలా కిరణ్, బాధ నర్సింగము, శ్రీధర్, దిలీప్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో మానసిక, శారీరక దృఢత్వం

- కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్




కాజీపేట, సెప్టెంబర్ 25, మనం న్యూస్ : యోగాతో మానసిక, శారీరక దఢత్వం చేకూరుతుందని, ఎన్నో ఏళ్లుగా యోగాను భారతీయులు అభ్యసిస్తున్నారని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. గీతాంజలి మహిళా డిగ్రీ పీజీ కళాశాల ఆవరణలో హన్మకొండ, వరంగల్ జిల్లాల యోగోత్సవం కార్యక్రమాన్ని యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ యోగాతో మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని అన్నారు. అనంతరం యోగా ఆసనాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేణుమాధవ్, వెంకట్, యోగా గురువులు, అసోసియేషన్ సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

## చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- సర్పంచ్ తప్పేట రమేష్



చెన్నారావుపేట, సెప్టెంబర్ 25, మనం న్యూస్ : లింగాపురం గ్రామంలోనీ అంగన్వాడీ సెంటర్ లలో పోషణ అభియాన్ కార్యక్రమం ఘణంగా నిర్వహించినట్టు సర్పంచ్ తప్పేట రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ తప్పేట రమేష్ మాట్లాడుతూ చిరు ధాన్యాలలో ఔశధ గుణాలు కలిగి ఉండి ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఎన్నో వ్యాధులను నివారించుటలో చిరుధాన్యాలు తోడ్పాడుతాయని ముఖ్యంగా ఉబకాయం, అర్థరైటీస్, మధుమేహం, కొలెస్ట్రాల్, గుండె సంబంధిత వ్యాధులకు ప్రత్యేక ఆహారంగా తీసుకోవచ్చని ప్రాణాంతకమైన క్యాన్సర్లను కూడా నివారిస్తాయని, ముఖ్యంగా గర్భిణీలు, చిన్న పిల్లలకు ఆహరంగా ఇవ్వాలని చిరుధాన్యాలలో ఖనిజలవణాలైన, ఇనుము, జింక్, మెగ్నీషియం, పాస్పరస్, ఫోలిక్ ఆసిడ్, రైబోఫ్లేవిన్ అను విటమిన్స్ అధిక సంఖ్యలో ఉండి ఆరోగ్యాన్ని కాపాడుతాయానీ ఆకుకూరలు అధికంగా తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు,ఈ కార్యక్రమంలో డాక్టర్ దయాకుమారి, పంచాయతీ కార్యదర్శి శ్వేత, ప్రధానోపాధ్యాయులు జయశ్రీ, రవీందర్, ఏఎన్ఎం శ్వేత, అంగన్వాడిలు ఊర్మిళ, హేమలత, ఆశా వర్కర్స్ సంధ్య,అరుణ, శారద, తేజ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# కేయూలో ఘనంగా వరల్డ్ ఫార్మసిస్ట్ డే వేడుకలు




హనుమకొండ, సెప్టెంబర్ 25, మనం న్యూస్ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో సోమవారం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నీరటి ప్రసాద్ ఆధ్వర్యంలోవరల్డ్ ఫార్మసిస్ట్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సెలబ్రేషన్లో ఫార్మసీ డీన్ వై ప్రొఫెసర్ వై నరసింహ రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విలువలను కాపాడాలని, నాన్ ఫార్మసిస్ట్ చేత మందులు అమ్మబడినచో వాళ్లకు సరైన నాలెడ్జి లేకపోవడం వలన డయోవాలుకు బదులుగా డయోనిల్ టాబ్లెట్లు ఇచ్చినచో తీవ్రమైన అనారోగ్య సమస్యలతో శరీరంలో గ్లూకోజ్ లెవెల్స్ తీవ్రంగా పడిపోయి ఆ పేషెంట్ కోమస్థితిలోనికి వెళ్లే ప్రమాదం ఉంది అని తెలిపారు. ఈ ఫార్మసిస్టు డే సందర్భంగా ప్రొఫెసర్ గాదె సమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ ను కచ్చితంగా పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఆ బాధ్యత మీ పైనే ఉందని తెలిపారు. మనమందరము మొదట ఫార్మసిస్టులము అని, మందులకు ఆయుష ఇస్తున్నామని అన్నారు. వైద్యుడు రోగికి మందు ఇచ్చి ప్రాణం పోస్తే ఆ మందుకి ప్రాణం పోసేది ఫార్మసిస్ట్ అని అన్నారు. ఫార్మసిస్టులందరూ కంటికి కనబడని డాక్టర్స్ అని, ఆస్ప్రిన్ అనే ఔషధము గుండె, డయాబెటిస్ సమస్యలతో ఉన్నవారికి రక్తం పల్చబడేందుకు ఉపయోగపడుతుంది ఒకవేళ దానిని సరి అయిన విధంగా నిల్వ చేయనిచో అది సాలిసిలిక్ యాసిడ్ గా మారుతుంది దానిని చర్మ సంబంధిత వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది అలాంటి అప్పుడు డయాబెటిస్ గుండె సంబంధిత రోగులకు నిరుపయోగంగా మారుతుంది అని తెలిపారు. దీనిని నిర్ధారించేది కేవలం రిజిస్టర్ ఫార్మసిస్ట్ మాత్రమే అని తెలిపారు .ఫార్మసీ చదివే విద్యార్థిని విద్యార్థులకు క్లినికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, మెడికల్ కోడింగ్, డ్రగ్ రెగ్యులేటరీ అఫైర్స్ లో, డ్రగ్ ఎనాలిస్ట్ గా, క్లినికల్ ఫార్మసిస్టుగా ఫార్మా కంపెనీలలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూచించారు ఓవర్ ది కౌంటర్ మందులను రిజిస్టర్ ఫార్మసిస్ట్ మాత్రమే ఇవ్వాలి లేనిచో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి సమాజం యొక్క ఆరోగ్య భద్రత ఫార్మసిస్టు చేతిలో ఉంది ఈ సందర్భంగా ఫార్మసిస్టులు తన సర్టిఫికెట్ కిరాయికి ఇవ్వవద్దని మీరు సర్టిఫికెట్స్ కిరాయికి ఇవ్వడం వలన హెల్త్ కేర్ సిస్టం విలువలు దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డైరెక్టర్ జనరల్ కమలహాసన్ రెడ్డి ఇండస్ట్రీలలో పనిచేసే ఎంప్లాయిస్ అందరి సర్టిఫికెట్స్‌ని వారి కస్టడీలలో పెట్టుకోగలిగితే కొంతవరకు ఫార్మసీ విలువలు కాపాడిన వారవుతారు గవర్నమెంట్ డాక్టర్స్ మాదిరిగా ఫార్మసీ బోధన సిబ్బందికి ఫార్మసిస్ట్ సేవ చేసే అవకాశము తెలంగాణ ప్రభుత్వం కల్పించినచో విద్యార్థిని విద్యార్థులు వారి గురువుల వద్ద నేర్చుకొని హెల్త్ కేర్ సిస్టంను మరింత పరిరక్షించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఓఎస్ డాక్టర్ స్వరూప రాణి, ప్రొఫెసర్ జే కష్ణవేణి, డాక్టర్ బి నాగరాజు, డాక్టర్ సాహిదా, కాంట్రాక్టు లెక్చరర్స్ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ ప్రియాంక, ఫార్మసీ రిటైర్డ్ ప్రొఫెసర్స్ డాక్టర్ అచ్చయ్య, డాక్టర్ వి కిషన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీలో అన్నదానం చేసిన పాలకవర్గం



హనుమకొండ సుబేదారి, సెప్టెంబర్ 25, మనం న్యూస్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ పాలకవర్గం ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ భవన్ లో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమాన్ని పాలకవర్గ సభ్యులు ప్రారంభించి అన్నదానం చేసినారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పోట్లపల్లి శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు విన్నవించడానికి చక్కటి వేదిక ప్రజావాణి

- ప్రతి ఒక్కరి సమస్యలు పరిష్కరించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట, సెప్టెంబర్, 25, మనం న్యూస్ ప్రతినిధిః సామాన్యులకు అందుబాటులో ఉండి తమ సమస్యలను విన్నవించుకొని పరిష్కరించుకోవడానికి ప్రజావాణి ఒక చక్కటి వేదిక అని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భా గంగా సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా వాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలు మూలల నుండి వచ్చిన ప్రజల వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం అడిషన ల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఒక గొప్ప కార్యక్రమమని, సమస్యల పరిష్కారానికి ఇది మంచి వేదిక అన్నారు. జిల్లా అధికారులు ప్రజలకు ఆలస్యం చేయకుండా వెంటవెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. నేటి ప్రజావాణిలో మొత్తంగా 73 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఓఏ అబ్దుల్ రెహమాన్ తో పాటు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా వ్యవసాయ కమిటీ సమావేశం

- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమ్ము మానెమ్మ గోపాల్ రెడ్డి



కోటపల్లి, సెప్టెంబర్ 25. (మనం న్యూస్) : నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఏర్పాటు చేసిన తొలి వ్యవసాయ పాలకవర్గ సమావేశం సాదాసీదాగా జరిగిందని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమ్ము మానెమ్మ గోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం మార్కెట్ కమిటీ డైరెక్టర్లతో చైర్పర్సన్ మాట్లాడుతూ నిల్వ 14 లక్షల 99000 రూపాయలు ఉన్నాయన్నారు. మార్కెట్ కమిటీ ఆవరణలో 3 ఎకరాల 30 గుంటల స్థలం ఉన్నందున షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని, తాండూర్ మోమిన్ పేట ప్రధాన రహదారి నుండి మార్కెట్ కమిటీ వరకు వచ్చేందుకు మట్టి రోడ్డు ఉన్నందున వర్షాకాలం వస్తే ఇబ్బందులు అవుతాయని సిసి రోడ్డు వేయాలని డైరెక్టర్లు చైర్పర్సన్ దృష్టికి తేగా ఉన్నతాధికారులకు నివేదికను పంపుతానని అన్నారు. మార్కెట్ కమిటీని దశలవారీగా అభివృద్ధి చేసుకుందామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు

## స్వచ్ఛతా హీ సేవ మనందరి బాధ్యత

- కరీంపూర్ సర్పంచ్ సుందరి అనిల్



కోటిపల్లి, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): స్వచ్ఛత ఈ సేవమనందరి బాధ్యత అని సర్పంచ్ అనిల్ అన్నారు. సోమవారం కోటపల్లి మండలంలోని కరీంపూర్ గ్రామంలో స్వచ్ఛతే సేవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్ మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే గ్రామ సేవకులైనటువంటి నసీర్, షరీఫ్ అలాగే ఫీల్ అసిస్టెంట్ అయిన ఆలీని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉస్మాన్ అలీ, వార్డు మెంబర్లు, బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సాదత్ అలీ గ్రామస్తులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు కేటాయించాలి

- ఎమ్మెల్యేను కోరిన జర్నలిస్టులు



కోడంగల్, సెప్టెంబర్ 25. మనం న్యూస్ : జర్నలిస్ట్ లకు ఇండ్లస్థలాలు కేటాయించాలని సోమవారం రోజు కోడంగల్ నియోజకవర్గ పరిధిలోని బొంరాస్ పేట్ మండల జర్నలిస్టులు ఎమ్మెల్యే పట్నంనరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇండ్లస్థలాలు కేటాయించడానికి కృషి చేస్తానని చెప్పారు. అక్కడే ఉన్న బొంరాస్ పేట్ మండల తహసీల్దార్‌ను స్థలాన్ని పరిశీలించవలసిందిగా ఆదేశించారు. ఈకార్యక్రమంలో జర్నలిస్టులు ప్రహ్లాద్ చారీ, యు. వెంకటయ్య, నర్సిములు, అశోక్ గౌడ్, అనంతయ్య, శ్రీశైలం, మాసాని వెంకటయ్య, పుర్ర రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి నిమజ్జనం ఏర్పాట్లను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్ పర్సన్



వికారాబాద్, సెప్టెంబర్ 25. మనం న్యూస్: వినాయక నిమజ్జనం ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఈరోజు ఎబ్బనూర్ చెరువు దగ్గర వినాయకుడి నిమజ్జనం ఏర్పాట్లను చైర్ పర్సన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధుల నుంచి దాదాపు రూ.5 లక్షల నిధులతో బ్యారికేడ్లు, రెండు క్రేన్లు, చెరువు దగ్గర లైటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని మరియు కౌన్సిలర్ల అభ్యర్థన మేరకు వినాయకుడి మండపాల దగ్గర డస్ట్ పోయించడం జరిగిందని చైర్ పర్సన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, కమిషనర్ జాకీర్ అహ్మద్, డిఈ తబితా, ఏఈ రాయుడు, ఎలక్ట్రికల్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత చేప పిల్లల పంపిణీతో మత్స్యకారుల జీవితాలలో వెలుగులు

- ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

కోడంగల్, సెప్టెంబర్ 25. మనం న్యూస్; కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని బొంరాస్ పేట్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో మత్స్య కార్మికుల కష్టాలు తీరాయని, వారు ఆర్థికంగా ఎదిగాలని, మత్స్యకారులకు వంద శాతం సబ్సిడీతో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోలేని వి.దంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మత్స్య కార్మికుల కోసం సొసైటీ ఏర్పాటు చేసి హక్కులు కల్పించిన ఏకైక రాష్ట్రం కూడా తెలంగాణ రాష్ట్రమేనని స్పష్టం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ బిజెపి పార్టీల నుంచి బిఆర్ఎస్ పార్టీలో చేరిక కావడం జరుగుతుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన వినాయక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి హేమిబాయి, మత్స్య శాఖ అధికారిణి చరితా రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కోట్ల యాదగిరి, ఎంపిటిసిలు శేరినారాయణ రెడ్డి, గుండుగారి తిరుపతయ్య, శ్రావణ్ గౌడ్, మల్లయ్య, నర్సిములు, దేశ్యనాయక్, నరేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.





## పోస్ట్ ఆఫీస్ ఆధార్ కేంద్రం వద్ద ఆధార్ లబ్ధిదారుల ఆందోళన

- ఈకేవైసీ కోసం ప్రజలు ఇబ్బందులు
- పోలీసులు రంగప్రవేశంతో సద్దుమణుగు



తాండూర్, సెప్టెంబర్ 25. మనం న్యూస్ : పోస్ట్ ఆఫీస్ ఆధార్ కేంద్రం వద్ద ఆధార్ లబ్ధిదారుల ఆందోళన కేవైసీ కోసం ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే ఆధార్ లింకు ఉంటేనే రేషన్ బియ్యం వస్తాయని పలు డీలర్లు సూచించడంతో తాండూర్ నియోజకవర్గంలోని పలు మండలంలోని ప్రజలు ఆధార్ లింక్ కోసం తాండూర్ పట్టణంలో ఉన్న పోస్ట్ ఆఫీస్ వద్దకు పరుగులు తీశారు. దీంతో ఒక్కసారిగా పోస్ట్ ఆఫీస్ ఆధార్ కేంద్రం వద్ద భారీగా రద్దీ పెరిగింది. ప్రతిరోజు తాండూర్ పోస్ట్ ఆఫీస్ ఆధార్ కేంద్రం సుమారు వందమందికి మాత్రమే లింకు చేయవలసి ఉండటంతో పెద్ద ఎత్తున లబ్ధిదారులు రావడంతో ఆధార్ కేంద్ర నిర్వాహకులు ఆధార్ సెంటర్ ను మూసివేశారు. ఈ క్రమంలో అక్కడ ఆందోళన నెలకొంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కూడా ఆధార్ లబ్ధిదారుల వైపు ఉండి ఆందోళన చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి అక్కడ ఉన్న వారిని చెదరగొట్టారు. లబ్ధిదారులు మాత్రం నిరాశతో వెనుతిరిగి వెళ్ళిపోయారు. వచ్చిన లబ్ధిదారులకూడా కొంత మందికి టోకెన్లు అందజేశామని దాని ప్రకారమే లింకు చేయబడుతుందని పోస్ట్ ఆఫీస్ నిర్వాహకులు తెలిపారు. మరోవైపు తాండూరులో గతంలో 5 ఆధార్ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం పోస్టాఫీసులో ఒక్కటి మాత్రమే కొనసాగుతుండడంతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. వినియోగదారులకు అనుగుణంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, లేదంటే ఆందోళన చేపట్టాల్సిన పరిస్థితి వస్తుందని అభిప్రాయాలను తెలిపారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

- బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి



బషీరాబాద్, సెప్టెంబర్ 25. మనం న్యూస్: బషీరాబాద్ మండలంలో తాండూర్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు బషీరాబాద్ బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజు పటేల్ (నర్సిరెడ్డి) ఆధ్వర్యంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేయడం జరిగింది. 16 మంది లబ్ధిదారులకు 7.34 లక్షల చెక్కుల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ మండల్ జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి పిఎసిఎస్సి చైర్మన్ వెంకట్రాంరెడ్డి. పిఎసిఎస్సి వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్. మండల కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ రజాక్ .కోర్విచేడ్ ఎంపిటిసి వడ్డే శ్రీనివాస్. సర్పంచ్ బీమాప్ప. యూత్ ప్రెసిడెంట్ తాహెర్ బాండ్. వైస్ ప్రెసిడెంట్ నితిన్,బి టిఆర్ఎస్ నాయకులు నీళ్ల పల్లి సుధాకర్ రెడ్డి. అశోక్ గౌతం. సాయిల్ గౌడ్. రవీందర్ సింగ్. నర్సింలు. రాజేశ్వరరావు.సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన అగ్గనూరు గ్రామస్తులు

- రాబోయే గెలుపు కాంగ్రెస్దే..చేరికలే ఇందుకు నిదర్శనం
- గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు పి నరేందర్



యాలాల్, సెప్టెంబర్ 25. మనం న్యూస్; వికారాబాద్ జిల్లా యాలాల మండలం అగ్గనూరు గ్రామంలోని ఇతర పార్టీకి చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధార సింగ్. పి నరేందర్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది అగ్గనూరు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో తాండూరు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని అగ్గనూరు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు అన్నారు. సోమవారం పి నరేందర్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పి నరేందర్ మాట్లాడుతూ. బిఆర్ఎస్ ప్రభుత్వం పాలను చూసి విసిగి వేసారి పోయిన నియోజకవర్గ ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగరవేయబోతుందన్నారు. అగ్గనూరు గ్రామంలో కాంగ్రెస్ కు భారీ మెజార్టీ ఇవ్వనున్నామన్నారు. కాంగ్రెస్‌పై ఉన్న నమ్మకానికి ఈ చేరికలే నిదర్శనమన్నారు. భవిష్యత్తులో మరిన్ని చేరికలు ఉండబోతాయన్నారు. కాంగ్రెస్ ను చూస్తే బిఆర్ఎస్ ప్రభుత్వానికి చెమటలు పడుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి లేని పార్టీ కాంగ్రెస్ అని ఇతర పార్టీలు ఎద్దేవా చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరు ఎమ్మెల్యే పదవికి పోటీ చేసే సత్తా కలిగి ఉన్న వారన్నారు. అందులో అధిష్టానం ఎవరిని నిర్ణయిస్తే వారే ఎమ్మెల్యే బరిలో నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

- అందజేసిన రాష్ట్ర జోగి కుల సంఘం అధ్యక్షుడు నరహరి



బషీరాబాద్, సెప్టెంబర్ 25. మనం న్యూస్: నిరుపేద మృతుడి కుటుంబానికి రాష్ట్ర జోగి కుల సంఘం అధ్యక్షులు నరహరి, రాష్ట్ర కోశాధికారి శ్రీహరి ఆర్థిక సాయం అందజేశారు. బషీరాబాద్ మండల పరిధిలోని ఎక్మ యి గ్రామానికి చెందిన జోగి వెంకటయ్య గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. విషయాన్ని తెలుకొని జోగి కులం హెల్పింగ్ హ్యాండ్ ద్వారా నిరుపేద మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. పేదరికంతో ఇబ్బందులు పడుతున్న మృతుడి కుటుంబ సభ్యులను జోగి సంఘం హెల్పింగ్ హ్యాండ్ వారు పరామర్శించి రూ.5000 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెయింట్ సెక్రటరీ చెట్టికింది నారాయణ, వెంకటేష్ జోగి, పోస్టాబు, నారాయణ జోగి, రామ కృష్ణ, మురళి, లక్ష్మణ్, నర్సింలు, గోపాల్, శాంత్ కుమార్, బల్రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంగ్లభాషను అనర్గళంగా మాట్లాడుదాం

- తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.రవీందర్ గౌడ్




కోడంగల్, సెప్టెంబర్ 25. మనం న్యూస్; కోడంగల్ నియోజకవర్గ పరిధిలోని బొంరాస్ పేట్ మండలం బొట్ల వాణి తాండ ఆశ్రమ పాఠశాలలో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా ఫౌండేషన్ మరియు కిసాన్ బంద్ సేవా సంస్థ సౌజన్యంతో విద్యార్థినిలకు డిక్షనరీలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఆంగ్లంపై పట్టు సాధించాలన్నారు. నేటి సమాజంలో విద్య ఉద్యోగ, సామాజిక పరిస్థితులలో ఆంగ్ల భాష ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. విద్యార్థులు ఆంగ్లభాషలో వెనకబడితే జీవితంలో కొన్ని రకాల ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది అన్నారు.అధునాతనమైనటువంటి ప్రపంచంలో నైపుణ్య ప్రదర్శనకై ఆంగ్లంలో స్పష్టంగా అనర్గళంగా నైపుణ్యాన్ని పెంపొందించుకొని విద్యార్థులు వారి భవిష్యత్తు బంగారు బాటలు వేసుకోవడానికి ఉన్నతమైన చదువులకు గాని ఉన్నతమైన ఉద్యోగాలకు ఈ భాషను అన్వయించుకోవడానికి వారికి ఉపయోగపడే విధంగా ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థినులు వసతి గృహాలలో ఉన్నప్పుడు హ్యాండ్ బుక్కుగా ఈ డిక్షనరీ ఉపయోగపడి వారి భవిష్యత్తుకు ఆంగ్లంపై ఎలాంటి భయం లేకుండా తర్ఫీదు పొందడానికి ఉపయోగపడుతుందని ఆలోచించి డిక్షనరీలు పంపిణీ చేయడమైందన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకారం చంద్రశేఖర్, విద్యావంతుల వేదిక జిల్లా నాయకులు గౌరారం గోపాల్, జాన్ ప్రవీణ్ కుమార్, మాసాని వెంకటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, సురేష్, శరణప్ప, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌కె పురం డివిజన్ మాల మహానాడు అధ్యక్షుడిగా సంతోష్



ఎల్బీనగర్, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ మాల మహానాడు అధ్యక్షుడిగా ఎన్టీఆర్ నగర్ కు చెందిన చవతి సంతోష్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారము జాతీ య మాల మహానాడు అధ్యక్షుడు జి.చెన్నయ్య చేతుల మీదు గా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్ర తి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జాతి ఐక్యత కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## అర్హులకే పేదలకు డబుల్ బెడ్ రూంలు పంపిణీ చేయాలి

- జిల్లా కలెక్టర్ కు బీజేపీ కౌన్సిలర్ సాహు శ్రీలత వినతి



తాండూరు, సెప్టెంబర్ 25. మనం న్యూస్ : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న డబుల్ బెడ్ రూం పంపిణీలో అర్హులకే అందేలా చూడాలని తాండూరు బీజేపీ 24వ వార్డు కౌన్సిలర్ సాహు శ్రీలత కోరారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి పలు అంశాలపై వినతిపత్రాలను అందజేశారు. తాండూరు పట్టణంలోని శివాజీ చౌరస్తాలో ఓ వ్యక్తి రోడ్డు ఆక్రమించుకుని కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు తాండూరులో వీధి కుక్కల బెడద పెరిగిపోయిందని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా తాండూరులో అమలు చేస్తున్న డబుల్ బెడ్ రూం పథకాలలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూంలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళ నాయకులు, మహిళ మోర్చ నాయకులు ఉన్నారు.

## ఫార్మసిస్టులకు కెమిస్టకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ కల్పించాలి

- అసోసియేషన్ అధ్యక్షులు డా.పెండెం కృష్ణకుమార్



ఎల్బీనగర్, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): ఫార్మసిస్టులకు, కెమిస్టకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ కల్పించాలిఅని గిన్నిస్ వరల్ రికార్డ్ హోల్డర్, రంగారెడ్డి జిల్లా కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా, పెండెం కృష్ణకుమార్ అన్నారు. సోమవారం ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా స్వంతంగా షాపు నడిపిస్తున్న ఫార్మసిస్ట్ లకు, మహిళా ఫార్మసిస్ట్ లకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణ కుమార్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో, ప్రతి రోజు ఎలాంటి సెలవు తీసుకోకుండా విధులు నిర్వహిస్తున్న ఫార్మసీస్టలకు, కెమిస్టలకు అభినందనలు తెలిపారు.

ఎటువంటి విపత్కర సమయములో కూడా ప్రాణాలకు తెగించి సెలవు దినాలు లేకుండా విధులు నిర్వహిస్తున్న వారి సేవలు చాలా గొప్పవి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఫార్మసిస్ట్ లను ఘనముగా సత్కరించారు.



ఆర్కే పురం డివిజన్ మార్గదర్శి కాలనీ రోడ్ నెంబర్ 6 శివ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆర్కే పురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ జాహిద్. ఈ కార్యక్రమంలో నవీన్ ,ప్రధాన కార్యదర్శి సిద్ధగోని వెంకటేష్ గౌడ్ ,ఉపాధ్యక్షులు ముచ్చింతల జగన్, పబ్బు శేఖర్, శివ పాల్గొన్నారు.

- ఎల్బీనగర్, సెప్టెంబర్ 25(మనం న్యూస్)

# విష జ్వరాలు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట, సెప్టెంబర్ 25, మనం ప్రతినిధి: వర్షకాలం కావడంతో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అధనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంకతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని జిపిలు, మున్సిపాలిటీలలో రోజువారి పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు జరగాలని, విష జ్వరాలు, ఇతర వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ సమస్యలపై అర్జీదారుల నుండి 49 ధరఖాస్తులు ప్రజలనుండి అందాయని, వాటిలో భూ సమస్యలపై 35, ఇతర శాఖలకు సంబంధించి 14 ధరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఈఓ సురేష్‌కుమార్, పిడి కిరణ్‌కూమార్, డిపిఓ యాదయ్య, సిపిఓ వెంకటేశ్వర్లు,



డిఎఓ రామారావు నాయక్, డిహెచ్ఓ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల సూచనలు పాటించాలి



సూర్యాపేట సెప్టెంబర్ 25 మనం ప్రతినిధిః గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమాలు జిల్లాలో ప్రశాంతమైన వాతవరణంలో నిర్వహకులు చేపట్టాలని జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గణనాధుని నిమజ్జనం చేసే ప్రదేశంలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సంబంధిత అధికారలు సమన్వయంతో కలిసి విధులు నిర్వహించాల ని, ప్రజలు పోలీసుల సూచనలు తప్పకపాటించాలని అన్నారు. హోరెత్తించే డిజెలు, బాణా సంచాలను నిషేధించడం జరిగిందని, సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో ట్రాఫిక్ ఏలాంటి అంతరాయం కలిగించకూ డదని, మహిళలను, ఇతరులనేవ్వరిని అగౌరవపరచకూడదని, మతసామరస్యానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని, నీటి ప్రవాహం, లోతట్టు ప్రాంతాలకు వెళ్లకూడదని, శోభాయాత్రలో చిన్నపిల్లలు ఉండకుండా చూసుకోవాలని, నిమజ్జన సమయంలో సెల్‌ఫోన్‌లో సెల్ఫీలు తీసుకోకూడదని, విద్యార్థులు, యువత ఆదర్శంగా ఉండాలని, వివదాలకు పోకూడదని పేర్కొన్నారు.

**పోలీస్ గ్రీవెన్స్‌డేకు 10 పిర్యాధులు**

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డేకు 10 పిర్యాధులు అందాయని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రజల నుండి అందిన ఆర్జీల ను సంబంధిత అధికారులు అర్థతమేర పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలకు అండగా ఉండాలని సూచించారు.

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ వారసులపైనే ఉంటుందని, వారిని ఇబ్బందులకు గురి చేసినట్లు తమకు పిర్యాధు అం దితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. హోంగార్డు శాఖలో విధులు నిర్వహిస్తున్న సక్రు నాయక్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఎస్పీ మృతునికి సంతాపం తలెపి పోలీస్ సంక్షేమం నుండి తక్షణ ఆర్థిక సహాయం అందజేసి, కుటుంబ సభ్యలను పరామర్శించారు. ఈ కార్యక్ర మంలో అ. దనపు ఎస్పీ నాగేశ్వర్రావు, డీఎస్పీ నాగభూషణం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోలాటం మహిళలకు చీరలు అందజేత



తిరుమలగిరి, సెప్టెంబర్ 25, మనం న్యూస్: మండల పరిధిలోని మొండి చింత తండాలో కోలాటం వేసే మహిళలకు సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీ కాంత్ రాజ్ చీరలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మామిడాల కరుణాకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ భారత్ దివాస్‌పై ప్రతిజ్ఞ



తిరుమలగిరి, సెప్టెంబర్ 25, మనం న్యూస్: స్వచ్‌తాహీ ఇండియన్ స్వచ్ఛత లీగ్ సఫాయి మిత్ర సురక్ష షీవీర్‌లో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులతో స్వచ్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు



పెన్‌పహాడ్, సెప్టెంబర్ 25, మనం న్యూస్: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని విగ్రహదాత సూర్యాపేట 13 వ వార్డు కౌన్సిలర్ వట్టె రేణుక అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనంతారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆదర్శ యూత్ ఉత్సవ కమిటీ సభ్యులు రేణుకాను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఆద్యాత్మిక భావంతో మానసిక శక్తి సిద్ధించడంతో పాటు సేవ దృక్పదం అలవాటు పడుతుందని, గ్రామాలలో స్నేహపూర్వక వాతవరణం నెలకొల్పబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం, అంజయ్య, ఉదయ్, సంజీవరెడ్డి, రాంరెడ్డి, రంగారెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజు, జానీ, శేఖర్, శరత్, శ్రీనివాస్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## డిజేలు నిషిద్ధం



సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 25, మనం న్యూస్: వినాయకుని నిమజ్జన వేడుకలలో భాగంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు శోభాయాత్రలో డిజేలకు అనుమతిని నిషేధించినట్లు పట్టణ పోలీస్ అధికారి రాజ శేఖర్ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని డిజే సౌండ్ నిర్వహకులతో పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. శోభాయాత్ర, నిమజ్జన వేడుకలలో డిజేలకు ఏలాంటి అనుమతులు లేవని, పెద్దపెద్ద శబ్దాల వలన కాలుష్యం ఏర్పడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజల నుండి విజ్ఞప్తులు రావడంతో నిషేదించడం జరిగిందన్నారు. గణేష్ ఉత్సవ వేడుకలు ప్రశాంతమైన వాతవరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

## ఘనంగా బిఆర్ఎస్ నాయకుడు యుగేంధర్ జన్మదిన వేడుకలు



తుంగతుర్తి, సెప్టెంబర్ 25, మనం న్యూస్: బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుజ్జ యుగేంధర్‌రావు జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే గాదరి కిషోర్ నివాసంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొపగాని రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుగేంధర్‌రావు తల్లి గుజ్జ పూలమ్మ చేతుల మీదుగా భారీ కేకును కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం స్థానిక రామాలయం ప్రాంగణం నందు ప్రతిష్టించిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నధాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుడిపాటి సైదులు, రాములు గౌడ్, యాదగిరి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సంతోష్, బిక్షం, వెంకన్న, రవికూమార్, ఆశోక్, నారాయణ, నాగమల్లు, శివ, ప్రసన్న, ప్రసాద్, సూరయ్య, రామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం



సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 25, మనం న్యూస్: అన్నదానం మహాదానమని గణపతి ఉత్సవాలను ప్రశాంతమైన వాతవరణంలో నిర్వహించుకోవాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. సోమవారం వినాయక చవితి నవరాత్రి వేడుకలలో భాగంగా పట్టణంలోని 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినవిగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభసభ్యుడు మాట్లాడుతూ. ఉమ్మడి జిల్లాలతో పాటు పట్టణాన్ని ఎన్నడు లేని విధంగా సిఎం కేసిఆర్ పాలనలో మంత్రి జగదీష్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా సమాజాభివృద్ధికి ఎంతో సేవ చేస్తున్న గండూరి కృపాకర్‌పావనిలను అభినందించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్, కౌన్సిలర్ తాహేర్‌పాష, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బూరబాల సైదులు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సాలయ్య, బిక్షం, మధు, శ్రీనివాస్, వెంకటేశ్, మృదులాగర్, కళ్యాణ్, సందీప్ పాల్గొన్నారు.

## పెద్ద చెరువును పరిశీలించిన వైస్ చైర్మన్

తిరుమలగిరి, సెప్టెంబర్ 25, మనం న్యూస్: పట్టణంలోని వినాయక నిమజ్జనం సందర్భంగా పెద్ద చెరువును, కట్టను సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, కమీషనర్ దండు శ్రీనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. వినాయక నిమజ్జనం సమయంలో భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనులను పరిశీలించారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలి



పాలకీడు, సెప్టెంబర్ 25, మనం న్యూస్: విఘ్నేశ్వరుడు ప్రజలందరిని చల్లగా చూడాలని, పాడి పంటలు, వృత్తి వ్యాపారులు, పరిశ్రమలు దినదినాభివృద్ధి చెందుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు మీసాల ఉపేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పుటకోట యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ప్రత్యేక పూజలు నిర్వహించి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొండ శ్రీనివాస్‌గౌడ్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాని ఆయన ప్రారంభించారు. ప్రజలందరికి భక్తిశ్రద్ధలతో, పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమ కులమతాలకతీతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కొత్తపల్లి సుందరయ్య, బొజ్జ నవీన్, మీసాల నాని, మీసాల గామయ్య, కమల్‌హాసన్, మనిక్యారావు, పాల్గొన్నారు.

## బ్లాక్ కమిటీ యూత్ అధ్యక్షుడిగా శేషిరెడ్డి నియామకం



పాలకీడు, సెప్టెంబర్ 25, మనం న్యూస్: బ్లాక్ కమిటీ యూత్ అధ్యక్షుడిగా పాలకీడు మండలానికి చెందిన తీగల శేషిరెడ్డిని నియమిస్తున్నట్లు జిల్లా బ్లాక్ కమిటీ అధ్యక్షులు మహేష్‌గౌడ్, మండల బ్లాక్‌కమిటీ అద్యక్షులు నాగిరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణ ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియమక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సుబ్బారావు, మోతిలాల్, జితేందర్‌రెడ్డి, మీసాల ఉపేందర్‌లు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తలకే పథకాలు



సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 25, మనం న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే ఇవ్వడం సరికాదని, ఇప్పటికైన అధికార పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు తమ వైఖరిని మార్చుకోవాలని సిపిఐఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ విమర్శించారు. సోమవారం ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందించకుండా అన్యాయం చేస్తున్నారని, ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడి అర్హులైన బహుజనులు, పేదలకు లబ్ధిచేకూరేలా చూడాలని, లేదంటే ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలు ఇవ్వాలని చేసిన ధర్నాలో పోలీసులకు, ఆ పార్టీ కార్యకర్తలకు మద్య వాగ్వివాదం జరిగి, తొపులాటకు దారి తీయడంతో కొందరికి స్వల్పగాయాలు అయ్యాయి. అనంతరం కలెక్టరేట్‌లోకి అనుమతి నివ్వడంతో కలెక్టర్ వెంకట్రావుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, యాదగిరిరావు, సైదులు, శ్రీరాములు, ఏకలక్ష్మీ, వెంకన్న, నరసింహరావు, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



హుజూర్‌నగర్, సెప్టెంబర్ 25, మనం న్యూస్: తెలంగాణ మత్స్యకారుల సంఘం ఆద్వర్యంలో సోమవారం మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శీలం సూర్యపేట జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 23 మండలాల్లో అనేక మండలాలలో చెరువులు కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని వాటిని వెంటనే గుర్తించి ట్రన్స్ కొట్టించాలని, అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టలు మత్స్య పారిశ్రామిక అభవృద్ధి మత్స్యకారుల సంక్షేమానికి ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో 5వేల కోట్లు నిధులు కేటాయించి ఖర్చు చేస్తామని హమీ ఇవ్వాలని, ఎన్నకల ముందే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఎన్సీడీసీ ఎన్ఎఫ్డిబీల ద్వారా 2వ విడత రుణాలుగా 1000కోట్లు, 64ఎకరాల సంక్షేమ పథకాలు 90శాతం సబ్సిడితో అందించాలన్నారు. ప్రతి మత్స్యకార సోసైటికి రూ. 10లక్షలు ప్రతి మార్కెటింగ్ కో ఆపరేటివ్ సోసైటికి, మహిళ సోసైటికి రూ. 5లక్షల చొప్పున ఆర్థిక సహకారం అందించి సోసైటీలు స్వతంత్రంగా వృత్తి వ్యాపారం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలన్నారు. మత్స్య వృత్తిలో ఆకస్మాత్తు ప్రమాదంతో మరణించిన వారికి రూ. 10లక్షలు ఇవ్వాలని, ప్రతి సోసైటికి నగదును అకౌంట్లో వేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మేకనబోయిన శేఖర్, పోషనబోయిన హుస్సేన్, పోలబోయిన శ్రీను, ఎంకటి, నర్సింహరావు, నాయకులు సైదులు, హుస్సేన్‌మియా, వెంకటేశ్వర్లు, దస్తగిరి, వెంకటరాములు, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 25, మనం న్యూస్ః విగ్నేషుని చతుర్థిలో భాగంగా నవరాత్రుల అనంతరం నిర్వహించే నిమజ్జన వేడుకలను ప్రజలు, భక్తులు ప్రశాంతంగా ఇతరులకు ఇబ్బంది కలుగనీయకుండా జరుపుకోవాలని డీఎస్పీ నాగభూషణం అన్నారు. సోమవారం ఈ నెల 27న నిర్వహించే గణపతి నిమజ్జనప్రదేశం మినీ ట్యాంక్‌బండ్ పరిసరాలను మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. నిమజ్జన వేడుకలలో భాగంగా వినాయక కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు తప్పక పాటించాలని, ప్రజలకు, ట్రాఫిక్‌కు ఏలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తించిన వారిపట్ల చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని మళ్ళీ భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

- పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి



హుజూర్‌నగర్, సెప్టెంబర్ 25, మనం న్యూస్: హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. 32 బూత్ కమిటీల ఎన్నికల సన్నాహక సమావేశం పట్టణంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. సోమవారం పట్టణ బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో అధికారం బీఆర్ఎస్ పార్టీదే నని ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని నాయకులు, కార్యకర్తలు సైనికులా పనిచేయాలని ప్రతికార్యకర్త 100ఓట్లను చాలెంజ్‌గా తీసుకుని ప్రతిఓటు బీఆర్ఎస్ కారు గుర్తుకు పడేలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు నర్సింగ్ వెంకటేశ్వర్లు, కెఎల్ఎన్‌రెడ్డి, అట్లూరి హరిబాబు, గోల్డ్ పిచ్చయ్య, పీఏసీఎస్ చైర్మన్ యరగాని శ్రీనివాస్, కౌన్సిలర్లు ఓరుగంటి నాగేశ్వర్‌రావు, యరగాని గుర్వయ్య, గుండా ఫణికుమారి, జక్కుల శంభయ్య,కొమ్ము శ్రీను, దొంగరి మంగమ్మవీరారెడ్డి, ములకలపల్లి రాంగోపి, చిలకబత్తిని సౌజన్య ధనుంజయ, కుంట ఉపేంద్రసైదులు,వీర్లపాటి గాయత్రిభాస్కర్, ముఖ్యనాయకులు సోమగాని ప్రదీప్, బెల్లంకొండ అమర్, యడ్ల విజయ్, తండు హరికృష్ణ, మహిళ అధ్యక్షురాలు దొంతిరెడ్డి పద్మరెడ్డి, వార్డు ఇంఛార్జ్‌లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పట్ల హర్షం



హుజూర్‌నగర్, సెప్టెంబర్ 25, మనం న్యూస్: ఎన్నో దశాబ్దాలుగా మహిళ రిజర్వేషన్ బిల్లు కోసం ఎదురు చూస్తున్న వేళ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు ఆమోదం తెలపడం పట్ల నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు జంగం అఖిలా హర్షం వ్యక్తం చేశారు. చట్టసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్‌లకై పార్లమెంట్‌లో బిల్లు తేవడాన్ని హర్షిస్తూ, అన్ని రాజకీయ పార్టీలు మహిళ బిల్లుకు ఆమోదం తెలిపి వచ్చే ఎన్నికల్లో మహిళ రిజర్వేషన్ అమలయ్యేలా చూడాలన్నారు.

## మహిళ రిజర్వేషన్ బిల్లు ఒక నాటకం



హుజూర్‌నగర్, సెప్టెంబర్ 25, మనం న్యూస్: భారత జాతీయ మహిళా సమాఖ్య ఆద్వర్యంలో దేవరం సుజాత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మహిళ సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సృజన పాల్గొని మాట్లాడుతూ... పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించామని, బిజేపీ ప్రభుత్వం ఒక ఎన్నికల ఎత్తుగడతోనే మహిళ బిల్లుని తీసుకొచ్చామని, మహిళ ఓట్ల కోసం మహిళ బిల్లుపాస్ చేశారని, గత 30సంవత్సరాల నుండి గీతా ముఖర్జీ ఆధ్వర్యంలో పార్లమెంట్‌లో ఎంపిగా 7సంవత్సరాలుగా, వరుసగా పోటీ చేసి మహిళా బిల్లు అమలు కమిటీలో చైర్మన్‌గా పనిచేసిన గీతా ముఖర్జీ ఆమె పోరాటం విలువ కట్టలేనిది జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల్లో జిల్లాల్లో విస్తృతమైన మహిళ ప్రజాభిప్రాయ సేకరణ చేసి సంతకాల సేకరణలు చేసి నిరాహార దీక్షలు చేసి చాలా ఉద్యమాలు చైతన్యపరిచి మహిళ హక్కుల కోసం మహిళ రక్షణ, ఆస్తి హక్కు కోసం పోరాటం రూపకర్తగా ఉన్నటువంటి గీతా ముఖర్జీ పేరు పెట్టకపోవడం కేంద్రప్రభుత్వం సిగ్గుపడాలని నాని శక్తి అని పేరు పెట్టి ఉద్యమకర్త గీత ముఖర్జీ పేరు పెట్టకపోవడం శోచనీయమని ఆవేధన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మహిళ సమాఖ్య కార్యదర్శి దేవరం మల్లీశ్వరి, పట్టణ కార్యదర్శి ఎల్లావుల ఉమా, దేవరం లక్ష్మీ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి



శంకరపట్నం, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): శంకరపట్నం మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దరువు ఎల్లన్న హాజరై మాట్లాడుతూ పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడుగా భారతీయ జనసంఘ్ అధ్యక్షుడిగా, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్తగా చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల జనరల్ సెక్రెటరీ ఎలుక పెల్లిసంపత్, మండల ఉపాధ్యక్షులు పెసర్ అర్జున్, సంపత్, మండల కార్యదర్శి రాజేందర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కనకం సాగర్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు బిజిలి సారయ్య ,సోషల్ మీడియా కన్వీనర్ చుక్కల శ్రీకాంత్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ బూత్ అధ్యక్షులు అశోక్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిఎస్పీగా మొట్ల వెంకటరమణ బాధ్యతలు స్వీకరణ



కొమురంభీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): ఆసి ఫాబాద్ నూతన డిఎస్పీగా ఎం. వెంకటరమణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్ పిటిసి నుండి బదిలీపై ఆసిఫాబాద్‌కి వచ్చారు. వెంకటరమణ 1991సంవత్సరంలో ఎస్ఐగా ఉద్యోగం సాధించారు. 2008లో సిఐగా పదోన్నతి పొందారు. 2017లోనే డి.ఎస్.పిగా పదోన్నతి పొందారు. 2023లో పోలీస్ ట్రైనింగ్ క్యాంప్ కరీంనగర్‌లో పనిచేస్తూ బదిలీపై ఆసిఫాబాద్ డి.ఎస్పీగా భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగావెంకటరమణ మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించిన కఠిన చర్యలు తప్పవని, చట్టానికి ఎవరు అతీతులుకారని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

- కాంగ్రెస్ పార్టీ నేత రేగులపాటి రమ్యారావు



కరీంనగర్, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేత రమ్యారావు రేగులపాటి అన్నారు. నగరంలోని టవర్ సర్కిల్ వద్ద చిరు వ్యాపారం చేసుకుంటున్న నిరు పేదలను కలిసి అభయ హస్తం పథకాలలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు,చేయూత,యువ వికాసం, కార్యక్రమాల గ్యారెంటీ కార్డును వీధి వీధి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా రమ్య రావు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలు పే దలకు అందాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీ కూడా నిరుపేదలకు అందడం లేదని, ప్రజలు తిరిగి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కరీంనగర్‌తో పాటు రాష్ట్రంలో అత్యధిక సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలిచి తిరిగి అధికారం చేపట్టబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్, కమలాకర్ రియాజ్ అన్న పూర్ణ లక్ష్మి పద్మ, స్వప్న, రాజేశ్వరి మల్లమ్మ మంగ జ్యోతి రాధ కీర్తి అరుణ విజయ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలో కోరా జాన్సన్ విద్యార్థుల హవా

- విద్యార్థులను అభినందించిన పాఠశాల యాజమాన్యం




కరీంనగర్, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): నగరంలోని కోరా ఉన్నాత పాఠశాల విద్యార్థులు ఈనెల 20వ తేదీన కరీంనగర్ అర్బన్ జోన్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్.జి. ఎఫ్.ఐ)లో భాగంగా కబడ్డీ పోటీలో వివిధ పాఠశాల విద్యార్థులతో గట్టి పోటీ ఇచ్చి మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. ఇందులో సాహితి టీమ్ కెప్టెన్‌గా వ్యవహారించి హరిక, బంధన్, పూజిత, హరిక, శ్రీనిది, పూనమ్ అండర్ -14లో పాల్గొని మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాల డైరెక్టర్ సింహాచలం హరిక్రిష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను చూసి చదువుతో పాటు ఆటలు మానసిక వికాసాన్ని దేహాదారుడ్యాన్ని పోటి తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. దీనిలో సాహితి, పూనమ్. అట తీరుకి పాటశాల యాజమాన్యం తల్లిదండ్రులకు విద్యార్థులకు ఆటలో శిక్షణ ఇచ్చిన పి.ఇ.టి దుర్గరాజుని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, వరప్రసాద్, రాంరెడ్డి, హరిక్రిష్ణ, సంతోష్ రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# అధికారపక్ష నేతల అవినీతి, అక్రమాలకు లెక్కలేదా..?

- బిజెపి నేతలపై ఇడి, ఐటి దాడులు ఎందుకు జరుగవు..?
- టిఎస్పీఎస్సీలో పారదర్శకత లోపిస్తే సిఎం, మంత్రులు ఏం చేస్తున్నారు..?
- నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడితే చూస్తూ ఊరుకోం
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): తాము అధికారంలోకి వస్తే అవినీతి లేని పరిపాలన అందిస్తామని అనేక సార్లు ప్రగల్భాలు పలికిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాత్రం అధికారపక్షంలోని నాయకులు ఎంత అవినీతి అక్రమాలకు పాల్పడ్డా చూసి చూడనట్లు వ్యవహరిస్తూ, ప్రతిపక్షాలపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతూ ఇడి, ఐటి దాడులు చేయిస్తున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. అధికార పక్ష నేతలు ఎంత అవినీతి, అక్రమాలకు పాల్పడ్డా లెక్క లేదా..? అని ప్రశ్నించారు. సోమవారం కరీంనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ అన్ని రంగాల వ్యవస్థలను ధ్వంసం చేస్తూ పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఇటీవల నూతన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని పిలవకపోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. నూతన పార్లమెంటు భవనంలో మహిళా బిల్లు ప్రవేశపెట్టి గొప్పలు చెప్పుకుంటుందని, మహిళా బిల్లును ఆనాటి సిపిఐ ఎంపీ గీతా ముఖర్జీ 1996లో పార్లమెంటులో బిల్లు పెట్టిందని గుర్తు చేశారు. 2008లో రాజ్యసభ ఆమోదించిందని, అప్పటినుండి అనేక అడ్డంకులు వచ్చి ఆ బిల్లు నిలిచిపోయిందన్నారు. ఆ బిల్లుకు ఎలాంటి మార్పులు చేర్పులు చేయకుండా నరేంద్ర మోడీ ప్రభుత్వం పార్లమెంటు సమావేశాల్లో ఆమోదించి మహిళలను తామే ఉద్ధరించామని గొప్పలు చెప్పుకుంటోందని చాడ విమర్శించారు. 2024 లో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు కాదని, దేశవ్యాప్తంగా కులాల జనగణన జరగలేదని 75 సంవత్సరాల తర్వాత దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఇతర కులాల జనాభా పెరిగిపోయిందన్నారు. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కావాలని వారంతా కోరుతున్నారని 2021 లోనే జనాభా లెక్కలు చేయాల్సి ఉన్నప్పటికీ మోడీ ప్రభుత్వం ఎందుకు చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన మోడీ ఉన్న ఉద్యోగాలు ఊడిపోతున్నాయి తప్ప ఏ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. బిజెపి పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ధ్వంసం అవుతున్నాయని, కార్మిక హక్కులు కాలరాయపడుతున్నాయని, దేశంలో మతోన్మాదం పెరిగిపోయిందని విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని ఫెడరల్ వ్యవస్థకు భిన్నంగానే మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. కేంద్రం రాష్ట్రాలను సమన్వయ పరిచేది పోయి రాష్ట్రాల హక్కులను హరిస్తూ రాష్ట్రాలపై పెత్తనం చెలాయించాలని చూస్తుందన్నారు. జమిలి ఎన్నికలు అంటూ ఇప్పుడు వాటి చుట్టూ తిరుగుతుందని, జమిలి ఎన్నికలు పోయి యదార్థ స్థితిలోనే ఎన్నికలు జరగనున్నాయని వెంకటరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వచ్చిందని ఎన్నికల ప్రక్రియలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు కసరత్తులు ముమ్మరం చేస్తుండగా, బిజెపి మాత్రం అంతర్మధనంలో పడిపోయిందన్నారు. రాష్ట్రానికి అక్టోబర్ 1న మోడీని తీసుకు వస్తున్నామని చెప్పుకుంటుంది తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, ఎన్నికల కోలాహలంలో అన్ని పార్టీలు ఉన్నాయే తప్ప దేశంలో రాష్ట్రంలో ప్రజల సమస్యలు, వారి బతుకులు ఏంటి అని ఆలోచించకపోవడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ చాలా దిగజారిపోయిన పద్ధతిలో ఉందని విమర్శించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ, యువకులు గతంలో పరీక్షలకు సిద్ధమైతే అప్పుడు పరీక్షలు రద్దు చేసిందని, తిరిగి ఈ మధ్యకాలంలో పరీక్షలు రాస్తే వాటిలో అనేక లోపాలు ఉన్నాయని కోర్టు రద్దు చేయడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. లోపభూయిష్టంగా టిఎస్పీఎస్సీ ఉంటే సిఎం, మంత్రులు ఏం చేస్తున్నారని వెంకటరెడ్డి ప్రశ్నించారు. లక్షలాదిమంది నిరుద్యోగ యువతీ యువకుల బ్రతుకులు బజారున పడ్డాయని వారంతా ఎన్నో రోజులుగా కష్టపడి చదివి, కోచింగులకువెళ్లి, అప్పుల పాలై పరీక్షలు రాస్తే అది కాస్త రద్దవడం భాదాకరమని, దీంతో వారంతా నిరాశ నిస్పృహల్లో ఉండి ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్న సీఎం కేసీఆర్ వారికి సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడంలో ఘనుడని వాటికి తామేం అభ్యంతరం చెప్పడం లేదని, అనేక పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందడం లేదని దళిత బంధు పథకం ఎవరికి ఇస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సంక్షేమ పథకాలు అసలైన అర్హులకు పేదరికంలో మగ్గుతున్న వారికి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అందించాలే తప్ప అధికారంలో ఉన్న పార్టీ కార్యకర్తలకు కాదని సూచించారు. రైతు బంధు విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. వ్యవసాయం చేసే వారికి రైతు బంధు అందకుండా, బడా బాబులకు మాత్రమే అందిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది పేద విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం మూలంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ,పీఆర్సీ పెంచి అంగన్వాడీ ఉద్యోగులపై చిన్న చూపు చూడడం సరైనది కాదన్నారు. గత కొంతకాలంగా వారు సమ్మె చేస్తున్న పట్టించుకోకపోవడం సరైంది కాదని వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అలాగే ఆరోగ్య శాఖలో పనిచేసే రెండవ జాతీయ ఆరోగ్య మిషన్లో పనిచేసే వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని చాడ వ్యాఖ్యానించారు. ప్రజల ఆకాంక్షల కనుగుణంగా ప్రభుత్వ పరిపాలన ఉండాలని, లేనిపక్షంలోప్రజా ఉద్యమాలు నిర్వహించగా తప్పదని చాడ వెంకటరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, అందే స్వామి, టేకుమల్ల సమ్మయ్య, గూడెం లక్ష్మి, బండ రాజిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజు, మచ్చ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాంత్రిక పూజల్లో కేసీఆర్ సిద్ధహస్తుడు

- మాట వినని సొంత పార్టీ నేతలు నాశనం కావాలని పూజలు చేస్తున్నారు
- గణేష్ మండపాల పేరిట ఒక్కో అసెంబ్లీకి రూ.3 కోట్లు పంపారు
- బిఆర్ఎస్‌లోకి పోయినోళ్లంతా తప్పు తెలుసుకుని మదనపడుతున్నారు
- ఎన్ని వేషాలేసినా.. ఎంత ఖర్చు పెట్టినా.. మళ్లీ కెసిఆర్ అధికారంలోకి రావడం కల్ల
- గ్రూప్ వన్ పరీక్షల రద్దుకు ముమ్మాటికీ కేసీఆరే బాధ్యుడు
- నిరుద్యోగులకు క్షమాపణ చెప్పి రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలి
- కులాల మధ్య కుంపట్లు పెట్టి కాంగ్రెస్ గెలవాలనుకుంటోంది
- బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): ముఖ్యమంత్రి కేసీఆర్ తాంత్రిక పూజల్లో సిద్ధహస్తుడని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఇతర పార్టీల నేతలనే కాకుండా తన మాట వినని సొంత పార్టీ నాయకులు కూడా నాశనం కావాలని కోరుకుంటూ ఇతర రాష్ట్రాలకు వెళ్లి క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపించారు. గణేష్ మండపాలకు తాయిలాల పేరుతో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3కోట్ల రూపాయలు అందిస్తూ యువతను బిఆర్ఎస్ వైపు ఆకర్షించేందుకు కుట్ర చేశారని దుయ్యబట్టారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని సోమవారం కరీంనగర్ లోని మహాశక్తి ఆలయం వద్ద బండి సంజయ్ మొక్కలు నాటారు. అనంతరం బిజెపి ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ఎన్ని వేషాలేసినా. ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా అధికారంలోకి రావడం మాత్ర కల్ల అని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల మద్ధతుతో బిజెపి ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దళిత బంధు, బీసీ బంధు ఇస్తామంటూ బిజెపి సహా ఇతర పార్టీల నేతలను కూడా బీఆర్ఎస్‌లోకి వచ్చేలా కెసిఆర్ ఆశ పెడుతున్నారన్నారు. గ్రూప్ వన్ పరీక్షల రద్దుకు ముమ్మాటికి కేసీఆర్ బాధ్యత వహించి నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు నష్టపోయిన ప్రతి నిరుద్యోగికి లక్ష రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, అలాగే గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కో నిరుద్యోగికి లక్షా 60 వేల నిరుద్యోగి భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేసీఆర్‌కు ఓట్లు అడిగే హక్కే లేదని, నిరుద్యోగులు క్షమించ బోరన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలుకు లాల మధ్య కుమ్ములాటలు పెట్టి గెలవాలని చూస్తోందన్నారు. కాంగ్రెస్ నుండి గెలిచే వాళ్లంతా కేసీఆర్‌కు ఏటీఎం మిషన్ లాంటివాళ్లేనని, ఎప్పుడంటే అప్పుడు వాళ్లను బీఆర్ఎస్‌లోకి తీసుకోవడం ఖాయ మన్నారు.

### మచ్చలేని మోడీ పాలనను ప్రతిపక్షాలు ఓర్వడం లేదు...

చిట్టచివరి వ్యక్తిదాకా ప్రగతి ఫలాలు అందాలని దీన్ దయాళ్ చెప్పిన మాటలను అక్షర సత్యాలుగా అమలు చేస్తూ అవినీతి మరక లేకుండా జనరంజకంగా పాలిస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని సంజయ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, బిఆర్ఎస్ వంటి మోసపూరిత ప్రాంతీయ పార్టీలన్నీ ఏకమై మోదీపై దుష్ప్రచారం సాగిస్తున్నాయన్నారు. అయినా వెనుకంజ వేయకుండా నమ్మిన సిద్ధాంతం కోసం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ బాటలో నడుస్తూ వ్యక్తి స్వేచ్ఛ, ప్రజా స్వామ్యాన్ని గౌరవించేదే రామరాజ్యం అని నిరూపిస్తూ ధర్మబద్ధ పాలన కొనసాగిస్తున్న నరేంద్రమోదీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ నిజమైన వారసుడని కొనియాడారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాల సాధన దిశగా ప్రతి ఒక్క కార్యకర్త పాటు పడాలని, మోదీ అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు సమాజంలోని చిట్ట చివరి వ్యక్తి వరకు అందేలా చూడాలని సూచించారు.

### కరీంనగర్‌లో చిల్లర రాజకీయాలు కొనసాగుతున్నాయి..

కరీంనగర్‌లో చిల్లర రాజకీయాలు కొనసాగుతున్నాయని, అడ్డగోలుగా సంపాదించిన సొమ్ముతో డబ్బుల ఆశ చూపి ఇతర పార్టీల నాయకులను బీఆర్ఎస్‌లోకి లాగుతున్నారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. దళిత బంధు, బీసీ బంధు పైసలిస్తామని ఆశ చూపి లొంగదీసుకోవాలనుకుంటున్నారన్నారు. ఆత్మగౌరవం ఉన్నోళ్లు, ధర్మం కోసం పోరాడే వాళ్లు మళ్లీ బీజేపీలోకి వస్తారని, కొందరు ఇప్పటికే తమ తప్పును తెలుసుకుని వచ్చేందుకు సిద్ధమవుతున్నారని వెల్లడించారు.

# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు



లక్షెట్టిపేట్, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీతోనే అందరికీ న్యాయం జరుగుతుందని అందుకే బీ ఆర్ ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ మెంబెర్ కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు .సోమవారం పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేరికలో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగడం లేదన్నారు. ఎమ్మెల్యే దివాకర్ రావు స్వంత ఎజెండాతో నడుస్తూ తమ స్వంత పార్టీ కార్యకర్తలను కూడా కష్టాల పాలు చేస్తున్నారని విమర్శించారు. దండేపల్లి, లక్షెట్టిపేట్ మండలాల్లో బీ ఆర్ ఎస్ నాయకులు దాదాపుగా అందరూ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని, తనను నమ్ముకున్న ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరుగదని, తాను అండగా ఉంటానని వెల్లడించారు. పదవులు లేకపోయినా కూడా ప్రజల మధ్య ఉండి సేవలందిస్తున్నామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖచ్చితంగా గెలిచి ప్రజలకు మరెన్నో సేవలు అందిస్తామని వివరించారు. అంతేకాకుండా గూడెం లిఫ్ట్ వలన రైతులకు పెద్దగా ప్రయోజనం లేదని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు మూడు పంటలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. బీజేపీ పార్టీలో మహిళలకు తగిన ప్రాధాన్యం లేదని, మోడీ పాలనలో ప్రజలకు కష్టాలు తప్ప మరేమి మిగలలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బియ్యాల తిరుపతి, ఇతర నాయకులు సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ఆరీఫ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం,నాయకులు దేవేందర్ రెడ్డి,గడ్డం త్రిమూర్తి,గడ్డం శ్రీనివాస్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల్యమిత్రునికి ఆర్థికసాయం అందజేత

తాండూర్, సెప్టెంబర్ 25, (మనం న్యూస్)తాండూరు మండల కేంద్రానికి చెందిన నాయిని నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. నారాయణతోకలిసి చదివిన 2001-02 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు నారాయణ యొక్క కొడుకు,కూతురు చదువుల నిమిత్తం 70 వేల రూపాయలు నారాయణ యొక్క భార్య,పిల్లలకు ఆర్థిక సహాయం అం దజేశారు. ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు దుర్గం మహేందర్,అన్నం రమేష్, ఆవుల రాజేష్, జనార్ధన్, మెరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పొరండ్ల-పిఏసిఎస్ సర్వసభ్య సమావేశం



తిమ్మాపూర్, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొరండ్ల గ్రామంలో సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి స్వామి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 65వ (2022-202 3)గాను వార్షిక నివేదికను సొసైటీ కార్యనిర్వహణ అధికారి కళ్లెం చొక్కారెడ్డి చదివి వినిపించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో నడుపుతున్న ఐకెపి ధాన్యం కొనుగోలు సెంటర్లు, రైస్ మిల్లులో రైతులు ఎదుర్కొం టున్న ఇబ్బందులను సమావేశంలో వివరించారు. వెంటనే దీనిపైన స్పందించిన చైర్మన్ సింగిరెడ్డి స్వామి రెడ్డి మాట్లాడుతూరైతులకు ఐకెపి సెంటర్లు, రైస్ మిల్లులో ధాన్యం అమ్మకంలో ఇబ్బందులు, నష్టం వాటిల్లకుండా తగిన చర్యలతో పాటు తన సహాయ సహకారాలు అందిస్తానని, రైతులు, సభ్యుల సమస్యలపై జిల్లా పాలకవర్గ సమావేశంలో వివరిస్తానని, సొసైటీ లాభాల్లో వాటా, సభ్యులకు మాటిగేజ్ లేకుండా 2 లక్షల వరకు రుణం పొందే విధంగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం తీర్మానం చేశారు. ఈ సమావేశంలో చైర్మన్ సింగిరెడ్డి స్వామి రెడ్డి, మాజీ చైర్మన్‌లు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ముస్కు మోహన్ రెడ్డి, డైరెక్టర్లు రెడ్డి అంజిరెడ్డి, జాప మునీశ్వరి, బిజిలి ఎల్లయ్య, గోపు మల్లారెడ్డి, ఆశోద కుమార్ స్వామి, నాంపల్లి ఆంజనేయులు, సూదగోని ఆంజనేయులు గౌడ్, బూడిద మధునమ్మ, గంకిడి చిన్న సత్యనారా యణ రెడ్డి, నిర్వాహణాధికారి కళ్లెం చొక్కా రెడ్డిలతో పాటు సభ్యులు, రైతులు, తదితరు లు పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగులకు ఎయిమ్స్‌లో వైద్య సౌకర్యాలు కల్పించాలి

- సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి




మంచిర్యాల, సెప్టెంబర్ 25, ( మనం న్యూస్ ): సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు ఎయిమ్స్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య సౌకర్యాలు కల్పించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆళవందార్ వేణు మాధవ్ ఆధ్వర్యంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్‌లోని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. అలాగే కేంద్ర ఆరోగ్య శాఖామాత్యులు మన్సుఖ్ మాండ్వ్య కు ఈ మెయిల్ ద్వారా వినతి పత్రం పంపించారు. ఈ సందర్భంగావేణు మాధవ్ మాట్లాడుతూ, మేడ్చల్-మల్కాజ్ గిరి, యాదాద్రి-భువనగిరి జిల్లాలలో దాదాపు 10వేల మంది విశ్రాంత కార్మికులు పదవి విరమణ పొంది వారి కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారని తెలిపారు. సింగరేణి యాజమాన్యంకు వారు 40వేల రూపాయలు చెల్లించి కాంట్రి బ్యూటరీ పోస్ట్ మెడికేర్ కార్డ్ ద్వారా రిటైర్డ్ ఉద్యోగ దంపతులకు ఎనిమిది లక్షల రూపాయల వైద్య సౌకర్యం కొన్ని ఒప్పంద ఆసుపత్రులలో వైద్యం స్వీకరిస్తున్నారన్నారు. ఈ ఆసుపత్రులు స్థిర నివాసంకు దూరంగా ఉండటం వలన అత్యవసర స్థితిలో అధిక రవాణా ఖర్చులు భరించవలసి వస్తుందని తెలిపారు. కావున ప్రతిష్టాత్మక ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో ప్రత్యేకంగా అన్ని రకాల వైద్య సేవలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు టి.ఉమాకర్, బి.బానయ్య, జి.పార్థసారథి,ఎం. మధునయ్య, ఎస్.లక్ష్మీ నారాయణ, టి.రాజ్ కుమార్, జి.కనకయ్య, రామ రాజు, నరసింహ రావు, ప్రతాప్ సింగ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జయరాజుకు ఘన సన్మానం

- రాష్ట్రంలో కవులు రచయితలు కళాకారులకు సముచిత గౌరవం
- మంత్రి సత్యవతి రాథోడ్





మహబూబాబాద్, సెప్టెంబర్ 25. (మనం ప్రతినిధి): కాళోజీ సాహిత్య పురస్కారం అందుకున్న గొడిశాల జయరాజుకి సోమవారంనాడు మహాబుబాద్‌లోని కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర గిరిజన, స్త్రీ – శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ పుష్పగుచ్చాలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కవులు, కళాకారులు, రచయితలను సముచితమైన గౌరవ దక్కుతున్నదని శ్రీ కాళోజీ సాహిత్య పురస్కారం అందుకున్న గొడిశాల జయరాజుని సన్మానించుకోవడం జిల్లాను సన్మానించుకున్నంత గొప్పగా ఉందని అన్నారు.గాయకుడు జయరాజ్ పల్లె ప్రకృతిని, మట్టి వాసనను చూపే విధంగా అతని కవితలు,పాటలు ఉంటాయని ఒకప్పుడు తెలంగాణ భాష, యాస తెలంగాణ సాంస్కృతి అన్నా ఒక చిన్న చూపు ఉండేదనిస్వరాష్ట్రంలో తెలంగాణ భాషకు, యాసకు, సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్ రచన, పద్యం, కవితలను ప్రోత్సహిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో కళాకారులకు పింఛన్లు సైతం అందజేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణలో సాహిత్యానికి పూర్వ వైభవం వచ్చిందని తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కవుల పాత్ర చాలా గొప్పదని కవుల సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నాటి నుండే సాహిత్యం పాత్ర గొప్పదని, కాలాన్ని ముందే పసిగట్టి కవులు హెచ్చరిక చేసే వారని, ఒక పుస్తకాన్ని ఒక వ్యాఖ్యలో చెప్పే ఘనత ఒక కవికి మాత్రమే సాధ్యమవుతుందని మంత్ర అన్నారు. కవిత్వానికి ఉండే పదును, శక్తి మరి దేనికీ ఉందన్నారు.తెలంగాణ ఉద్యమంలో వచ్చిన కవిత్వం ప్రజలను కదిలించిందనితెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఈ రాష్ట్రంలోని కవులకు అంతే ప్రాధాన్యతను ఇవ్వడం నిజంగా ఈ రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. మానుకోటకు ఒక ప్రత్యేకత ఉందని దాశరధి, జయరాజు ఇలా అనేక మంది కవులు పుట్టిన ఘనత ఉన్నదన్నారు. తెలంగాణ రాకముందు గాయకుడు జయరాజ్ పాడిన వానమ్మా వానమ్మా ఒక్కసారెనా వచ్చిపోవే వానమ్మా అనే పాటను సీఎం కెసిఆర్ పాలనలో ప్రజలు మరిచిపోయారంటే దానికి కారణం సీఎం కెసిఆర్ నిర్మించిన కాళేశ్వర ప్రాజెక్టే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు శంకర్ నాయక్, జడ్పీ చైర్మన్ కుమారి అంగోత్ బిందు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, తక్కల్లపల్లి రవీందర్ రావు, ఎంపీ మాలోత్ కవిత, సాంస్కృతిక నాటక రంగ చైర్మన్ దీపికా రెడ్డి, కలెక్టర్ కే శశాంక, ఎస్పీ చంద్ర మోహన్, కవులు, కళాకారులు వున్నారు.

## హార్టికల్చర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్ల పరిశీలన

- పరిశీలించిన మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్, సెప్టెంబర్ 25. (మనం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా మల్యాల గ్రామంలోని కృషి విజ్ఞాన్ కేంద్రం (కేవీకే)కి అనుబంధంగా ఉన్న హార్టికల్చర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లను రాష్ట్ర గిరిజన స్త్రీ – శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ సోమవారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా హార్టీకల్చర్ కళాశాలలో ఈ ఏడాది నుండి తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అడ్మిషన్లు, తరగతుల నిర్వహణ, విద్యార్థులకు సౌకర్యాల ఏర్పాట్లపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో మహబూబాబాద్ జిల్లా ఎడ్యుకేషన్ హబ్ గా మారిందన్నారు. రైతు బిడ్డ ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యవసాయంలో నూతన విప్లవాన్ని సృష్టిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారని మహబూబాబాద్ జిల్లాలో ఉద్యాన డిగ్రీ కళాశాల ప్రారంభంతో ఈ ప్రాంత రైతులకు విద్యార్థులకు ఎంతోగానో ఉపయోగ పడుతుందని అన్నారు.ఈ ఏడాది అడ్మిషన్లు ప్రారంభించుకో బోతున్నామని దేశంలో ఎక్కడా లేని విధంగా స్థానిక విద్యార్థులకు 80% అవకాశాలు కల్పిస్తూ జీవో తీసుకురావడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మల్యాల రూపురేఖలు మారనున్నాయని ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలో హార్టికల్చర్‌తో పాటు ఇంజనీరింగ్ కళాశాల, మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు విద్యను అందించాలని సంకల్పంతో అనేక విద్యాలయాలను నెలకొల్పడం జరుగుతున్నదని ఈ సువర్ణ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ అంగోత్ బిందు, మహబూబాబాద్ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక, వైస్ ఛాన్సలర్ నీరజ, ప్రొఫెసర్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల డిమాండ్లను పరిష్కరించాలి



గార్ల, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): మలిదశ ఉద్యమకారుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఉద్యమకారులు జడ సత్యానారాయణ భూక్య నాగేశ్వరరావులు అన్నారు. మొదటి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఉద్యమకారులు ఘనంగా నివాళులు అర్పించారు. గార్ల మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆద్వర్యంలో సోమవారంనాడు మలిదశ ఉద్యమకారులు రిలే నిరాహార దీక్షను అమరవీరుల స్థూపం దగ్గర వివిధ రాజకీయపక్షాలు మద్దతుతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యమకారుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని ఉద్యమకారులకు నెలకు 25వేల రూపాయలు పెన్షన్, సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత ఉద్యమకారుల పిల్లలకి ఉచిత విద్య, ఇల్లు స్థలం డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొట్లాడు తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమకారులకు విద్యార్థులకు ఎటువంటి ప్రతిఫలం లేదని బంగారు తెలంగాణలో బతుకులు ఆగమవుతున్నాయని నీళ్ళు నిధులు నియామకాల కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడి తెచ్చుకున్న తెలంగాణలో కెసిఆర్ కుటుంబం బంగారు తెలంగాణ అయినదని ఇప్పటికైనా ఉద్యమకారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోని పక్షంలో రానున్న కాలంలో ఉద్యమకారులందరు ఏకమై ప్రభుత్వాన్ని దింపడం కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మలిదశ ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలకు సిపిఎం, సిపిఐ సిపిఐ ఎంఎల్ టిడిపి కాంగ్రెస్ పార్టీల నాయకులు కందునూరి శ్రీనివాస్, గుగులోతు సక్రు జంపాల వెంకన్న, కృష్ణారెడ్డి కాంగ్రెస్ ధనియాకుల రామారావు యువజన విద్యార్థి మహిళా సంఘాలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు కొమరాజు జగదీష్ ఉద్యమకారులు జడ సత్యనారాయణ, భూక్య నాగేశ్వరరావు, శీలంశెట్టి ప్రవీణ్, పిల్లలమర్రి వీరస్వామి, తోడేటి శీను గౌడ్, జానీ మియా, ఇర్రి రవి, యాకూబ్ పాషా, నిడికొండ సాంబశివరావు, యాకూబ్, భూక్య శీను, పిడిఎస్‌యు మహేష్ ఏఐఎస్ఎఫ్ లోకేష్ పాల్గొన్నారు.

## దీన ధయాళ్ జీ స్ఫూర్తితో విశ్వగురువు దిశగా భారత్



తొర్రూర్, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): బిజెపి పూర్వపు జన సంఘ్ వ్యవ స్థాపకుడు పండిట్ దీన ధయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. బిజెపి తొర్రూర్ శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన దీనధయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భం గా బిజెపి రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు పెదగాని సోమయ్య మాట్లాడుతూ.,పండిట్ దీన ధయాళ్ ఉపాధ్యాయ నేతృత్వంలో మొదలైన పార్టీ ఇద్దరితో ప్రస్థానం ఆరంభించి నేడు పన్నెండు కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలో అతి పెద్ద పార్టీ గా అవతరించింది అని తెలిపారు. ఏకాత్మతా మానవత వాద సిద్ధాంతం పార్టీకి అందించిన దీన ధయాళ్ ఉపాధ్యాయ జీవితం పార్టీ పురోభివృద్ధికి అంకితం చేసి తన ప్రాణాలను సైతం పార్టీ కోసం బలిదానం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. దీన ధయాళ్ జీ స్ఫూర్తితో విశ్వ గురువు దిశగా భారత్ ప్రయాణం కొనసాగుతోంది అని తెలిపారు. ప్రదాని నరేంద్ర మోడీ దీన ధయాళ్ జీ ఆశయ సాధనలో భాగం గా పేదల సంక్షేమం కోసం ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ ల పంపిణీ, ఆవాస్ యోజన పథకం కింద ఇండ్ల నిర్మాణం, జన ధన్ యోజన క్రింద అందరికి బ్యాంక్ ఖాతాలు, కౌశల్ వికాస యోజన క్రింద యువతకు నైపుణ్య శిక్షణ, ఉజాల యోజన క్రింద కరెంట్ కనెక్షన్‌లు, మహిళా సాధికారత, బృణ హత్యల నివారణ కు బేటీ బచావో బేటీ పడావో వంటి అనేక పథకాలను అమలు చేస్తూ పేదల జీవితాలలో వెలుగులు నింపి సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ నినాదంతో సమాజంలోని అన్ని వర్గాలకు మేలు చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారని అని తెలిపారు.ధేశం కోసం, ధర్మం కోసం, బిజెపి కోసం తన జీవితం త్యాగం చేసిన ధీన ధయాళ్ ఉపాధ్యాయ గొప్ప స్ఫూర్తి ప్రదాత అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పరుపాటి రాంమోహన్ రెడ్డి, పాలకుర్తి నియోజక వర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, రూరల్ మండలం అధ్యక్షుడు బొచ్చు సురేష్, అసెంబ్లీ విస్తారక్ విజయ్, జిల్లా నాయకులు అలిసేరి రవిబాబు, మంగళపళ్ళి యాకయ్య, పైండ్ల రాజేష్, సిహెచ్. విజయ్ కుమార్, జలగం రవి, నూకల నవీన్, పప్పుశెట్టి సంతోష్, కొండ యాకన్నగౌడ్, గుండా. సురేష్, సిహెచ్. శ్రీనివాస్, తదితరులు, పాల్గొన్నారు.

### గంట్లకుంట గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



పెద్దవంగర, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): మండలంలోని గంట్లకుంట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం రోజున మండలంలోని గంట్లకుంట గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధ్యక్షులుగా ముత్తినేని సోమన్న, ప్రధాన కార్యదర్శిగా బండి లచ్చయ్య, ఉపాధ్యక్షులుగా చింతల వెంకన్న, కన్నే సతీష్, కోశాధికారిగా మునగాల సోమనర్సయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, కార్యక్రమంలో నాయకులు తోటకూరి శ్రీనివాస్, మెట్టు నగేష్, జగ్గు నాయక్, రంగు మురళి, అనపురం శ్రీనివాస్, సీతారాం నాయక్, సైదులు, ఎరుకల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలు మానసిక శారీరక దృఢత్వం, సామాజిక స్ఫూర్తినిస్తాయి

- జెడ్పి వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్ రెడ్డి



దంతాలపల్లి, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): క్రీడలు విద్యార్థులకు మానసిక, శారీరక దృఢత్వం సామాజిక స్ఫూర్తిని ఇస్తాయని జెడ్పి వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. దంతాలపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన 67వ ఎస్. జి. ఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్)గేమ్స్ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడోత్సవాల్లో మూడు మండలాల్లోని తొర్రూర్, పెద్ద వంగర, దంతాలపల్లి అండర్ 17 కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడలను నిర్వహించి జోనల్ స్థాయి టీంలనును ఎంపిక కార్యక్రమంను ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు పి. వేణుమాధవ్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ వొలాద్రి మల్లారెడ్డి, ఎంపిటీసీ యాకన్న, మార్కెట్ కండైరెక్టర్ కిషోర్ శ్రీనివాస్ రెడ్డి, నరేష్ మాజీ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఇంఛార్జి బ్రహ్మానందరెడ్డి, స్టాఫ్ సెక్రటరీ హర్ష వర్ధన్ రెడ్డి, జోనల్ సెక్రెటరీ ప్రవీణ్ రెడ్డి , వివిధ పాఠశాల పీఈటి లు ఉపాధ్యాయులు యాకూబ్ అలీ రేణుకా దేవి, హరిబాబు కుమారస్వామి, రాములు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



పెద్దవంగర, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): మండలంలోని గంట్లకుంట్ల గ్రామం రామోజీ తండాలో జాటోత్ తారమ్మ అనారోగ్య కారణంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు పాలకుర్తి యాదగిరిరావు స్థానిక సర్పంచ్ చింతల భాస్కర్ తో కలిసి పరామర్శించి, ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆర్థిక సహాయం అందజేశారు, ఈ కార్యక్రమంలో పులిగిల్ల పూర్ణచందర్, వెంకటేష్, సమ్మయ్య, లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- ఎంపీపీ ఈదురు రాజేశ్వరి



పెద్దవంగర, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అన్నారు. సోమవారం రోజున తొర్రూర్ డివిజన్ కేంద్రం రామ ఉపేందర్ గార్డెన్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు పెద్దవంగర మండలంలో ఉన్న వివిధ గ్రామాల నుండి అధికంగా పాల్గొన్న యువతి యువకులకు దగ్గరుండి రిజిస్ట్రేషన్ ఈదురు రాజేశ్వరి చేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇంత గొప్ప జాబ్ మేళా అవకాశాన్ని యువతీ యువకులకు కలిగించిన ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉషా, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ జాబ్ మేళాతో ఎంతో మంది యువతీ యువకులు ఉద్యోగాలను పొందుతారని తద్వారా ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య, మాజీ ఏఎంసి చైర్మన్ కేతిరెడ్డి సోమనరసింహారెడ్డి, మండల నాయకులు శ్రీరామ్ సుధీర్, సలిదండి సుధాకర్, దుంపల సమ్మయ్య, పసులేటి వెంకటరామయ్య, యూత్ అధ్యక్షులు కాసాని హరీష్, ఎర్రసాని రామ్మూర్తి, మైలపాక అనిల్, బాలు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

- డిఈఓ రామారావు



తొర్రూరు, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని డీఈవో రామారావు అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో జీవన నైపుణ్యాలపై అవగాహన శిబిరం ముగిసింది. ముఖ్యఅతిథిగా డీఈవో హాజరై జీఈసీఓ విజయ కుమారితో కలిసి మాట్లాడుతూ. బాలికలకు కౌమార దశ ఎంతో ముఖ్యమని, ఈ దశలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం అవసరమని తెలిపారు. విద్యా నైపుణ్యాలు పెంపొందించుకోవడంతో పాటు స్వీయ అవగాహన, తమను తాము తెలుసుకోవడం, భావోద్వేగాల నియంత్రణ, భావవ్యక్తీకరణ వంటి అంశాలపై అవగాహన అవసరమన్నారు. విద్యార్థులు తీసుకునే నిర్ణయాల పర్యవసానాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి బొజ్జ శైలజ, ఆర్పీ లు శ్రీదేవి, దుర్గాభ వాని, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొ న్నారు.


### మత్స్యకారుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్ రావు



తొర్రూరు, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండలంలోని అమ్మాపురం గ్రామ చెరువులోజిల్లా మత్స్యశాఖ అధికారి అల్లు నాగమణితో కలిసి మంత్రి చేప విత్తనాలను వదిలారు.మత్స్య సహకార సంఘం జిల్లా చైర్మన్ కొత్తూరు రమేష్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలోమంత్రి మాట్లాడుతూ. మత్స్యకారుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీని చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ పథకం ఫలితాలు ప్రతి మత్స్యకార కుటుంబానికి చేరుతుం దన్నారు. అర్హులైన ప్రతి మత్స్యకారుడికి సొసైటీలో సభ్యత్వం ఇచ్చే లా ప్రత్యేక డ్రైవ్లు ఏర్పాటు చేస్తామని సూచించారు. చేపల వంటకా లను ప్రజలకు చేరువ చే సేందుకు జిల్లా కేంద్రాల్లో ఫిష్ ఫుడ్ ఔట్లెట్ ఏర్పాటు చేసేం దుకు కృషి చేస్తున్నామన్నారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాల న్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. దేశంలో ఎక్కడా లేనివి ధంగా ఉచితంగా చెరువుల్లో చేప పిల్లలు వదలడంతో పాటు సబ్సిడీపై వలలు, వాహనాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జెడ్పి ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, సర్పంచ్ కడెం యాకయ్య, ఎంపిటిసి డోనుక ఉప్పలయ్య, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ముద్దం వీరారెడ్డి, సీని యర్ నాయకులు తమ్మెర వీరభద్ర రావు, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్య క్షులు చల్లా సహదేవ్, కొత్తూరు బ్రహ్మయ్య, సైదులు, జిల్లా హడాక్ కమిటీ సభ్యులు పిట్టల ధనుంజయ్, చిన్నబోయిన ఆంజనేయులు, మారబోయిన వెంకటేశ్వర్లు, పిల్లి నాగరాజు, నరసింహుల పేట, చిన్న గూడూరు మండల అధ్యక్షులు మంద వెంకన్న, గగరవేయిన శ్రీ నివాస్, కుక్కల ఐలయ్య,అమ్మపురం కుల నాయకులు గుడుక బిక్షం, గుట్కా నారాయణ, కొత్తూరు సాయిలు, కొత్తూరు రాజు, గుట్కా ము త్తయ్య, వీరేష్, యాకయ్య, రవి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే శంకర్ నాయక్ సమక్షంలో భారీ చేరికలు



కేసముద్రం, సెప్టెంబరు 25. (మనం న్యూస్) : కేసముద్రం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండలంలోని అర్పణ పల్లి,అన్నారం, భుక్యరం తండా గ్రామాల నుండి సుమారుగా 200 మంది కాంగ్రెస్, బిజెపి, ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యే శంకర్ నాయక్ సమక్షంలో బిఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. గ్రామ పరిధిలోని సర్పంచ్, ఎంపీటీసీ, అధ్యక్ష కార్యదర్శుల ముఖ్య నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే శంకర్ నాయక్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు ఎంపీపీ ఓలం చంద్రమౌళి జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, జిల్లా నాయకులు రావుల రవిచందర్ రెడ్డి,వైస్ ఎంపీపీ రావుల నవీన్ రెడ్డి, సర్పంచుల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు మాదా టి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ నీలం సువాసిని దుర్గేష్, మండల పార్టీ అధ్యక్షులు నజీర్ అహ్మద్ ప్ర ధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గౌం డ్ల యాదగిరి, కూన భద్రాద్రి, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ అ ధ్యక్షులు, ముఖ్య నాయ కులు పాల్గొన్నారు.

## ఒప్పందాలను అమలు చేయడంలో సింగరేణి యాజమాన్యం విఫలం

- సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతన పెంపు ఒప్పందాన్ని అమలు చేయాలి
- వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య
- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి హెడ్ ఆఫీస్ ముంది ధర్నా



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 25. (మనంప్రతినిధి): గత ఏడాది సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాలు చేపట్టిన 18 రోజుల సమ్మె సందర్భంగా సెంట్రల్ డిప్యూటీ లెబర్ కమిషనర్ సమక్షంలో కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలను సింగరేణి యాజమాన్యం అమలుచేయడంలో విఫలం చెందిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్రకమిటీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమావారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం డిమాండ్ల వినతి పత్రాన్ని అధికారులకు అందించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ గత సమ్మె సందర్భంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు, కు టుంబ సభ్యులకు వైద్య సౌకర్యం, బోనస్ పెంపు అంశాలపై సింగరేణి యాజమాన్యం అంగికరించి ఒప్పందంపై సంతకాలు చేశారని, ఏడాది గడిచినప్పటికీ వాటిని అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ వేతన జీవో 22ను సింగరేణిలో అమలు చేసామని, బోనస్ 10 శాతం తగ్గకుండా పెంచుతామని కుటుంబ సభ్యులకు వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారని, నర్సరీ కార్మికులకు ఈపీఎఫ్, ప్రావిడెంట్ ఫండ్, బోనస్ చెలిస్తామని, కనీస వేతనాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేశారని అన్నారు. వీటితోపాటు చట్టపరమైన హక్కులు, సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. హామీలని తక్షణమే అమలు చేయాలనీ లేనిపక్షంలో మరో సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు మోటపలుకుల రమేష్, గుత్తుల సత్యనారాయణ, కిష్టాఫర్, కృష్ణయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుదారుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

- గ్రీవెన్స్‌డేలో కలెక్టర్ విపి గౌతమ్



ఖమ్మం, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): దరఖాస్తు దారుల సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి పలు సమస్యలకు సంబంధించిన దరఖాస్తును స్వీకరించి తగు చర్య నిమిత్తం సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం కాచీరాజు గూడెంకు చెందిన ఎస్.కె. నవాబ్ ఖమ్మం బూ కొరవిరోడ్ మీద పోయో నీళ్లను డ్రైనేజిగా మలచి మా ఇంటి ముందుకు వచ్చే విధంగా మలిచారని, దానివల్ల మాఇంటి ముందు నీరు నిలిచి ఉండడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని, అట్టి డ్రైనేజిని మరొవైపు మళ్లించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం జిల్లా పంచాయితీ అధికారికి ఆదేశించారు. కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామంకు చెందిన కర్నాటి త్రివేణి తన భర్త సరేష్ (లేటు) తన అత్త, మామాల వద్ద నుండి నా భర్త వాటాగా రావలసిన ఆస్థి విషయంలో తగు సమాచార ఇప్పించి న్యాయం చేయగలరని సమర్పించిన దరఖా స్తును పరిశీలించి తగు సమాచారం నిర్ణీత వ్యవధిలోగా అందించేలా ముచ్చర్ల జె.పి.ఎస్కు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కలెక్టర్ జిల్లా పంచాయితీ అదికారిని ఆదేశించారు. కొణిజర్ల మండలం చిన్నగోపతి గ్రామంకు చెందిన ఎన్. సూరయ్య సర్వేనెం.200 కాలిబాట దారి ఉందని, అట్టిదారి నుండి తమ పొలంకు వెల్లుటకు చింతనిప్పు విశ్వనాథం అడ్డుకుంటున్నారని అట్టి దారి మార్గాని సర్వే చేయించి దారి మార్గం చూపించగలరని సమర్పించిన దరఖాస్తును, కూసుమంచి మండలం గట్టుసింగారంకు చెందిన కె. సౌజన్య తన తాతగారు పసుపు కుంకుమ క్రింద తనకు గట్టు సింగారం సర్వేనెం. 211లో 16 కుంటల భూమిని ఇవ్వడం జరిగిందని, అట్టి భూమిని తనకు సమాచారం లేకుండా జుజ్జులరావుపేటకు చెందిన పడిశాల నాగమ్మ పేరుపై బదలాయించినారని అట్టి భూమికి సంబంధించి తనకు న్యాయం చేయగలరని సమర్పించిన దరఖాస్తునుతగు చర్య నిమిత్తం సర్వే ల్యాండ్ రికార్డ్ ఏడిని ఆదేశించారు. కామేపల్లి మండలం జోగ్గుడెంకు చెందిన జర్పుల కాంతి తనకు 2022 సంవత్సరం నుండి వృద్దాప్య పించను పొందుచున్నానని, కాని ప్రస్తుతం అట్టి పింఛను అకౌంటును హోల్డ్‌లో పెట్టడం జరిగినదని అట్టి సమస్యను పరిష్కరించి తనకు ఫించను అందేలా చూడగలరని సమర్పించిన దరఖాస్తును తగుచర్య నిమిత్తం డి స్ట్రీక్ లీడ్బ్యాంక్ మేనేజర్కు ఆదేశించారు. ముదిగొండ మండలం యడవల్లి గ్రామంకు చెందిన చెరుకుపల్లి రామారావు తనకు మార్తె చెరు కుపల్లి నిహారిక 13 సంవత్సరాల వయస్సు కలిగినదని, పుట్టకతో మాటలురావని, వికలాంగుల కోటాలో పింఛను ఇప్పించగలరని సమర్పించిన దరఖా స్తును ఆన్లైన్ చేయించి తగు చర్య నిమిత్తం ముదిగొండ ఎంపిడిఓకు ఆదేశించారు. తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంకు చెందిన లింగం నాగరాజు తాను వికాలాంగుడ నని, 2018 సంవత్సరంలో సదరం సర్టిఫికేట్ పొందియున్నానని, తనకు వికలాంగుల ఫించను మంజూరు చేయగలరని సమర్పించిన దరఖాస్తును తగుచర్య నిమిత్తం ఎం.పి.డి.ఓ తల్లాడును ఆదేశించారు. మధిర మండలం కృష్ణాపురం గ్రామంకు చెందిన ఎన్. భారత తనకు ఖాలీస్థలం కలదని అట్టి స్థలంలో ఇంటిని నిర్మించుకునేందుకు గృహలక్ష్మి పథకం క్రింద దరఖాస్తు చేసుకోవడం జరిగినదని తనకు గృహలక్ష్మి పథకం మంజూరు చేయగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ఎంపి. డి.ఓ మధిరను ఆదేశించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యా చందన, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ, జిల్లా అధికారులు తదితరులు గ్రీవెన్స్ డేలో పాల్గొన్నారు.

# కొత్తగూడెం ప్రజల కళ్ళలో వెలుగు నింపడమే నా ధ్యేయం

- కొత్తగూడెం ఎంఎల్ఏ వనమా వెంకటేశ్వరరావు
- 800 మంది పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ
- కెసిఆర్ నగర్‌గా నామకరణం
- కొత్తగూడెం ప్రజల కోసం జీవితాంతం సేవ చేస్తూనే ఉంటా
- చావైనా బ్రతుకైనా కొత్తగూడెం ప్రజలతోనే తన ప్రయాణం

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 25. (మనం ప్రతినిధి): కొత్తగూడెం ప్రజల కళ్ళలో వెలుగు నింపడమే తన ధ్యేయమని స్థానిక ఎంఎల్ఏ వనమా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడెం పరిధిలోని 8 వందల మంది పేదలకు ఇండ్ల స్థలాలను పంపిణీ చేశారు. స్థానిక కొత్తగూడెం క్లబ్ లో అట్టహాసంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వనమా మాట్లాడుతూ, 800 కుటుంబాల కళ్ళలో ఆనందం చూస్తుంటే, తన జన్మ ధన్యమైందనిపుస్తున్నదని, 800 మంది ఒకొక్కరికి 75 చదరపు గజాల స్థలం పంపిణీ చేస్తున్నామని, 800 మంది ఇండ్ల స్థలాల పంపిణీకి సుమారు 22 ఎకరాల భూమిని కేటాయించామని, దీని విలువ సుమారు 100 కోట్లు ఉంటుందని వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. కొత్తగూడెంలోని ఇండ్లులేని మన ప్రతి పేదవాడికి ఇండ్లు దశల వారిగా కేటాయిస్తామని, ఈ రోజుని 800 వందల ఇండ్ల స్థలాల వారికి గృహలక్ష్మి క్రింద ఇండ్లు కట్టిస్తామని, ఇప్పటికే కొత్తగూడెం పట్టణంలోని ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నానని, ఇప్పటికే కొత్తగూడెం పట్టణంలోని ప్రజలకు గృహ హక్కు కలిపించామని, సుమారు 10 వేల మందికి క్రమబద్ధీకరణ పట్టాలు పంపిణీ చేసామని, గతంలో యం ఎల్ ఏగా మంత్రిగా పాల్వంచలో 20 కాలనీలను నిర్మించామని, 1 లక్ష మందికి పక్కా ఇండ్లను నిర్మించి ఇంటి సౌకర్యం కల్పించామని వనమా తెలి





పారు.

### బిఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్తగూడెం ప్రగతి...

బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో కొత్తగూడెం అన్ని విధాల అభివృద్ధి చెందుతోందని, దేశంలోనే ఆధర్శ పథకాలు కే.సి.ఆర్ పథకాలని, ప్రతి గడప గడకు కే.సి.ఆర్ సంక్షేమ పథకాలు అందుతున్నాయని,ఎవరెన్ని కుట్రలు, చేసిన ఎని కుత్రంతాలు పన్నినా రాబోయే ఎన్నికల్లో బి.ఆర్.ఎస్ పార్టీదే విజయమని, సి.యం.కే.సి.ఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. ఏది ఎమైనా హైదరాబాద్ సికిందరాబ్ తరహాలో కొత్తగూడెం పాల్వంచ జంట నగరాలుగా తీర్చిదిద్దుతామని ఎంఎల్ఏ వనమా తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గం 25 కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ను ఏర్పాటు చేసామని, నియోజకవర్గంలో రూ 3 వేల కోట్లతో అభివృద్ధి పనులు సాగుతున్నాయని వనమా వివరించారు. రాష్ట్రం 46 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నాము. సుమారు 15 వందల మందికి గతంలో నియోజకవర్గంలో డబుల్ బెడ్రూములు పంపిణీచేసామని, పేదల జీవితాలలో వెలుగు నింపుతామని, వారి దీవెనలతో ముందుకు సాగుతామని ఎంఎల్ఏ వనమా తెలిపారు.

### ప్రతిపక్షా పార్టీల మాటలు గారడి మాటలు ...

ప్రతిపక్షా పార్టీల మాటలన్నీ గారడి మాటలని,తెలంగాణను అన్ని విధాల తీర్చిదిద్దుతున కెసిఆర్, కెటిఆర్కు ప్రజలందరూ మద్దత్తు ఇవ్వాలని వనమా అభ్యర్ధించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు పథకాలు ఉట్టి బూటకమని వనమా కొట్టి పారేశారు. హామీలివ్వంగానే సరిపోదని, వాటిని ఎలా నెరవేరుస్తారో ప్రజలకు వివరించాలని వనమా కోరారు.

### 800 వందల ఇండ్ల కాలనీకి కేసిఆర్‌నగర్‌గా నామకరణం ...

సోమవారం 22 ఎకరాలలో 800 మంది పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేసిన కాలనీకీ, కేసిఆర్ నగర్‌గా వనమా అందరి సమక్షంలో నామకరంణం చేసారు. తెలంగాణా బాపూజీ అయిన కెసిఆర్కు ఋణపడి ఉందామని ఎంఎల్ఏ వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.ఈ క్యార్యక్రమమంలో వనమా రాఘవేంద్రరావు , మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మీ, మున్సిపల్ వైస్ చైర్మేన్ దామోదర్ యాదవ్, మార్కెట్ కమిటి చేర్మేన్ భూక్య రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మేన్ బత్తుల వీరయ్య, ఉర్దు ఘర్ చైర్మేన్ అన్వర్ పాష. బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కాసుల వెంకట్, యం.ఎ. రజాక్, 36 వార్డ కౌన్సిలర్లు, కొఆప్షన్ సభ్యులు, బి.ఆర్.ఎస్. నాయకులు భీమా శ్రీధర్, రావి రాంబాబు, యూసుఫ్, సుందరాజు, కంభంపాటి దుర్గాప్రసాద్, విజయ్, భవాని, గౌస్, మజీద్, ఖాజా, షరీఫ్, సురీ బాబు, రాజేందర్, కొయ్యాడ శ్రీను, కూరపాటి సుధాకర్, పురుషొత్తమ్, రెహమాన్, పూర్ణ, చల్లా భాస్కర్, చల్ల శకుంతల, పోస్టాఫీస్ వాసు, జాని, యాకుబ్, బొమ్మిడి శ్రీకాంత్, హైమద్, మధుసుధన్ రావు, జాన్సన్ సుధాకర్ మరియు అధికారులు, మున్సిపల్ కమిషనర్ రఘు, యం.ఆర్.ఓ. పుల్లయ్య, ఆర్.ఐ.లు వి.ఆర్.ఒ.లు పి.పి.ఓ. ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది మరియు బి.ఆర్.ఎస్. నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొనారు .

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించండి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 25. (మనం ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందచేసిన పిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా ఆయన సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ఆర్జీ దారులను వివరాలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేప ట్టాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన ముఖ్యమైన దరఖాస్తులు. పాల్వంచ మండలం, గట్టాయిగూడెం గ్రామానికి చెందిన ఇల్లంగి సీత తనకు ఎటువంటి ఆస్తులు లేవని, నిరుపేద అయిన తనకు దళితబంధు పథకం మంజూరు చేపించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన ఆయన తగు చర్యలు నిమిత్తం ఎస్సి కార్పొరేషన్ ఈడికి ఎండార్స్ చేశారు. మణుగూరు పట్టణం సుందరయ్య నగర్ గ్రామానికి చెందిన మడికొండ సాధన తన అమ్మమ్మ, తాతయ్యలైన పప్పుల పూలమ్మ, విజయరావులు వ్రాసిచ్చిన వీలునామాను రద్దు పరుస్తూ ఫోర్జరీ సంతకాలు, ఫోటోలతో బూర్గంపాడు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో దొంగ వీలునామా సృష్టించి, మోసం చేసి ఆస్థిని కాచేయాలని చూస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన ఆయన తగు చర్యలు నిమిత్తం తహసిల్దార్కు ఎండార్స్ చేశారు. భద్రాచలం పట్టణానికి చెందిన సుందరబాబు కలెక్టరేట్ నందు సెక్యూరిటీ గార్డు కానీ, రాత్రి కాపలాదారు ఉద్యోగ అవకాశం కల్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన ఆయన తగు చర్యలు నిమిత్తం ఆసుపత్రుల సమన్వయ అధికారికి ఎండార్స్ చేశారు. దుమ్ముగూడెం మండలం, దబ్బనూతన గ్రామానికి చెందిన కల్లూరి లక్ష్మి , భర్త చంద్రయ్య దబ్బనూతల రెవిన్యూ గ్రామంలోని సర్వే నెం .17 / 2లో 5 ఎకరాల భూమి ఉందని, ఆ భూమి 20 సంవత్సరాల నుండి తన పేరున ఉందని, ప్రస్తుతం తానే సాగులో ఉన్నానని, పాత పట్టాదారు పాసుపుస్తకం, అడంగల్ తన పేరునే ఉన్నాయని, అక్రమంగా తన భూమిని వేరే వ్యక్తి ధరణిలో నమోదులు చేపించుకున్నారని, విచారణ నిర్వహించి తన భూమి తనకు ఇప్పించాలని చేసిన దరకాస్తును పరిశీలించిన ఆయన తగు చర్యలు నిమిత్తం తహసిల్దార్కు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మండలం, సన్యాసి బస్తీకి చెందిన డి భాగ్యలక్ష్మి 18 సంవత్సరాలుగా సొంతిల్లు లేక కిరాయికి ఉంటున్నానని, సొంతింటి కోసం పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నానని, భర్త ఆరోగ్యం సరిగా లేదని, తన ఇద్దరు ఆడపిల్లలున్నారని, కిరాయి కట్టలేక ఇబ్బందులు పడుతున్నానని, తనకున్యాయం చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన ఆయన తగు చర్యలు నిమిత్తం తహసిల్దార్కు ఎండార్స్ చేశారు. చంద్రుగొండ మండలానికి చెందిన వనమా సత్యనారాయణ బాలికా సంరక్షణ పథకం క్రింద తన ఇద్దరు కూతుళ్లకు బాండులు ఇచ్చియున్నారని, తన పెద్ద కూతురు వయస్సు ప్రకారం బాండు కాలపరిమితి పూర్తి అయినందున పైకము చెల్లింపు కొరకు దరఖాస్తు చేసుకున్నామని, 7 నెలలు గడిచినప్పటికి పైకం మంజూరు కాలేదని, కావున బాండు పైకము ఇప్పించాలని చేసిన దరఖాస్తును తగు చర్యలు నిమిత్తం మహిళా సంక్షేమ అధికారికి ఎండార్స్ చేశారు. డి ఆర్డీఓ రవీంద్రనాథ్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

- క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్, సీపి




ఖమ్మం, సెప్టెంబర్ 25. (మనం బ్యూరో) : వినాయక నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టర్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్‌తో కలిసి, కాల్వఒడ్డు, నాయుడుపేట, ప్రకాశ్ నగర్‌లలోని నిమజ్జన పాయింట్ల వద్ద ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి, అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిమజ్జన పాయింట్ల వద్ద పూర్తి రక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. లైటింగ్, క్రేన్లు, రిలీజింగ్ క్లాంప్‌లు, బోట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. పబ్లిక్ అడ్రస్‌సిస్టం, అంతరాయం లేని విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. ప్రతి పాయింట్ వద్ద పోలీస్, మునిసిపల్, ఈతగాళ్లతో పాటు వాలంటర్ల ఏర్పాట్లు చేయా లన్నారు. శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. నిమజ్జనం సజావుగా జరగడం తోపాటు, నిమజ్జనం తర్వాత విగ్రహాలతో సమస్యలు తలెత్తకుండా తగుచర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారులు పటిష్ట పర్యవేక్షణ చేయాలన్నారు. శోభాయాత్ర, నిమజ్జనంలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.స త్యప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్‌సురభి, జెడ్పి సిఇఓ అప్పారావు, అదనపు డిసిపి కెఆర్ కె. ప్రసాద్ రావు, విద్యుత్ శాఖ ఎస్ఇ సురేందర్, ఇఇ పబ్లిక్ హెల్త్ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణ లాల్, ఇఇ పీఆర్‌కె వికె. శ్రీనివాస్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఆంజనేయ స్వామి, జిల్లా అగ్నిమాపక అధికారి సూర్యప్రకాష్, జిల్లా పంచాయతీ అధికారి హరి కృషన్, మునిసిపల్ డిఇ నవ్యజ్యోతి, తహశీల్దార్లు సిహెచ్. స్వామి, రామకృష్ణ, స్థంభాద్రి ఉత్సవ సమితి ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## సెక్యూరిటీ గార్డుల పునఃశ్చరణ శిక్షణా తరగతులు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 25. (మనం ప్రతినిధి) : యస్ అండ్ పిసి ట్రైనింగ్ సెంటర్ కార్పోరేట్‌లో 74వ బ్యాచ్ సెక్యూరిటీ గార్డుల పునఃశ్చరణ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవానికి సీనియర్ సెక్యూరిటీ అధికారి మరియు ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెక్యూరిటీ సిబ్బందిలో దేహ దారుడ్యం, మానసిక దారుడ్యం, వృత్తి నైపుణ్యం పెంపోదించేందుకు శిక్షణా తరగతులను నిర్వహించడము జరుగుతుందని, ఈ శిక్షణా కేంద్రం ద్వారా నూతనంగా యస్ అండ్ పిసి విభాగంలోకి వచ్చు సిబ్బందికి బేసిక్ మరియు ఇండక్షన్ ట్రైనింగ్, యస్ పిసి విభాగములో విధులు నిర్వహించు సిబ్బందికి రిఫ్రెషర్ ట్రైనింగ్, ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్, అన్ ఆర్మ్డ్ కంబాట్, ట్రాఫిక్ కంట్రోల్, ఇంటెలిజెన్స్, పి.టి., మరియు డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్ ట్రైనింగ్‌లను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ శిక్షణ రెండు వారాల పాటు మూడు విభాగాల్లో ఇవ్వడం జరుగుతుందని, పిటి. విభాగంలో ఆర్.టి.సి., వి.టి.సి. స్విమ్మింగ్, మరియు యోగాలో శిక్షణనివ్వడం జరుగుందని, డ్రిల్ విభాగములో ఫుట్ డ్రిల్, లారీ డ్రిల్, సెరిమోనియల్ డ్రిల్, సెక్యూరిటీ ఆపరేషన్స్‌లో భాగంగా సెక్యూరిటీ చట్టాలు, ఫిజికల్ సెక్యూరిటీ, ఐ.పి.సి. సిఆర్.పిసి., ఐ.ఇ.ఏలో సెక్యూరిటీకి ఉపయోగ పడు చట్టాలు, ప్రైవేట్ డిఫెన్స్ హక్కు, సెక్యూరిటీ ఆఫ్ మెటీరియల్, ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్, అధునాతన సెక్యూరిటీ విజ్ఞానము గురించి ఇంటర్నల్ మరియు ఎక్స్ టర్నల్ ఫ్యాకల్టీ ద్వారా బోధించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను విధులలో పాటిస్తూ, మెరుగైన వృత్తి నైపుణ్యంతో విధులు నిర్వహిస్తూ, డిపార్టుమెంటుకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈకార్యక్రమంలో యన్.వి. రమణ, కార్పోరేట్ జూనియర్ ఇన్స్ పెక్టర్, ఇన్స్ ట్రాక్టర్లు, అన్ని ఏరియాల నుండి వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే

- ఆరు గ్యారంటీ కార్డులను అమలు చేస్తాం
- సిఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- నిబద్ధతతో, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా
- మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- గ్రూప్-1 పరీక్ష రద్దు ప్రభుత్వానికి చెంపపెట్టు
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం, సెప్టెంబర్ 25. (మనం బ్యూరో) : అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీ కార్డులను అమలు చేస్తామని సిఎల్పి నేత మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అన్ని డిక్లరేషన్లను అమలు చేస్తామన్నారు. తుక్కుగూడ సభలో సోనియాగాంధీ హామీ ఇచ్చినట్లుగా అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ కార్డులను అమలు చేస్తామన్నారు. బిఆర్ఎస్ నేతలు ఆగమాగమై కాంగ్రెస్‌పై బురద జల్లుతున్నారని విమర్శించారు. ప్రజల ఆలోచనలకు అ నుగుణంగా పని చేస్తున్న కాంగ్రెస్ ఒక వైపు ఉంటే, దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్న బిఆర్ఎస్ మరో వైపు ఉందన్నారు. ప్రజలు ఇప్పటికే ఆలోచన చేశారని, రాబోయే కాలంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది స్థానాలు గెలుచుకుంటామన్నారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కింది స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీలోకి తనను ఆహ్వానించారని, ఇది చాలా గర్వంగా ఉందని అన్నారు. 4 ఏళ్లుగా అభివృద్ధే లక్ష్యంగా పని చేశానని, అదే స్ఫూర్తితో అందరితో కలిసి పని చేస్తానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షను హైకోర్టు రద్దు చేస్తూ తీర్పునివ్వడం బిఆర్ఎస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదన్నారు. టెన్త్ పరీక్ష పేపర్ లీకేజీ కావడం వల్ల 25 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే కనీసం వారి కుటుంబాలను ఈ ప్రభుత్వం పరామర్శించలేదన్నారు. నిరుద్యోగ యువతకు లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తే కనీసం పది వేలు కూడా ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ యువత ధైర్యంగా ఉండాలని, రానున్న ఇందిరమ్మ రాజ్యంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు జావిద్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ దీపక్ చౌదరి, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు రాందాస్ నాయక్, చోటే బాబా, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లపల్లి ఏ కాంబరి రామలింగేశ్వర స్వామి

- ఆలయంలో ప్రత్యేక పూజలు
- డాక్టర్ సంపత్ కుమార్,శ్రీనివాస్ రెడ్డి

బషీరాబాద్, సెప్టెంబర్ 25. మనం న్యూస్: బషీరాబాద్ మండలంలో సోమవారం రోజు కాంగ్రెస్ నేతలు డాక్టర్ సంపత్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, నీళ్లపల్లి ఏ కాంబరి రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బషీరాబాద్ మండల్ మాజీ అధ్యక్షుడు శంకరప్ప, యలల్ మండల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు భీమప్ప, టీపీసీసీ కోఆర్డినేటర్ నరేష్, మండల్ కోఆర్డినే



టర్ శ్రీకాంత్, శ్రీనివాస్, నర్సింలు, షాను, శ్రీనివాస్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను ముమ్మరం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్





నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): ఎన్నికల సన్నద్ధతలో భాగంగా చేపడుతున్న ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఎన్నికల నిర్వహణ అంశాలపై సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, మార్పులు-చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, తుది ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపుతో పాటు నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ సామాగ్రి పంపిణీ, కౌంటింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, భద్రతాపరమైన ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షిస్తూ, జిల్లా ఎన్నికల అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఓటరు నమోదు, మార్పులు-చేర్పులకు సంబంధించి ఆన్లైన్, ఆఫ్ లైన్‌లో వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి, ఈనెల 27 వ తేదీలోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని గడువు విధించారు. క్షేత్రస్థాయి పరిశీలన జరిపిన సిబ్బంది నుండి తక్షణమే వివరాలు తెప్పించుకుని, ఏ ఒక్క దరఖాస్తు సైతం పెండింగ్లో ఉండకుండా అన్నింటిని గడువు తేదీలోపు అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ విషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ, ఎస్.ఎస్.ఆర్‌లో భాగంగా గత 2023 జూలై 16 వ తేదీ నుండి మొదలుకుని తుది గడువు వరకు జిల్లాలో మొత్తం 86444 దరఖాస్తులు రాగా, వాటిని వెంటదివెంట పరిష్కరించామని, పెండింగ్లో ఉన్న 13 వేల దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఈఓ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్ పరిధిలో పెండింగ్ దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో ఉన్నందున అదనపు సిబ్బందిని నియమించి అప్లోడ్ చేయిస్తున్నామని అన్నారు. కాగా, పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి నీటి వసతి, టాయిలెట్స్, విద్యుత్, ర్యాంపులు వంటి వసతులను పరిశీలించాలని సీఈఓ సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తప్పనిసరిగా మహిళా ఓటర్ల కోసం ఐదు పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, అలాగే యువ ఓటర్లు, దివ్యంగుల కోసం ఒక పోలింగ్ కేంద్రం ఉండేలా చూడాలన్నారు. ఒకే ఇంట్లో ఆరుగురు అంతకంటే ఎక్కువసంఖ్యలో ఓటర్లు ఉన్నట్లయితే క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన జరిపి ఇంటి నెంబరు, ఇతర వివరాలను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. అదేవిధంగా ఓటరు జాబితా నుండి తొలగించిన పేర్లను మరోమారు క్షుణ్ణంగా పరిశీలించాలని, తుది ఓటరు జాబితాలో ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పిదాలకు ఆస్కారం ఉండకూడదని హితవు పలికారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుండి గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ.ఆర్.ఓల స్థాయిలో ప్రతి వారం క్రమం తప్పకుండా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల గురించి తెలియజేయాలని, వారి నుండి వచ్చే అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని సీఈఓ సూచించారు. గత 2018 ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సెక్టోరల్ అధికారులచే సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను సేకరించాలని, అలాంటి పోలింగ్ స్టేషన్లలో వెబ్ క్యాస్టింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి, ఈ.ఆర్.ఓల స్థాయిలో నియమించుకోవాలని అనుమతించారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి. యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, నోడల్ అధికారి సింహాచలం, ఈ.ఆర్.ఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

- రూరల్ ఏసిపి కరుణాకర్ రావు




తిమ్మాపూర్, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): గణేష్ నవరాత్రుల అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలోజరుపుకోవాలని రూరల్ ఏసిపి కరుణాకర్‌రావు సూచించారు. ఎల్ఎండి పోలీస్ స్టేషన్ లో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గణేష్ మండప నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటోన్న భక్తులు నిమజ్జనం రోజున కూడా తగు నిబంధనలు, సూచనలు పాటిస్తూ ప్రశాంత వాతా వరణంలో సంయమనంతో వ్యవహరించాలన్నారు. ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలని కోరారు. గణేష్ మండపాల నిర్వా హకులు ఊరేగింపు, నిమజ్జనంలో గొడవలు, అల్లలు జరగకుండా పూర్తి బాధ్యత వహించాలని, పోలీస్ సిబ్బందికి సహకరించాలని, మండపాల వద్ద కానీ నిమజ్జనంలో కానీ ఏదైనా గొడవలు జరిగినట్లయితే నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై ప్రమోద్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, గణేష్ మండ పాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## రూ.51వేల విరాళం అందిచిన ఎమ్మెల్యే షకీల్



బోధన్, సెప్టెంబర్ 25. (మనం న్యూస్) : బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమెర్ బోధన్ సార్వజనిక్ గణేశునికి 51వేల రూపాయల విరాళన్ని,అన్నదానం కొరకు మరో 30 వేల రూపాయలను అందించారు. ఈ విరాళాన్ని ఎమ్మెల్యే సతీమణి,అయేషా ట్రస్ట్ చైర్మన్ అయేషా ఫాతిమా సోమవారం బోధన్ సార్వజనిక్ ఉత్సవ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, శివాలయం చైర్మన్ బీర్కూర్ బుజ్జి, మారుతి మందిర్ చైర్మన్ అశోక్ రెడ్డి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రుద్ర సత్యనారాయణ, విడిసి కోశాధికారి కొంద్ర వెంకట్, గుమ్ముల శంకర్, పూజారి లింగం, జేఏసీ శంకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టల్ విద్యార్థి అదృశ్యం



బోధన్, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): ప్రభుత్వ వసతి గృహం నుండి పాఠశాలకు వెళ్ళిన విద్యార్థి కనిపించకుండా పోయాడు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందగా వారు తెలిపిన వివరాల ప్రకారం. మద్నూర్ మండలం కోడిచెర గ్రామానికి చెందిన గాయిచోడి గంగాధర్ కుమారుడు బాలాజీ(14) 7వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 23 న బోధన్ ప్రభుత్వ ఎస్సి బాలుర వసతి గృహం నుండి ఉదయం సహ విద్యార్థులతో కలిసి బోధన్ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని పాఠశాలకు వెళ్ళాడు. ప్రార్థన అనంతరం క్లాసు టీచర్ ఫోన్‌తో తన తల్లికి ఫోన్ చేయగా బాలుని తల్లి ఫోన్ తియలేదు. సాయంత్రం స్కూల్ ముగిసిన తరువాత బాలాజీ తప్ప మిగిలిన విద్యార్థులందరూ వసతి గృహానికి తిరిగి వచ్చారు. బాలాజీ కోసం స్కూల్‌లో వెతుకగా అతని స్కూల్ బ్యాగ్ లభించిందని, చుట్టుపక్కల వెతికినా ఎలాంటి ఆచూకి లభించలేదని ఎస్సి బాలుర వసతిగృహ వార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వార్డెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పట్టణ సిఐ ప్రేమ్ కుమార్ తెలిపారు.

## మోడీ పర్యటనకు ముందే ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌కు ఓబిసిలు గుర్తుకురాలేదా..?
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనకు వచ్చే ముందు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడం, నిజామాబాదులో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంపై ప్రధాన మంత్రి నిర్ణయాన్ని వెల్లడించాలన్నారు. మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ కు 42 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రకటించిన ప్రధాని తెలంగాణను ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల సాధన తర్వాత తొలిసారి నిజామాబాదుకు వచ్చిన కల్వకుంట్ల కవితకు బిఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఐటిఐ గ్రౌండ్ నుంచి కలెక్టర్ గ్రౌండ్ వరకు జరిగిన భారీ ర్యాలీలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహిళా బిల్లు ఆమోదం పొంది ప్రపంచంలో ఇతర దేశాల సరసన భారతదేశం నిలబడిందంటే అందుకు బిఆర్ఎస్ పార్టీయే కారణమని స్పష్టం చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ పార్లమెంటులో మహిళా బిల్లును ప్రవేశపెట్టడం మర్చిపోయిందని, వాళ్లను బిఆర్ఎస్ పార్టీ నిద్రలేపిందని వ్యాఖ్యానించారు. ఈ బిల్లు పై కాంగ్రెస్ పార్టీ కూడా తప్పనిసరిగా మాట్లాడే పరిస్థితిని బీఆర్ఎస్ తీసుకొచ్చిందన్నారు. ఓబీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మాట్లాడుతోందని, 20 ఏళ్ల కింద కాంగ్రెస్‌కు ఆ తెలివి ఉంటే అప్పుడే బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు న్యాయం జరిగేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌కు ఆ ఆలోచన లేదని, అధికారం కోల్పోయిన తర్వాత బిసిలు గుర్తుకొచ్చారని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగితే అన్ని వర్గాలు బాగుపడతాయన్నది కెసిఆర్ స్వప్నమని కవిత తెలిపారు.తెలంగాణలో బిఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వచ్చి, కెసిఆర్ సిఎంగా మూడో సారి ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో గత పది ఏళ్లుగా తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పరిపాలిస్తుందని, తమ పార్టీ పాలనలో ఒక్క మతకల్లోలం కూడా జరగలేదని, ఒక చిన్న గొడవ కూడా జరగలేదన్నారు. దేశంలో ఎటువంటి పరిస్థితులు ఉన్నా కూడా తెలంగాణలో శాంతిభద్రతలు సజావుగా ఉన్నాయి కాబట్టే రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయని, తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతున్నాయని కవిత వివరించారు. అభివృద్ధి ఒకటే కాదు ప్రజలకు ఆత్మగౌరవం ఉండాలన్న ఆలోచన తమ పార్టీదని, అందుకే సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, దేశంలో ఎక్కడా లేనివిధంగా మార్కెట్ కమిటీల పదవుల్లో మహిళలకు సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రతి ఒక్క వర్గం గురించి ఆలోచన చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఇవన్నీ చేస్తుంటే ఏమి చేయని కాంగ్రెస్ పార్టీ వచ్చి తామే అధికారంలోకి వస్తామని అంటుంటే నవ్వాలో ఏడవాలో అర్థం అవడం లేదని కవిత ఎద్దేవా చేశారు. అందరి గురించి ఆలోచించే నాయకుడు కేసీఆర్ ను కడుపులో పెట్టుకోవాలని కోరారు. నిజామాబాద్‌లో ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా అద్భుతంగా పనిచేస్తున్నారని, ఆయనను మరొకసారి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించడంలో ఎక్కడ నిర్లక్ష్యం చేయడం లేదని ఆయన అన్నారు. నగర ప్రజలు రెండుసార్లు తనను భారీ మెజారిటీతో గెలిపించి నగర అభివృద్ధికి కృషి చేసే భాగ్యం కలిగించారన్నారు. నగర ప్రజలు తనను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగరంలోని 60 డివిజన్ల కార్పొరేటర్లు నూడ డైరెక్టర్లు, వివిధ సంఘాలకు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సస్యశ్యామలం




పెన్‌పహాడ్, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ 60 సంవత్సరాలు అధికారంలో ఉన్న అభివృద్ధికి నోచుకోలేదని ఎంపీపీ నెమ్మది బిక్షం అన్నారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రన్ని అన్ని రంగాల్లో ఆదర్శనంగా నిలుపుతున్న ఏకైక వ్యక్తి సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి సీఎంను చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పెన్‌పహాడ్ మండలనికి సాగు నీటిని తెచ్చి బీడు పడి ఉన్న నెలలకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పెన్‌పహాడ్ మండలానికి సాగు నీటిని తెచ్చి బీడు పడి ఉన్న నెలలకు కాళేశ్వరం జలాలు ఇచ్చి సస్యశ్యామలం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలానికి అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో బాణాల శ్రీనివాస్, సింగిల్ విండో ఛైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, నాతల జానకిరాంరెడ్డి, ఎంపీవో నరేష్, ఎంఈవో రవి, ఏఓ కృష్ణ సందీప్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికి గృహలక్ష్మి, దళితబంధు కేటాయించాలని అఖిలపక్షం దర్నా



జాజిరెడ్డిగూడెం, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామంలో అర్హులైన పేదలందరికి గృహలక్ష్మి, దళితబంధు కేటాయించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్, బీఎస్పీ జిల్లా నాయకుడు బుడిగ మల్లేష్, సీపీఎం జిల్లా నాయకులు వజ్జె శ్రీను, న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు బొడ్డు శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మెరపాక సత్యం, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు శీగ నసీర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వేములకొండ ఉప్పలయ్యగౌడ్, అఖిలపక్షం నాయకులు రత్నం, లక్ష్మాజి, ఎల్లెంల అవిలయ్య, జీడి నాగరాజు, బొడ్డు వెంకట్, చెర్కపల్లి లక్ష్మణ్, బాలరాజు, వెంకన్న, శంకర్, ఉజిత్, మహేష్, బాలయ్య, మహేష్, శేఖర్, కటమయ్య, అంజయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతండాలో ఒకరి హత్య



జాజిరెడ్డిగూడెం, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): జాజిరెడ్డిగూడెం మండలం నాన్యతండాలో ఒక గిరిజనుడు హత్యకు గురైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెల్పిన వివరాల ప్రకారం. నూతనకల్ మండలం హేమ్లాతండాకు చెందిన చాంప్ల(38) నాణ్యతాండ వద్ద బొగ్గు బట్టీలు పెడుతున్నారు. రాత్రి బొగ్గు బట్టి వద్ద భార్య అరుణ, కుమారుడు ధనుష్‌తో కలిసి నాణ్యతండా ఆవాసం పూజా తండా వద్ద బొగ్గుబట్టిల కాపలా కోసం వచ్చి అక్కడ పడుకొని ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు చాంప్లను హత్య చేశారు. ఉదయం హత్య విషయం వెలుగులోకి వచ్చింది. చాంప్లను భార్య అరుణ, అరుణ ప్రియుడు మరి కొంత మంది కలిసి హత్య చేశారని చాంప్లా తల్లి జక్కి అర్వపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జక్కి ఫిర్యాదు మేరకు నాగారం సీఐ శివశంకర్, ఎస్ఐ అంజిరెడ్డిలు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సూర్యాపేట నుండి డాగ్స్ స్కాడ్ కూడా ఆధారాల కోసం తీసుకొచ్చి గాలించారు. హత్యకు వివహేతర సంబందమే కారణమని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన దేవక్కపేట్ యువకులు




భీంగల్, సెప్టెంబర్ 25. (మనం న్యూస్): భీంగల్ మండలం దేవక్కపేట్ గ్రామానికి చెందిన యువకులు సోమవారం రోజున ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముత్యాల సునీల్ కుమార్ నాయకత్వాన్ని బలపరచి, కాంగ్రెస్ పార్టి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ముత్యాల సునీల్ కుమార్ ని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని చేరినవారు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమం



తిరుమలగిరి, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): తిరుమలగిరి మున్సి పాలిటిలోని అంబేద్కర్‌నగర్ శ్రీగణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, నాయకులు సంకెపల్లి నరోత్తమ్‌రెడ్డి, మహేశ్వరం సందీప్‌నేత, కందుకూరి బా బు, త్రిశూల్, బోండ్ల జగన్, బోడ పవన్ కిషోర్‌రెడ్డి, రమేష్, గణేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడికి కుంకుమ పూజ



తిరుమలగిరి, సెప్టెంబర్ 25, (మనం న్యూస్): మున్సిపాలిటి కేంద్రంలో ఆర్యవైశ్యసంఘం నిర్వహించే గణపతి నవరాత్రుల పూజ సందర్భంగా మహిళలందరూ కలిసి వినాయకునికి సోమవారం కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళలందరూ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి

సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 25. మనం న్యూస్: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణానికి హానికలిగించకుండా చూడాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని 7వ వార్డులో ఎంఎం ఉన్నత పాఠశాలలో కమీషనర్ రామాంజుల రెడ్డితో కలిసి విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకం, పరిసరాల శుభ్రత, మున్సిపాలిటీ సిబ్బంది ప్రతి ఇంటి నుండి చెత్త సేకరించే విధానం వంటి విషయాలను చర్చించారు. అనంతరం విద్యార్థుల చేత స్వచ్ఛత పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కుంభం రేణుక, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక దేవి, ఈఇ శివప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకుల నియామకం

బెజ్జంకి, సెప్టెంబర్, 25, మనం న్యూస్: సిద్దిపేట జిల్లా మ హిళా కాంగ్రెస్ కార్యదర్శిగా బెజ్జంకి గ్రామానికి చెందిన ఈరు ముల సుగుణను, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కనగండ్ల జ్యోతిలను నియమించారు. ఈ నియామక పత్రాన్ని సోమవా రం రోజున మానకొండూరు నియోజక వర్గం ఇంచార్జ్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తమ నియామకానికి సహక రించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపు తున్నామ న్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా మహిళా లోకాన్ని ఐ క్యం చేసి కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యం గా కృషి చేస్తామన్నారు.



జడ్జెస్ కాలనీలోని గ్రీన్ ట్రీ రెసిడెన్స్ అపార్ట్మెంట్‌లో వినాయక చవితి సందర్భంగా లడ్డు వేలం పాటలో మౌనిక కార్తీక్ రూ.36000కి దక్కించుకుంది. ఆమె మాట్లాడుతూ వేలంపాటలో లడ్డును దక్కించుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు.

- ఎల్బీనగర్, సెప్టెంబర్ 25(మనం న్యూస్)

# కాంగ్రెస్ తుప్పుపట్టిన ఇనుములాంటిది




భోపాల్, సెప్టెంబర్ 25 : మధ్యప్రదేశ్‌లో ఈ ఏడాది చివరలో జర గనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సోమవారం బీజేపీ జన ఆశీర్వా ద యాత్ర పేరుతో ప్రచారాన్ని నిర్వహించగా ముగింపు సభలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రతిపక్ష కాంగ్రె స్ పార్టీని విమర్శిస్తూ వారికి మళ్లీ అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అనారోగ్య రాష్ట్రంగా చేస్తారని ఆరోపించారు. బీజేపీ చలవే.. జన ఆశీర్వాద యాత్ర సందర్భంగా 'కార్యకర్తల మహాకుంభ' పేరుతో నిర్వహించిన కార్యక్ర మంలో ప్రధాని నరేంద్ర మోడీ విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. కార్యక్ర మంలో మొదట దీన్ దయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకోవాలని చెబుతూ ఆయనకు నివాళులర్పించిన ప్రధాని.. అనంత రం కాంగ్రెస్ పార్టీని తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రధాని మాట్లాడు తూ.. ఈరోజు మధ్యప్రదేశ్ ఇంతగా అభివృద్ధి చెందిందంటే అది మొద టిసారి యుక్కా అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం వల్లనే సాధ్య మైందన్నారు. ఓటు వేసిన ప్రతి ఒక్కరు ఇంతటి అభివృద్ధిని చూడగలి గారంటే మీరంతా నిజంగా అదృష్టవంతులని అన్నారు. కాంగ్రెస్ ఈ రాష్ట్రాన్ని చాలా కాలం పరిపాలించింది కానీ ఇక్కడ ఏదీ అభివృద్ధి చేయలేకపోయిందని పైగా అవినీతిని పెంచి పోషించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని అన్నారు.

తుప్పుపట్టిన ఇనుము.. యావత్ భర్త దేశం కొత్త పార్లమెంట్ భవ న నిర్మాణాన్ని అభినందిస్తుంటే వారు మాత్రం వ్యతిరేకించారు. అలాగే వారు మొదట్లో యూపీఐ చెల్లింపులను డిజిటల్ పేమెంట్లను కూడా వ్యతిరేకించారు. కానీ అదే ఈ రోజు దేశంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్షంలో పెడితే పాడైపోయే తుప్పు పట్టిన ఇనుములాంటి పార్టీ అని అవినీతిలో కూరుకుపోయిన వంశపా రంపర్య పార్టీ అని అన్నారు. వచ్చే ఎన్నికలు చాలా కెలకమైనవని ఇక్కడి యువత బీజేపీ ప్రభుత్వ హయాంలో ఏంటో మార్పును చూశారు కాబట్టి జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలని అన్నారు.

బిల్లును అడ్డుకోలేకపోయారు.. మీ తల్లిదండ్రులు, తాతలు కాంగ్రె స్ పాలనలో చాలా సమస్యలను ఎదుర్కొన్నారని మారు మాత్రం ఆ తప్పు చేయవద్దని అన్నారు. ఈరోజు రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ పార్ట్ ఉంది కాబట్టి మీకు ఎటువంటి ఇబ్బందులు రానివ్వమని అన్నారు. మీ కు మాటిచ్చినట్టుగానే పార్లమెంట్ సాక్షిగా మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం జరిగింది. దానికి ఆ కుయుక్తులు కూటమి కూడా ఆమోదించింది. వారి మనసు అంగీకరించకపోయినా ఈ చారిత్రాత్మక బిల్లును వారు ఆమోదించకుండా ఉండలేక పోయారని అన్నారు.

వాళ్లకు తెలియదు.. వారంతా బాగా డబ్బున్న కుటుంబాల్లో పుట్టి నవారు కాబట్టి వారికి పేదవాళ్ల కష్టాలు గురించి తెలియదు. అందుకే వారెప్పుడూ పేద వారిని పట్టించుకోలేదని అన్నారు. ఈ ఎన్నికల్లో మీకు ఇచిన హామీలకు మోడీ గ్యారెంటీ ఉంటారన్నారు. తరాలుగా కాంగ్రెస్ పార్టీ తుంగలోకి తొక్కిన అభివృద్ధిని నేను వెలుగులోకి తీసుకొచ్చానని అన్నారు.

## మధ్యప్రదేశ్ బిజెపి మూడో జాబితా..



మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు 39 మంది అభ్యర్థులతో బిజెపి అభ్యర్థుల జాబితా వెలువడింది. ఇందులో ముగ్గురు కేంద్ర మంత్రుల పేర్లు కూడా ఉన్నాయి. నరేంద్ర సింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, ఫగ్గాన్ సింగ్ కులాస్తేలకు టిక్కెట్లు కల్పించారు. ప్రధాని మోడీ భోపాల్లో బిజెపి కార్యకర్తల సమావేశంలో ప్రసంగించి వెళ్లిన తరువాత ఈ జాబితా వెలువడింది. కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ దిమానీ నుంచి, ఫుడ్ ప్రాసిసింగ్ మంత్రి ప్రహ్లాద్ పటేల్ నార్సింగ్‌పూర్ నుంచి, గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి ఫగ్గాన్ సింగ్ నివాస్ స్థానం నుంచి బరిలోకి దిగుతారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు, ఆయన ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది బిజెపి ఇప్పటివరకూ ప్రకటించలేదు. ఈ ఏడాది చివరిలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి.



## 72 అడుగుల ఎత్తైన దీన్‌దయాళ్ విగ్రహావిష్కరణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 : భారతీయ జనసంఘ్ సహ వ్యవస్థాపకులు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కులో ఏర్పాటు చేసిన 72 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం మోడీ మాట్లాడారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ జీవితం అందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. పేదలు, అట్టడుగు వర్గాల పట్ల కరుణతో సేవ చేయాలనే ఆయన సందేశం ప్రతిఒక్కరికీ మార్గదర్శనీయమన్నారు. రాజకీయాల్లో మహిళలకు సముచితమైన భాగస్వామ్యం లేకుండా సమ్మిళిత సమాజం, ప్రజాస్వామిక సమైక్యత గురించి మాట్లాడలేమన్నారు. పెద్ద లక్ష్యాలను పెట్టుకొని వాటి కోసం కృషి చేసేటప్పుడు, ప్రతిఒక్కరితో కలిసి ముందుకెళితే మన విజయాల స్థాయి కూడా పెరుగుతుందని మోడీ అన్నారు. వ్యక్తిగత విజయం కంటే ప్రజా విజయమే ఎల్లప్పుడూ గర్వించేలా చేస్తుందని తెలిపారు. ఈరోజు భారత్ తన కృషితో ఇమేజ్‌ను మార్చుకోవడంతో విదేశాల్లో సాధారణ భారతీయుడిని సైతం గౌరవంగా చూస్తున్నారన్నారు. చంద్రయాన్-3 విజయవంతమైన తర్వాత సామాన్య భారతీయుడిని ప్రపంచ దేశాల ప్రజలు అభినందిస్తున్నారన్నారు. జీ20 సదస్సు తర్వాత కూడా మన దేశాన్ని ప్రశంసిస్తున్న తీరు ప్రతి భారతీయుడి గౌరవాన్ని పెంచిందని మోదీ అన్నారు. దీన్ దయాళ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు.

## తమిళ నాట తంబి దూరై

చెన్నై, సెప్టెంబర్ 25 : దేశ, తమిళనాడు రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎన్డీఏ కూటమి నుంచి తాము వైదొలగుతున్నట్టు అన్నాడీఎంకే ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ సందర్భంగా అన్నాడీఎంకే నేతలు తమిళనాడు బీజేపీ నేతలపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా అన్నాడీఎంకే డిప్యూటీ కోఆర్డినేటర్ కేపీ మును స్వామి సోమవారం మీడియాతో మాట్లాడు తూ.. ఈరోజు నుంచి బీజేపీ, ఎన్డీయే కూటమితో అన్నాడీఎంకే తెగ తెంపులు చేసుకుంటోంది. సోమవారం జరిగిన పార్టీ సర్వ సభ్య సమావేశంలో ఈ మేరకు అన్నాడీఎంకే ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. బీజేపీ రాష్ట్ర నాయకత్వం మా పార్టీ నేతలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. గత ఏడాది కాలంగా మా పార్టీ జనరల్ సెక్రటరీ పళనిస్వామి, పార్టీ కేడర్‌పై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు మునుస్వామి. వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అన్నాడీఎంకే కొత్త కూటమిని ఏర్పాటు చేసి ఎన్నికలకు వెళ్తుందని స్పష్టం చేశారు. ఇక, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ కలిసి పోటీ చేసిన విషయం తెలిసిం దే. ఈ ఎన్నికల్లో డీఎంకే భారీ మెజార్టీతో విజయం సాధించింది. అయితే, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై దివంగత ముఖ్య మంత్రి జయలలితను విమర్శించడంతో మొదలుపెట్టి ఆ పార్టీ హ యాంలో జరిగిన అవినీతి జాబితాను విడుదల చేస్తానని అనడం, అలాగే, దివంగత సీఎం అన్నాదురై పైనా వివా దాస్పద వ్యాఖ్యలు చేయడం అన్నాడీఎంకే నేతలకు అస్సలు మింగుడుపడలేదు. దీంతో ఆ పార్టీలో సీనియర్లంతా అన్నా మలై తీరుపై నిప్పులు చెరిగారు. ఇదే తరుణంలో మాజీ మంత్రి జయకుమార్ సైతం అన్నామలై తీరుపై ఇటీవల కాస్త ఘాటుగానే స్పందించడం, ఢిల్లీలో బీజేపీ నేతలను అన్నాడీ ఎంకే నేతలు కలవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నా యి. కాగా, అన్నామలై తీరుపై బీజేపీ పెద్దలకు చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, వారి ప్రోద్బలం లేకుం డా ఆయన అలా మాట్లాడి ఉండరని పళనిస్వామి భావిం చినట్టు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. దీంతో అన్నా డీఎంకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మరోవైపు.. ఎన్డీయే కూటమి నుంచి అన్నాడీఎంకే బ యటకు రావడంతో ఆ పార్టీ నేతలు తమిళనాడులో సంబురాలు చేసుకున్నారు. పలు ప్రాంతాల్లో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపు కుంటున్నారు. అన్నాడీఎంకే ప్రకటనపై తమిళనాడు బీజేపీ చీఫ్ కే. అన్నామలై స్పందించారు. ప్రస్తుతం తాను దుర్గ పూజలో ఉన్నానని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రాజకీ యాలు మాట్లాడదలచుకో లేదని స్పష్టం చేశారు. దీనిపై తర్వాత మాట్లాడుతానని తెలిపారు.

## రైలులో రాహుల్ హల్‌చల్

రాయ్‌పూర్ : దేశంలో ఈ ఏడాది చివరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ స్పీడ్ పెంచింది. మరోవైపు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఫుల్ జోష్‌లో ఉన్నారు. దేశవ్యాప్తంగా ప్రజల్లోకి దూసుకెళ్తూ వినూత్నంగా ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం ఛత్తీసఢ్‌లో కొద్ది సేపు రైలులో ప్రయాణం చేశారు. బిలాస్‌పూర్ నుంచి రాయ్‌పూర్ వరకూ ఆయన ఇంటర్సిటి ఎక్స్‌ప్రెస్‌లో ఇతర ప్రయాణికులు, ప్రత్యేకించి కాలేజీ విద్యార్థినులు, యువతతో మాట్లాడుతూ సాగారు. కొద్ది సేపు ఆయన అందరూ అమ్మాయిలతో కలిసి కూర్చుని మాట్లాడారు. వారితో కలిసి సెల్ఫోన్ ఫోటోలు దిగారు. త్వరలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న దశలో ఇంతకు ముందు రైల్వే కూలీగా అవతారం ఎత్తిన రాహుల్ ఇప్పుడు ప్రయాణికుడు అయ్యారు. ఇప్పుడు రైలులో ఆయన పర్యటన సందర్భంగా వెంబడి ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి కుమారీ సెల్జా, పిసిసి అధ్యక్షులు దీపక్ బైజీ ఉన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తరచూ వందేభారత్ రైళ్లు, రైల్వేల మరింత ఆధునీకరణ అంటోందని, అయితే గత కొద్ది నెలల కాలంలోనే రాష్ట్రం మీదుగా వెళ్లే దాదాపు 2600 రైళ్లు రద్దు చేశారని కాంగ్రెస్ పార్టీ విమర్శిస్తోంది. ఈ వాదనను బలోపేతం చేస్తూ ఈ రైలులో ప్రయాణించిన రాహుల్ సగటు రైలు ప్రయాణికుల కష్టాల గురించి ఈ సందర్భంగా తెలుసుకున్నారు.

## అధికారంలోకి వస్తే కులగణన చేపడతాం

- కుల గణన వివరాల్లో గోప్యామెందుకు?
- 'ఆవాస్ న్యాయ సమ్మేళన్'లో రాహుల్ గాంధీ

బిలాస్‌పుర్, సెప్టెంబర్ 25 : తమ పార్టీ అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. యూపీఏ హయాంలో నిర్వహించిన కుల గణన వివరాలను ఎందుకు విడుదల చేయడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పుర్ జిల్లాలో ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'ఆవాస్ న్యాయ సమ్మేళన్'లో పాల్గొన్న రాహుల్.. బీజేపీ ప్రభుత్వంపై విరుచుకపడ్డారు. తమ పార్టీ రీమోట్ కంట్రోల్‌ను నొక్కితే సంక్షేమ ఫలాలు నిరుపేదలకు చేరతాయన్న రాహుల్... అదే బీజేపీ రీమోట్ కంట్రోల్ నొక్కితే అదానీకి విమానాశ్రయాలు, పోర్టులు, కాంట్రాక్టులు వస్తాయని విమర్శించారు. ప్రభుత్వా న్ని కేబినెట్ క్యార్యదర్శులు, కార్యదర్శులే నడుపుతారని... ఎంపీలు, ఎమ్మెల్యేలు కాదని అన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని 90 మంది కార్యదర్శుల్లో.. ముగ్గురు మాత్రమే ఉన్నారని పునరుద్ఘాటించారు. కేంద్ర బడ్జెట్‌లో ఐదు శాతాన్ని మాత్రమే వీరు నియంత్రిస్తున్నారన్న రాహుల్.. దేశంలో ఐదు శాతమే ఓబీసీలు ఉన్నారా అని ప్రశ్నించారు.



## ఖాకీ దుస్తుల్లో ఎవరొచ్చినా కరిచేలా శునకాలకు ట్రైనింగ్..

- తనిఖీల్లో పోలీసులకు భయానక అనుభవం



కొట్టాయం, సెప్టెంబర్ 25 : అనుమానిత డ్రగ్ డీలర్ ఇంట్లో ఆకస్మిక తనిఖీ చేపట్టిన పోలీసులపై ఒక్కసారిగా శునకాలు దాడి చేశాయి. ఖాకీ దుస్తులు ధరించిన వారిని గాయపరిచేలా వాటికి శిక్షణ ఇచ్చినట్లు తెలుసుకొని వారు కంగుతిన్నారు.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మాదకద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో కేరళలోని కొట్టాయంలో ఓ వ్యక్తి ఇంట్లో ఆదివారం రాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ బృందంలో ఘటనా స్థలానికి సమీపంలోని పోలీసు స్టేషన్కు చెందిన సిబ్బంది కూడా ఉన్నారు. సోదాల నిమిత్తం ఇంట్లోకి వెళ్లిన వారిపైకి ఒక్క సారిగా శునకాలు దూసుకెళ్లాయి. 'అనుమానిత డ్రగ్ డీలర్ ఇంట్లో అన్ని కుక్కలు ఉంటాయని ఊహించలేదు. అవి హింసాత్మకంగా ప్రవర్తిస్తాయని అనుకోలేదు. దాంతో మేం సరిగా సోదాలు చేయలేకపోయాం' అని కొట్టాయం ఎస్పీ వెల్లడించారు. అలాగే అధికారులు కుక్కల దాడి నుంచి తమను తాము రక్షించుకునే సమయంలో.. నిందితులు చక్కా జారుకున్నారని తెలుస్తోంది. అదృష్టవశాత్తూ ఏ ఒక్క అధికారి కూడా గాయపడలేదని ఎస్పీ తెలిపారు. అలాగే ఘటనా స్థలం నుంచి 17 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అంతేగాకుండా నిందితుడి గురించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

'ప్రాథమిక సమాచారం మేరకు.. నిందితుడు అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అతడు ఒక డాగ్ ట్రైనర్గా చెలామణీ అవుతున్నాడు. ఖాకీ దుస్తులు ధరించిన వారిని కరిచేలా కుక్కలకు ట్రైనింగ్ ఇచ్చాడు. అంతకుముందు శునకాలను అదుపు చేయడం ఎలా..? వంటి విషయాల గురించి విశ్రాంత బీఎస్ఎఫ్ అధికారి వద్ద శిక్షణ పొందాడు. అయితే ప్రత్యేకంగా ఖాకీ దుస్తులు ధరించిన వారిని గాయపరచడం గురించి ప్రశ్నలు అడగడంతో అతడిని గెంటేశారు. కానీ ప్రస్తుతం ఉంటున్న ఇంట్లో డాగ్ ట్రైనర్గా అందరికీ పరిచయం కావడంతో.. ఆ ప్రాంతవాసులు అతడింట్లో తమ శునకాలను వదిలివెళ్లేవారు. అందుకోసం ఒక్కో శునకానికి రోజుకు వెయ్యి రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు' అని ఎస్పీ తెలిపారు.

అలాగే ఘటన సమయంలో అతడి వద్ద 13 శునకాలు ఉన్నాయని, వాటిని యజమానులకు అప్పగించామని వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ డ్రగ్ రాకెట్ వెనుక ఎవరెవరు ఉన్నారో గుర్తించనున్నామని చెప్పారు.

## ఎన్డీయేలో తిరిగి చేరే ప్రసక్తే లేదు

బీహార్, సెప్టెంబర్ 25 : బీజేపీ నేతత్వంలోని ఎన్డీయేలో తమ పార్టీ తిరిగి చేరుతుందన్న ఊహాగానాలను జేడీయూ అధినేత, బీహార్ ముఖ్య మంత్రి నితీశ్ కుమార్ తోసిపుచ్చారు. ఎన్డీయేలో తిరిగి చేరతారనే మీడి యాలో ఊహాగాహాలను ఆయన కొట్టిపారేశారు. ఎన్డీయేలో తిరిగి చేరే ప్రసక్తే లేదు. ఎన్డీయే ఏడాది క్రితమే బంధం తెగిపోయిందని, ప్రతిపక్ష ఇండియా కూటమిని బలోపేతం చేయడమే తన ప్రధాన ధ్యేయమని నితీష్‌కుమార్ పేర్కొన్నారు. ఊహాగానాలపై విలేకరుల ప్రశ్నలకు నితీష్ కుమార్ స్పందిస్తూ.. ఏం చెత్త మాటలు అని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఇండియా కూటమిలో కీలక వ్యక్తి అయిన జేడీయూ నాయకుడు నితీష్ కుమార్‌కు మంచి ప్రధాని అయ్యే అన్ని లక్షణాలు ఉన్నాయని పార్టీ సహ చరులు మాట్లాడడం పట్ల తన అసంతప్తిని వ్యక్తి చేశారు. ఇలాంటి ప్రకట నలు చేయొద్దని తాను ఇప్పటికే తన పార్టీ సహచరులకు చెప్పానన్నారు. ఇండియా కూటమి ఐక్యతను బలోపేతం చేయడమే తన ఏకైక కోరిక అని నితీష్ పేర్కొన్నారు. తాను ఆ దిశలో మాత్రమే పనిచేస్తున్నానన్నారు. బీహార్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, సీనియర్ జేడీ(యు) నాయకుడు మహేశ్వర్ హాజరై మాట్లాడుతూ.. ఇండియా కూటమికి ప్రధాని అభ్యర్థిగా నితీష్ కుమార్ కంటే మరెవ్వరూ సమర్థులు కాదని అన్నారు. మంత్రివర్గ విస్తరణకు అవకాశంపై అడిగిన ప్రశ్నకు.. నితీష్ కుమార్ తన డిప్యూటీ తేజస్వి యాదవ్ కోర్టులో బంతిని ఉంచారు. మంత్రివర్గ విస్తరణ ఊహాగానాలపై తనను అడిగిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రశ్న ఉప ముఖ్యమంత్రిని అడగండి అంటూ మాట్లాడారు. జేడీయూ నేత నేతత్వంలోని రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం 28 మంది మంత్రులు ఉన్నారు. లాలూ యాదవ్‌కు చెందిన ఆర్జేడీ పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులు రాజీనామా చేసినప్పటికీ సింహభాగం అనుభవిస్తున్నారు. ఇటీవల లోక్‌సభలో బీఎస్పీ శాసనసభ్యుడు డానిష్ అలీపై బీజేపీ ఎంపీ రమేష్ బిధూరి చేసిన అవమానకరమైన వ్యాఖ్యలపై నితీష్ కుమార్ మాట్లాడుతూ.. ఈ అంశాన్ని వదిలేయండి. మా ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పని చేస్తోంది అని అన్నారు.

## నేడు ప్రభుత్వ శాఖల్లో రోజ్‌గార్ మేళా

- 51 వేల మందికి నియామకపత్రాలు అందించనున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 : వివిధ ప్రభుత్వ శాఖల్లో కొత్తగా నియమితులైన ఉద్యోగులకు ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దాదాపు 51,000 అపాయింట్‌మెంట్ లెటర్‌లను పంపిణీ చేయనున్నారు. దేశవ్యాప్తంగా 46చోట్ల 'రోజ్‌గార్ మేళా' నిర్వహించనున్నట్లు పీఎంవో తెలిపింది. సెప్టెంబర్ 26న రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో వర్చువల్ మీడియం (వీడియో కాన్ఫరెన్సింగ్) ద్వారా కొత్తగా నియమితులైన 51000 మంది ఉద్యోగులకు ప్రధాని నరేంద్ర మోడీ అపాయింట్‌మెంట్ లెటర్లను కేటాయి స్తారు. కొత్త ఉద్యోగులు తపాలా శాఖ, ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవిన్యూ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌తో సహా వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో చేరనున్నారు. ఉద్యోగులు కర్మయోగి పోర్టల్ ద్వారా శిక్షణ పొందగలరు. ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న ప్రధానమంత్రి నిబద్ధతను నెరవేర్చే దిశగా ఈ ఉపాధి మేళా ఒక ముందడుగు అని పీఎంవో పేర్కొంది. ఇది మరింత ఉపాధి కల్పనలో ఉత్ప్రేరకంగా పని చేస్తుందని, యువతకు వారి సాధికారత, దేశాభివృద్ధిలో భాగ స్వామ్యం కోసం అర్థవంతమైన అవకాశాలను అందిస్తుందని భావిస్తున్నారు. కొత్తగా నియమితులైనవారు కర్మయోగి స్టార్ట్, కర్మయోగి పోర్టల్‌లోని ఆన్‌లైన్ మాడ్యూల్ ద్వారా శిక్షణ పొందే అవకాశాన్ని కూడా పొందనున్నారు. ఇక్కడ 'ఎనీవేర్ ఎనీ డివైస్' లెర్నింగ్ ఫార్మాట్‌లో 680 పైగా ఈ-లెర్నింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.


## 5 రోజులే గడువు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 : రూ.2వేల కరెన్సీ నోట్లను మార్కెట్లో చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్లు గత మే 19న ఆర్బీఐ ప్రకటించింది. కరెన్సీ నోట్లను మార్చుకోవడానికి గానీ, బ్యాంకుల్లో డిపాజిట్ చేయడానికి గానీ సెప్టెంబర్ 30 వరకు ఆర్బీఐ గడువు విధించింది. ఈ క్రమంలో ఆర్బీఐ విధించిన డెడ్‌లైన్ మరో ఐదు రోజుల్లో ముగియబోతోంది. ఈ క్రమంలోనే ఎవరైన తమ వద్ద ఇంకా రూ.2వేల నోట్లు ఉంటే మార్చుకుంటే బెటర్. కాగా, ఈ నోట్ల మార్చుకునేందుకు 5 రోజులే సమయం ఉండగా.. అందులో ఒకరోజు దేశంలోని పలు ప్రాంతాల్లోని బ్యాంకులకు సెలవు ఉంది. సెప్టెంబర్ 25 నుంచి 27 వరకూ (సోమవారం నుంచి బుధవారం) బ్యాంకులు యథావిధిగా పనిచేయనున్నాయి. ఇక 28వ తేదీన గురువారం నాడు బ్యాంకులకు సెలవు. అనంతరం 29, 30 తేదీల్లో బ్యాంకులు పనిచేస్తాయి. ఈ నాలుగు రోజుల్లోనే మీ వద్ద ఉన్న రూ.2వేల నోట్లను మార్చుకునేందుకు వీలు ఉంటుంది. అందుకని వినియోగదారులు బ్యాంకు పనివేళలను తెలుసుకొని 2వేల రూపాయల నోట్లతో వెళ్తే మంచిది. మరోవైపు పెద్ద నోట్ల మార్పిడికి పెట్టిన డెడ్‌లైన్‌ను ఆర్బీఐ పొడగించే అవకాశం ఉందని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. సెప్టెంబరు చివర్లో సెలవుల నేపథ్యంలో రూ.2వేల నోట్లను మార్చుకునేందుకు ఇంకో రెండువారాల గడువు ఇచ్చే అవకావం ఉందని అంచాన వేస్తున్నారు. అయితే, ఈ విషయంలో ఆర్బీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. మే 19న రూ.2వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు సెంట్రల్ బ్యాంక్ ప్రకటించింది. అయితే ఈ నోట్లను ఖాతాల్లో డిపాజిట్ చేయడానికి లేదా వాటిని బ్యాంకుల్లో మార్చుకోవడానికి సెప్టెంబర్ 30 వరకు ప్రజలకు సమయం ఇచ్చింది. దీంతో ప్రజలు తమ వద్ద ఉన్న నోట్లను ఇప్పటికే మార్చుకున్నారు. బ్యాంకుల నుండి అందిన డేటా ప్రకారం, సెప్టెంబరు 1 నాటికే రూ.3.32 లక్షల కోట్ల విలువైన రూ. 2,000 నోట్లు ఆర్‌బీఐ వద్దకు చేరాయి. దీంతో దేశంలో చలామణిలోకి పంపిన రూ.2వేల నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేసినట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవలే వెల్లడించింది.



# అమ్మాయిలు సాధించారు.. ఇక అబ్బాయిలే తరువాయి!




చైనాలో జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. ఫేవరెట్‌గా బరిలోకి దిగి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ పోటీల్లో ప్రధాన జట్టు కాకుండా రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో యువకుల తో కూడిన టీమిండియా బరిలోకి దిగనుంది. తెలంగాణ కుర్రాడు ఠాకూర్ తిలక్ వర్మకు ఆసియా క్రీడల జట్టులో చోటు దక్కిన విషయం తెలిసిందే. కానీ, ఆసియా క్రీడల చివరి రోజు పురుషుల క్రికెట్ గోల్డ్ మెడల్ మ్యాచ్ జరగనుంది. రోహిత్ శర్మ సారథ్యంలోని ప్రధాన జట్టు ఆస్ట్రేలియాతో మూడు వన్డే సిరీస్ ఆడుతోంది. అనంతరం అక్టోబర్ 5న వన్డే ప్రపంచ కప్ మొదలవ్వనుంది. 2 ఏండ్ల తర్వాత స్వదేశంలో జరుగనున్న ఈ మెగా టోర్నీలో టీమ్‌ఇండియా ట్రోఫీపై కన్నేసింది. అందుకని సెలెక్టర్లు యువకులతో కూడిన జట్టును ఆసియా గేమ్స్‌కు ఎంపిక చేశారు. మహిళల విభాగంలో భారత జట్టు నేరుగా క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. వర్షం కారణంగా మయన్మార్‌తో మ్యాచ్ రద్దు అయినప్పటికీ మెరుగైన ర్యాంకింగ్స్ కారణంగా స్మృతి మంధాన సేన సెమీ ఫైనల్‌కు చేరింది. ఇక సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై సునాయాస విజయం సాధించిన టీమ్ ఇండియా ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించింది. శ్రీలంకతో సోమవారం జరిగిన జరిగిన టైటిల్ పోరులో హర్మన్‌ప్రీత్ బృందం 19 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. తుదిపోరులో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 7 వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది. స్మృతి మంధన (46), జెమీమా రోడ్రిగ్స్ మాత్రమే (42) రాణించారు. అనంతరం లంక 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 97 పరుగులకే పరిమితమైంది.

## నంబర్ 1 జట్టుకే ట్రోఫీ.. టీమిండియాకు సెంటిమెంట్ కలిసొచ్చేనా!



క్రికెట్లో ఆటగాళ్ల ప్రతిభతో పాటు అప్పుడప్పుడు సెంటిమెంట్లకూ చాలా ప్రాధాన్యం దక్కుతుంది. మరో పది రోజుల్లో భారత్ వేదికగా వన్డే ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఇలాంటి ఓ సెంటిమెంట్ భారత అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. అదేంటంటే.. రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు నంబర్ 1గా ఈ మెగా టోర్నీలో బరిలోకి దిగుతోంది. గత రెండు పర్యాయాలు ర్యాంకింగ్స్లో అగ్రస్థానంలో ఉన్న జట్లే ట్రోఫీని ముద్దాడాయి. దాంతో ఈసారి కూడా అదే సెంటిమెంట్ కొనసాగుతుందని అభిమానులు భావిస్తున్నారు. మైకేల్ క్లార్క్ సారథ్యంలోని ఆస్ట్రేలియా జట్టు వన్డేల్లో నంబర్ 1 ర్యాంక్తో 2015లో వరల్ కప్లో అడుగుపెట్టింది. అంచనాలకు తగ్గట్టే రాణించి ఫైనల్ చేరింది. తుదిపోరులో న్యూజిలాండ్ను మట్టికరిపించి ఐదోసారి విశ్వ విజేతగా నిలిచింది. ఇక 2019లో ఇంగ్లండ్ వేదికగా జరిగిన వరల్ కప్లో ఆతిథ్య జట్టు నంబర్వన్ ర్యాంక్తోనే టైటిల్ వేట ప్రారంభించింది. బెన్ స్టోక్స్, జోఫ్రా ఆర్చర్ విజృంభించంతో ఫైనల్లో న్యూజిలాండ్‌పై అద్భుత విజయం సాధించింది. అలా ఇయాన్ మోర్గాన్ సేన తొలిసారి వన్డే చాంపియన్గా అవతరించింది. దీంతో ముచ్చటగా మూడోసారి కూడా నంబర్ 1 జట్టే ట్రోఫీ గెలుస్తుందనే వార్తలు ఊపందుకున్నాయి. ఇదొక్కటే కాదు మరో సారుప్యత కూడా కనిపిస్తోంది. 2011 వరల్ కప్ నుంచి ఆతిథ్య జట్టే కప్పు నెగ్గుతూ వస్తోంది. 2011లో భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్ సంయుక్తంగా నిర వ్వాంచిన వరల్డ్కప్లో ధోనీ సేన ట్రోఫీ కైవసం చేసుకుంది. 2015లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఆతిథ్యమివ్వగా ఆసీస్ విజేతగా నిలిచింది. 2019లోనూ ఆతిథ్యమిచ్చిన ఇంగ్లండ్ జట్టే ప్రపంచకప్ ట్రోఫీని కొల్లగొట్టింది. ఈ సెంటిమెంట్ ప్రకారంగా చూసినా భారత్ ఆతిథ్య హోదాలో చాంపియన్‌గా నిలుస్తుదని మజీ క్రికెటర్లు, అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## పాక్ జట్టుకు వీసా మంజూరు..

### రెండు రోజుల్లో హైదరాబాద్‌కు బాబర్ సేన



వన్డే వరల్డ్ కప్ పోటీలకు భారత్ రావాల్సిన పాకిస్థాన్ జట్టుకు వీసా ఓకే అయింది. ఇస్లామాబాద్‌లోని భారత దౌత్య కార్యాలయంలో వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో పాక్ బృందానికి వీసా మంజూరు చేశారు. దాంతో, రెండు రోజుల్లో బాబర్ ఆజాం నేతృత్వంలోని పాకిస్థాన్ జట్టు, సహా యక సిబ్బంది ఇండియాకు రానున్నారు. భారత వీసా కోసం పాక్ జట్టు నిరీక్షించాల్సి వచ్చింది. వీసా ఆలస్యం కావడంతో ముందే ప్లాన్ చేసుకున్న దుబాయ్ టీమ్ బాండింగ్ ట్రిప్పు పాక్ క్రికెట్ బోర్డు రద్దు చేసుకుంది. అంతేకాదు ఈ విషయంపై ఐసీసీకి ఫిర్యాదు కూడా చేసింది. అయితే.. వీసా ఓకే కావడంతో పాక్ ఆటగాళ్లు, సిబ్బంది ఇండియా విమానం ఎక్కేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రపంచ కప్ ముందు బాబర్ సేన హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో రెండు వామప్ మ్యాచ్లు ఆడనుంది.

# బోల్డ్ లుక్‌లో శ్రీముఖి



మనం సినిమా

## క్రికెటర్ ప్రేమలో పూజా..

### మరి ఆ డైరెక్టర్ పరిస్థితి ఏంటి.. ?



బుట్టబొమ్మ పూజా హెగ్డే ప్రేమలో పడిందా.. ? అంటే .. నిజమే అని బాలీవుడ్ వర్గాలు కోడై కూస్తున్నాయి. గత రెండేళ్లుగా పూజాకు హిట్ అందుకుంది లేదు. ఇక పూజా కెరీర్ ఫినిష్ అని కొందరు.. ? పూజా కమ్ బ్యాక్ ఎప్పుడు ఇస్తుందో అని మరి కొందరు మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం పూజా హెగ్డే చేతిలో ఒక ప్రాజెక్ట్ మాత్ర మే ఉంది. ఈ మధ్యనే గుంటూరు కారం చిత్రం నుంచి బయటకు రావడంతో మంచి ఛాన్స్ ను మిస్ చేసుకుంది. ఇక ఆ చిత్రంలోనే ఈ భామ ఐటెం సాంగ్ చేస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సినిమాలు చేయకపోయినా కూడా సోషల్ మీడియాలో తన అందాల ఆరబోతతో కుర్ర కారుకు దగ్గరగానే ఉంటుంది. గతకొన్ని రోజులుగా పూజా .. ఒక క్రికెటర్ ప్రేమలో ఉందని బాలీవుడ్ మీడియాలో కథనా లు వస్తున్నాయి. అయితే ఆ క్రికెటర్ ఎవరు అనేది మాత్రం సస్పెన్స్‌గా ఉంచారు. ఇక దీంతో పూజా ప్రేమలో పడిందంటూ నెటిజన్స్ సైతం నమ్మేస్తున్నారు. అయితే ఇందులో నిజం ఎంత అనేది తెలియాల్సి ఉంది. ఇక ఈ విషయం తెలియడంతో నెటిజన్స్.. తమదైన రీతిలో కౌంటర్లు వేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఒక డైరెక్టర్ తో పూజా.. క్లోజ్‌గా ఉంటుందని వార్తలు వస్తున్న విషయం తెల్సిందే. ఇక ఇప్పుడు పూజా క్రికెటర్‌తో ప్రేమలో పడితే డైరెక్టర్ పరిస్థితి ఏంటో అని కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఇలాంటి సమయంలో పూజాకు ఇది మరో పెద్ద దెబ్బ అని చెప్పుకొస్తున్నారు. ఎందుకంటే .. ప్రస్తుతం పూజా కెరీర్‌ను చక్కదిద్దుకునే సమయంలో ఇలాంటి రూమర్స్ మంచిది కాదని కొందరు చెప్పుకొస్తున్నారు.

బోల్డ్‌కు కేరాఫ్ అడ్రస్ అయిన శ్రీముఖి తన లేటెస్ట్ లుక్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. హాట్ డ్రెస్‌లో ఈ బ్యూటీ మంటలు రేపింది. అందాలతో అదరగొట్టింది. దాంతో ఈ అమ్మడు హాట్ లుక్ వైరల్ గా మారింది. యాంకర్‌గా తన కేరీర్ ను ప్రారంభించింది శ్రీముఖి. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో కూడా నటించి ప్రేక్షకులకు దగ్గరైంది. పైగా, ఈ మధ్య అవకాశాలు కూడా పెరిగాయట. ఈ క్రమంలో బోల్డ్‌లుక్‌తోనూ శ్రీముఖి సోషల్ మీడియాలోనూ షేక్ చేస్తుంది. గ్లామర్ రోల్స్,, స్పెషల్ సాంగ్స్‌లో నటిస్తూ సెన్సేషన్‌గా మారడానికి శ్రీముఖి తెగ కష్ట పడిపోతుంది. తాజాగా శ్రీముఖి చేసిన ఫోటో షూట్ నెట్టింట వైరల్‌గా మారింది. టాప్‌లో హాఫ్ క్లీవేజ్ షోతో, టైట్ ఫిట్టింగ్ డ్రెస్‌తో, పలుచటి స్లీవ్ ధరించి నెట్టింట శ్రీముఖి గ్లామర్ బాంబ్ పేల్చింది. మత్తు ఫోజులతో మైమరిపించింది. ఈ కుర్ర భామ ఫొటోషూట్‌కు నెటిజన్లు కూడా ఫిదా అవుతున్నారు. లైక్స్, కామెంట్లు పెడుతూ వైరల్ చేస్తున్నారు.

## 'కన్నప్ప' కోసం 600 మంది త్యాగం చేశారు

### డ్రీమ్ ప్రాజెక్ట్‌పై మంచు విష్ణు పోస్ట్



హీరో మంచు విష్ణు కలల ప్రాజెక్టు 'కన్నప్ప'. ఇటీవల పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ న్యూజిలాండ్లో సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలియజేస్తూ ప్రేక్షకుల ఆశీస్సులు కోరారు విష్ణు. ''ఇది నా ఏడేళ్ల కల. శివపార్వతుల ఆశీస్సులతో సాకారమైంది. ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ ఎనిమిది నెలలుగా విశ్రాంతి లేదు. ఈ ప్రయాణంలో నిద్రలేని రాత్రులెన్నో! పండగ వేడుకలకు దూరంగా ఉన్నాం. సెలవులు లేవు. ఆందోళన, భయం ఇంకా వెంటాడుతూనే ఉన్నప్పటికీ మనస్సు దృఢంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా నటీనటులు, సాంకేతికనిపుణులు కలిపి మొత్తం 600 మంది ఎన్నో త్యాగాలు చేసి కన్నప్ప కోసం న్యూజిలాండ్ వచ్చారు'. ''కన్నప్ప' సినిమా కాన్సెప్టును నటుడు తనికెళ్ల భరణి ఏడేళ్ల క్రితం నాతో పంచుకున్నారు. దాన్ని మరింత పెద్దగా తీర్చిదిద్దేందుకు పలువురు ప్రతిభావంతులను సంప్రదించా. ఈ స్క్రిప్టు లార్జర్ దేన్ లైఫ్‌గా మారేందుకు రచయితలు పరుచూరి గోపాలకృష్ణ, విజయేంద్ర ప్రసాద్, తోటపల్లి సాయినాథ్, తోట ప్రసాద్, దర్శకులు నాగేశ్వర రెడ్డి, ఈశ్వర్ రెడ్డి కలిసి సహకారం అందించారు. 'నేను ఇది చేయగలనా?' అని సందేహంలో ఉన్న నన్ను నాన్న నమ్మారు. సపోర్ట్‌గా నిలిచారు. సోదరుడు వినయ్ మోటివేట్ చేశాడు. ఇందులో సూపర్‌స్టార్లు నటిస్తున్నారని చెప్పేందుకు చాలా ఆనందంగా ఉంది. ఆ జాబితాను త్వరలోనే ప్రకటిస్తా. చిత్రీకరణ పూర్తయ్యే వరకు ఎలాంటి దృశ్యాలు/వివరాలు బయటకు రాకుండా మా వంతు ప్రయత్నం చేస్తున్నప్పటికీ లీకుల బెడద సవాలుగా మారుతోంది. ఈ సినిమా అప్డేట్స్ కోసం నిర్మాణ సంస్థ 'ఎక్స్' (ట్విటర్) హ్యాండిల్‌ని అనుసరించాలని సినీ అభిమానుల కు విజ్ఞప్తి చేస్తున్నా. సినిమా ప్రారంభమైన సందర్భంగా మీ ప్రేమ, మద్దతు కోరుతున్నా. 'కన్నప్ప' ఓ సినిమా మాత్రమే కాదు ప్రేమ, అంకిత భావం, అచంచల విశ్వాసంతో కూడిన శ్రమ'' అని పేర్కొన్నారు. స్టార్ ప్లస్లో 'మహాభారత' సిరీస్‌ను తెరకెక్కించిన ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై మోహన్‌బాబు, మంచు విష్ణు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కథానాయికగా నుపుర్ సనన్ ఎంపికైనా డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆమె వైదొలిగారు. మరోవైపు, ఈ సినిమాలో ప్రభాస్, నయనతార కీలక పాత్రలు పోషించే అవకాశాలున్నాయంటూ రూమర్స్ వచ్చాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500 037.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.